# బాలల బొమ్మల

# బొమ్మరిల్లు కథలు



తాతయ్య చెప్పిన కథలు

పేజ్ మేకింగ్:
సరస్వతి గ్రాఫిక్స్
విజయవాడ

ప్రథమ ముద్రణ:
ఏప్రిల్ 2009

ముద్రణ:
రమణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ

ముఖచిత్రం:
రమణ

పబ్లిషర్స్:
**సరస్వతి పబ్లికేషన్**
కాజా వెంకటేశ్వరరావు వీధి,
అరండల్ పేట, సహారా బ్యాంక్ ఎదుట,
విజయవాడ - 2

TATAIAH CHEPPINA KATHALU

Price : 50-

D.T.P. by
SARASWATHI Graphics
VIJAYAWADA

First Edition:
April 2009

Printed at:
Ramana Offset Printers
VIJAYAWADA

Cover page:
Ramana

Publishers:
SARASWATHI PUBLICATION
Kaza Venkateswara Rao Street,
Arundelpet, Opp. Sahara Bank,
VIJAYAWADA - 2

ఈ పుస్తకం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినా పొరపాట్లు దొర్లి ఉండవచ్చును. మాకు తెలిపిన మలిముద్రణలో సవరించగలము

# తాతయ్య చెప్పిన బొమ్మరిల్లు కథలు



**సరస్వతి పబ్లికేషన్**
కాజా వెంకటేశ్వరరావు వీధి, అరండల్ పేట,
సహారా బ్యాంక్ ఎదుట, విజయవాడ -2.

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | సంపద తెచ్చే సుఖం | ...... | 5 |
| 2. | చంద్రగిరి | ...... | 9 |
| 3. | సత్యరాజు | ...... | 13 |
| 4. | శాపవిమోచనం | ...... | 24 |
| 5. | అత్తకు తగ్గ కోడలు పిల్ల | ...... | 29 |
| 6. | సోమరిపోతు | ...... | 31 |
| 7. | మాంత్రికుడు – యువరాజు | ...... | 35 |
| 8. | సవతి తల్లి – తుంటరి భూతం | ...... | 39 |
| 9. | యువరాజు – బంగారు చేప | ...... | 43 |
| 10. | వదలని శాపం | ...... | 47 |
| 11. | అతిథి | ...... | 49 |
| 12. | మంత్రవాది కూతురు | ...... | 55 |
| 13. | విధి వ్రాత తప్పదు | ...... | 62 |
| 14. | కథ, కథ, కథ కంగుభళా! | ...... | 67 |



# సరస్వతి వారి నూతన ప్రచురణలు

1. వాల్మీకి రామాయణము - 100-00
2. అన్నమాచార్య సంకీర్తనలు - 40-00

## చిల్డ్రన్ సిరీస్

1. పంచతంత్రం - 50-00
2. తెనాలి రామకృష్ణ కథలు - 50-00
3. అక్బర్, బీర్బల్ కథలు - 50-00
4. పిల్లల నీతి కథలు - 50-00
5. ఆలీబాబా నలభై దొంగలు - 50-00
6. బేతాళ కథలు - 50-00
7. అల్లా ఉద్దీన్ అద్భుత దీపం - 50-00
8. పరమానందయ్య శిష్యుల కథ - 50-00
9. తాతయ్య చెప్పిన కథలు - 50-00
10. భట్టి విక్రమార్క కథలు - 50-00
11. చందమామ కథలు - 50-00
12. బామ్మ చెప్పిన కథలు - 50-00
13. అరేబియన్ నైట్స్ - 50-00

భార్య పులిహోర పూర్తిగా తినే దాకా ఉండి, అప్పుడు తలుపు తట్టసాగాడు. తాయారమ్మ, అప్పుడే నిద్ర లేచి వస్తున్నదానిలాగా, ఆవులిస్తూ వచ్చి తలుపు తీసింది.

తాతాచారి ఏం మాట్లాడకుండా వచ్చి మంచంపై కూర్చున్నాడు. తాయారమ్మ కూడా వచ్చి అతని ప్రక్కనే కూర్చుని, ఈ రాత్రికి చెప్పాల్సిన కథ చెప్పరూ... అన్నది గారాబంగా.

దాంతో తాతాచారికి వళ్ళు మండిపోయింది. ఆ రాత్రి కథ ఇలా చెప్పసాగాడు. కథ, కథ, కథ కంగు భళా – పీటెడు పులిహోర మింగుభళా, నువ్వటుక్కు, నేనిటుక్కు, దివ్వెచిటుక్కు. దాంతో తాయారమ్మ తన పులిహోర సంగతి భర్తకి తెలిసింది అని గ్రహించి గతుక్కుమన్నది.





తాతయ్య చెప్పిన కథలు

## సంపద తెచ్చే సుఖం

పూర్వం గంగవరం అనే గ్రామంలో రాజయ్య అనే పేదరైతు ఉండేవాడు. అతనికున్న ఏకైక ఆస్తి ఒక ఎకరం పొలం మాత్రమే. దాంతో రాజయ్య, ఆయన భార్య, నలుగురు మగపిల్లలు ఆ పొలంలోనే కూరగాయలు పండిస్తూ ఉండేవారు. రాజయ్య సంతానం ఆ నలుగురు మగపిల్లలే. వాళ్ళలో పెద్దవాడికి పాతికేళ్ళు, ఆఖరి వాడికి 18 ఏళ్ళ వయస్సు.

అనుకోకుండా వచ్చే వర్షాలు, చీడలు, పీడల వల్ల రాజయ్యకి తన కూరగాయలు పండించే పొలంపై తగిన రాబడి వచ్చేది కాదు. ఆ ఇంట్లో రెండు పూటలా కడుపు నిండా తిండి తినే అదృష్టం చాలా ఏళ్ళగా లేదు. దాంతో రాజయ్య పిల్లలు బక్కచిక్కి ఉండేవాళ్ళు. అయినా సరే వాళ్ళంతా తండ్రికి పొలంలో చేతనయినంత సాయం చేసేవాళ్ళు.

వాళ్ళకి సరిగ్గా తిండే పెట్టలేని రాజయ్య ఇంక చదువులు ఏం చెప్పిస్తాడు. పగలంతా పొలంలో పనిచేసి సాయంత్రానికి ఇల్లు చేరుకుని, ఏదో కాస్త ఉడకేసుకుని తిని నిద్రపోవటం వాళ్ళ దినచర్య. పండుగలు, వేడుకలు అన్న విషయం వాళ్ళకి తెలీదు. కుటుంబానికి పట్టిన ఈ దౌర్భాగ్య స్థితిని చూసి రాజయ్య మనసులోనే కుమిలిపోతూ ఉండేవాడు.

ఒక రోజు రాజయ్య పొరుగూరు వెళ్దామని బయలుదేరాడు. సగం దూరం నడిచాక బాగా దాహంగా అనిపించి, మార్గమధ్యంలో కనిపించిన ఒక చెరువులోకి దిగి, కడుపు నిండా మంచినీళ్ళు త్రాగి, ఆ చెరువు గట్టున చెట్టు క్రింద ఉన్న ఒక అమ్మవారి గుడి అరుగు మీద కూర్చున్నాడు. ఆ చెరువు గట్టున ఉన్న అమ్మవారి గుడికి ఎవరూ రారు.

వచ్చినా ఏదో నెలకో, సంవత్సరానికో వస్తారు. దాంతో ఆ గుడిలోని అమ్మవారు పూజాపునస్కారాలు లేక దీనంగా పడి ఉన్నది. రాజయ్య లేచి ఆ అమ్మవారి విగ్రహం ముందు నుంచుని అమ్మవారిని ఇలా ప్రార్థించాడు.

“అమ్మా ఈశ్వరీ! నీకు పూజలు చేసేవాళ్ళు లేక ఇలా ఉసూరుమంటూ ఈ గుడిలో కూర్చున్నావు. నీకు నిజంగా మహత్తు ఉంటే నన్ను కోటీశ్వరుడిని చెయ్యి ఆపై నీకు ధూప, దీప, నైవేద్యాలతో ప్రతిరోజూ రెండు పూటలా పూజలు జరిపిస్తా. పండుగలకి నీకు బంగారు ఆభరణాలు చేయిస్తా”. తనని ప్రార్థించే వాళ్ళే లేక దిగులుగా ఉన్న ఆ అమ్మవారు, రాజయ్య ప్రార్థనలని ఆలకించి, తథాస్తు అన్నది.

మర్నాడు రాజయ్య పెద్దకొడుకు అరటి పిలకలు నాటుదామని నేలని త్రవ్వుతుండగా, ఒక లంకెబిందె కన్పించింది. దాన్ని తెరిచి చూసిన రాజయ్యకి, ఆ బిందెలో లక్ష బంగారు నాణాలు కన్పించాయి. దాంతో రాజయ్య దశ మారిపోయింది. తాను ఉండే పాత ఇల్లు పడగొట్టి, కొత్త భవనం నిర్మించాలని, పాత ఇంటిని తొలగించి, కొత్త ఇంటికి పునాదులు త్రవ్వుతూ ఉంటే, ఆ గుంటలలో వజ్రాలు, రత్నాలు దొరికాయి.


దాంతో రాజయ్య సంపద కోట్లకి చేరింది. పెద్ద భవనం నిర్మించాడు రాజయ్య. అతని పెద్దకొడుక్కి, ఓ జమిందారు గారి అమ్మాయితో వివాహం జరిగింది. రెండోకొడుక్కి పిల్లనిస్తామని, దేశంలోని కోటీశ్వరులు చాలామంది వర్తమానాలు పంపించసాగారు. ఈ సంపద, దాస, దాసీ జనాన్ని చూసుకొన్న రాజయ్య ఆనందం ఆకాశాన్ని దాటింది.

ఇప్పుడు రాజయ్య పేరు రాజేశ్వర భూపతిగా మారింది. ఒకానొక సమయంలో రాజయ్య పెద్దకోడలు ప్రసవించింది. ఒక పండంటి మగబిడ్డ పుట్టాడు. ఆ పిల్లాడికి, తమ తండ్రి రాజయ్య పేరే పెట్టుకున్నాడు పెద్ద



కొడుకు. రాజయ్యకి గౌరవం, పరపతి పెరిగిపోయాయి. కానీ తనకు ఇంత మేలు చేసిన, చెరువు గట్టు అమ్మవారి విషయం మర్చిపోయి తన పనులు చూసుకుంటూ ఉండిపోయాడు రాజయ్య.

ఎన్నాళ్ళకీ తన మొక్కు సంగతి పట్టించుకోని రాజయ్యకు అమ్మవారు కలలో కనబడి “రాజయ్యా? ఏమిటయ్యా ఇది, నిన్ను కోటీశ్వరుడ్ని చేస్తే,





నాకు నిత్యం పూజలు జరిపిస్తానని వాగ్దానం చేసావు. నీ మాట నమ్మి నీకు సకల సంపదలు ఇచ్చాను. నీవు, నా విషయం మర్చిపోయి, విలాసాలలో తేలి ఆడుతున్నావు” అన్నది దీనంగా.

అప్పుడు రాజయ్య, తల్లీ, నా వ్యాపారవ్యవహారాలకు, నా బిడ్డల ముద్దు ముచ్చట్లకే నా సమయం చాలటం లేదు. ఇంత హడావుడి పరిస్థితిలో, నీకు పూజలు చేయించే తీరక నాకు ఎక్కడుంది. అయినా నాకు సంపదలు నీవే ఇచ్చావని నాకు ఎలా తెలుస్తుంది? ఏదో నా దశ తిరిగి నేను సంపన్నుడిని అయి ఉండవచ్చు కదా అన్నాడు ఎగతాళిగా.

దాంతో అమ్మవారికి ఆగ్రహం కల్గి, ఒరేయ్ రాజయ్యా! ఏరుదాటి తెప్ప తగలేసే నీ బుద్ధి నాకు బాగా అర్థమయింది. ఇక నా శక్తి ఏంటో చూద్దువుగాని, అని మాయం అయింది. రాజయ్యకు మెలుకువ వచ్చి, లేచి కూర్చుని, తనకు వచ్చిన కల గురించి ఆలోచించాడు. ముందు అమ్మవారికి కోపం వచ్చింది అని కొంచెం భయపడ్డాడు. ఆపై ఇలా అనుకున్నాడు.

నేను కోట్లకు అధిపతిని, నాకున్న పలుకుబడి, శక్తి, ఆ అడవిలో చెరువు గట్టు మీద అనాధలా పడి ఉన్న అమ్మవారి విగ్రహానికి ఎలా ఉంటాయి, అయినా కలలు నమ్మటం బుద్ధి తక్కువ పని. అలా నిర్ణయించుకున్న రాజయ్య ఆపై అమ్మవారి విషయం మర్చిపోయి తన పనులు తాను చూసుకోవటం మొదలుపెట్టాడు.

సరిగ్గా కలలో కనిపించి చెప్పినట్టే, అమ్మవారు రాజయ్యకు కష్టాలు కలిగించటం మొదలు పెట్టింది. మొదట రాజయ్యకి చక్కెర వ్యాధి వచ్చేలా చేసింది. దాంతో రాజయ్య తినే పంచభక్ష్య పరమాన్నాలకి తెర దిగింది. గంజి త్రాగటం మొదలు పెట్టాడు.

గతంలో నిరుపేదగా ఉన్నప్పుడు, తాను త్రాగిన గంజే, ఇన్ని కోట్లున్నా త్రాగాల్సి వచ్చింది. అయినా సరే రాజయ్యకు అమ్మవారిపై భక్తి కలగలేదు. ఆ తర్వాత రాజయ్య భార్యకి చర్మవ్యాధి వచ్చి, ముఖం నుండి పాదాల వ్రేళ్ళ దాకా తెలుపు రంగు వచ్చింది.

దాంతో అప్పటిదాకా ఆరోగ్యంగా ఉండి, అందరిపై పెత్తనం చెలాయించిన ఆమె తన ముఖం జనాలకి చూపించలేక ఒక గదిలో, రాత్రింబవళ్ళు కాలం గడపసాగింది.

అయినా సరే రాజయ్యకి బుద్ధి రాలేదు. ఆ తర్వాత రాజయ్య పెద్ద కొడుక్కి ఇంకో ధనవంతుడి కూతురుపై ప్రేమకలిగి, మొదటి భార్యను హత్య చేసాడు. మొదటి భార్య తండ్రి గొప్ప పలుకుబడి ఉన్న ధనవంతుడు కావటంతో, అల్లుడిని కారాగారంలో పెట్టించాడు. భార్యను దారుణంగా చంపిన నేరానికి అతడికి ఉరిశిక్ష విధించారు, ఆ రాజ్యాన్ని పరిపాలించే మహారాజు.

ఇక మిగిలిన కుమారులు ధనమదంతో, ఒక అమ్మాయిని అపహరించి, నానా రకాలుగా హింసించి, చంపేసారు. దాంతో ఆ అమ్మాయికి సంబంధించిన వాళ్ళు గుంపులుగా వెళ్ళి రాజయ్య ముగ్గురి కొడుకుల్ని కర్రలతో చావగొట్టి చంపేశారు. ఇన్ని ఘోరాలు జరిగిన తర్వాత గానీ రాజయ్యకు అర్థం కాలేదు, అమ్మవారు తనకు శిక్ష విధించింది అని.

అప్పుడు రాజయ్య అమ్మవారి గుడికి వెళ్ళి నా తప్పులు క్షమించి కాపాడు తల్లీ అని ప్రార్థించాడు. అప్పుడు అమ్మవారు చిరునవ్వులు చిందిస్తూ ఇలా అన్నది.

నాయనా రాజయ్యా, నీవు గతజన్మ పుణ్యం వలన కోటీశ్వరుడివి అయ్యావు. అలాగే గత జన్మ పాపం వలన ఇన్ని కష్టాలు పొందుతున్నావు. దానికీ, నాకు ఏం సంబంధం లేదు. నీవు ఇకపై నా దగ్గరకు రాకు.




# చంద్రగిరి

పూర్వం గోదావరీ నదీ తీరంలో చంద్రగిరి అనే గ్రామం ఉండేది. ఆ గ్రామానికి పొలిమేరలలో, ఒక గురుకులం ఉండేది. ఆ గురుకులం అధిపతి నారాయణ భట్టు. ఈ నారాయణ భట్టు, వేద, వేదాంగాలను ఔపోసన పట్టిన మహాపండితుడు.

మరి అలాంటి పండితుడు స్థాపించిన గురుకులానికి ఎంత ప్రతిష్ట, గౌరవం ఉండాలి? అందుకే ఆ గురుకులంలో వివిధ రాజ్యాల కాబోయే యువరాజులు విద్యాభ్యాసం చేస్తుండేవాళ్ళు.

నారాయణ భట్టు, కేవలం గొప్ప వారి పిల్లలకే గాక, సామాన్యుల బిడ్డలకి కూడా విద్యాబుద్ధులు నేర్పుతూ ఒక ఆదర్శ గురువుగా పేరు పొందారు. అయితే ఆయనకున్న వందమంది శిష్యులలో, ఓ పదిమంది ఆకతాయి శిష్యులు కూడా ఉన్నారు.



వాళ్ళు ఎన్నిసార్లు, తమ తుంటరి చేష్టలతో గురువుగారిని విసిగించినా, ఆయన మాత్రం వాళ్ళను గురుకులం నుండి బహిష్కరించలేదు. కారణం వాళ్ళు చిన్న వాళ్ళు, ఏదో చిన్నతనం వల్ల వాళ్ళు చేసే అల్లరిని సరదాగా తీసుకొని ఆనందించేవారు ఆ గురువుగారు.

ఒకసారి నారాయణ భట్టు, పితృకర్మ నిమిత్తం వంటవారిని పిలిచి, రక, రకాల తినుబండారాలను తయారు చేయించాడు. వాటిని ముందుగా పితృదేవతలకి నివేదన చేసి కొందరు స్వాములకి పెట్టి, ఆపై నారాయణ భట్టు, ఆయన శిష్యులు భుజించాల్సి ఉన్నది.

ఆశ్రమంలో వంటగదిలో పెద్ద, పెద్ద పాత్రలు నిండా ఆహార పదార్థాలు సిద్ధంగా ఉంచారు వంటవాళ్ళు. ఆశ్రమం బయట నారాయణ భట్టు నల్గురు ఋషులకు కాళ్ళు కడిగి, పూజలు చేస్తారు. ఆ పూజల తర్వాత, ఆ ఋషులు ఆశ్రమంలోకి వచ్చి భోజనాలు చేస్తారు. అదీ జరగాల్సిన విధానం.

మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత, నారాయణ భట్టు, ఋషులకు కాళ్ళు కడిగి, పూజలు చేస్తుండగా, ఆశ్రమం వంట గదిలోకి పిల్లుల్లా, చడీ చప్పుడు కాకుండా, నలుగురు ఆకతాయి శిష్యులు ప్రవేశించి అక్కడ పాత్రలలో ఉన్న గారెలు, బూరెలు కాసిని తిని, కొద్దిగా చక్రపొంగలి, పులిహోర తిని, కాసిని మంచినీళ్ళు తాగి, బ్రేవ్ మని త్రేన్చి, నిశ్శబ్దంగా బయటికి జారుకున్నారు.

ఋషులకి భోజనాలు పెడదామని, వారిని లోపలకి పిలిచి, ఆకులు వేసి, పదార్థాల కోసం వంటగదిలోకి వెళ్ళి చూడగా, అక్కడ వంట పదార్థాలు ఎవరో ఎంగిలి చేసినట్టుగా గుర్తులు కనిపించాయి. దాంతో ఆగ్రహించిన నారాయణ భట్టు, ఈ పనిచేసింది తన తుంటరి శిష్యులేనని గ్రహించాడు.

మామూలుగా అయితే, ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకొని ఉండేవాడు కాదు. కానీ ఈ రోజు తన తండ్రిగారి తద్దినం. అలాంటి పవిత్రమైన రోజున, మహర్షులకి పెట్టాల్సిన ఆహార పదార్థాలను ఎంగిలి చేసిన శిష్యుల్ని క్షమించలేకపోయాడు.

ఆ పని చేసిన శిష్యుల్ని, పిలిపించి, నానా తిట్లు తిట్టి, ఆశ్రమం నుండి బహిష్కరించాడు. దాంతో బహిష్కరించబడ్డ శిష్యులు, ఏం చెయ్యాలో అర్థంకాక, అడవిలోకి వెళ్ళారు. అక్కడ ఒక చెట్టు క్రింద కూలబడ్డారు. వాళ్ళకి మెల్లిగా నిద్ర పట్టింది.

ఆ చెట్టుపై రెండు పిశాచాలు కాపురం ఉంటున్నాయి. క్రింద పడుకుని ఉన్న శిష్యుల్ని చూసిన ఆ పిశాచాలు, ఆ శిష్యుల్ని ఏడిపించి, ఆడుకోవాలని తలచాయి.

దాంతో ఒక పిశాచి, క్రింద నిద్రపోతున్న శిష్యులలో ఒకడికి ఆవహించింది. దాంతో పిశాచి ఆవహించిన శిష్యుడు, గభాల్న నిద్దుర లేచి మిగిలిన శిష్యుల వీపుపై పిడిగుద్దులు కురిపించి, నిద్రలేపాడు.

మంచి నిద్రలో ఉన్న శిష్యులు, వీపు పైన దెబ్బలు పడేసరికి కెవ్వు, కెవ్వుమని అరుస్తూ లేచి కూర్చున్నారు. అప్పుడు దయ్యం పట్టిన శిష్యుడు, మిగిలిన శిష్యులతో, రేయ్! నేను భీముడిని. మీరు కౌరవులు, ఇప్పుడు నేను మిమ్మల్ని గదాయుద్ధంలో ఓడిస్తా అన్నాడు.



అంతే ఆ శిష్యులు, దయ్యం పట్టినవాడితో గదాయుద్ధం చేస్తున్నట్టుగా నటించసాగారు. కాని నిజానికి ఎవరిచేతుల్లోనూ ఎలాంటి ఆయుధం లేదు మరి. కాసేపు తరువాత పిశాచి ఒక శిష్యుడి నుండి బయటికి వచ్చి, ఇంకో శిష్యుడిని ఆవహించింది.

అప్పుడా శిష్యుడు, ఒరేయ్ నేను బృహన్నలనిరా అంటూ నపుంసకుడిలా నృత్యాలు చేస్తూ, చప్పట్లు కొడుతూ, వయ్యారాలు చూపుతూ మిగిలిన శిష్యుల్ని ఆట పట్టించటం మొదలు పెట్టింది. ఇంతలో రెండో పిశాచి, రేయ్ ! నేను ఆంజనేయుడినిరా... నేను మిమ్మల్ని చావగొడతా నంటూ శిష్యుల్ని తరమసాగింది.

దాంతో ఆ శిష్యులు హడలిపోయి, పరిగెత్తి పరిగెత్తి ఒక గ్రామంలో సంత జరుగుతుంటే అక్కడికి వెళ్ళి దాక్కున్నారు. అయితే పిశాచి ఆవహించిన శిష్యుడు కూడా, అక్కడికి వచ్చి, పెద్దగా అరుస్తూ, సంతలో ఉన్న దుకాణాలను పీకి పారేసి, నానా ఛండాలం చేసాడు.

దాంతో సంతలో దుకాణాలు పెట్టిన వ్యాపారులు, దయ్యం పట్టిన శిష్యుడిని, ఒక చెట్టుకి కట్టేసి, చావచితకగొట్టి, ఆపై వాడి గురువుగారైన నారాయణ భట్టుకి కబురుచేసారు. శిష్యుడికి దయ్యం పట్టిన వార్త తెలుసుకున్న నారాయణ భట్టు చాలా బాధపడ్డారు.

అయ్యో! పాపాం అజ్ఞానులైన నా శిష్యులు చేసిన తప్పుని, క్షమించకుండా, వాళ్ళని ఆశ్రమం నుంచి బహిష్కరించాను. పాపం ఆమాయకులైన వాళ్ళు, ఇప్పుడు దయ్యాలు పట్టి, ఇంకా వెధవ పనులు చేసి తన్నులు తింటున్నారే అని తీవ్రంగా విచారించి, వెంటనే శిష్యులున్న గ్రామానికి వెళ్ళారు.

గురువుగారిని చూసిన ముగ్గురు శిష్యులు, పెద్దగా ఏడిచి, గురువుగారి పాదాలపై పడి క్షమించమన్నారు. దాంతో నారాయణ భట్టు పూర్తిగా కరిగిపోయి, శిష్యుల్ని దగ్గరికి తీసుకొని, ఒరే, శిష్యులూ, ఇకపై బుద్ధిగా ఉండండి అని బుజ్జగించారు.

ఆపై స్తంభానికి కట్టివేయబడి ఉన్న శిష్యుడి దగ్గరికి వెళ్ళారు. నారాయణ భట్టుని చూడగానే, ఆ శిష్యుడిని ఆవహించి ఉన్న పిశాచం ఇలా అన్నది. ఓ గురుదేవా! మేము పిశాచ రూపాలు ధరించి, ముప్ఫై


సంవత్సరాలుగా ఇలా ప్రజల్ని పట్టి పీడిస్తున్నాం. మీరేదైనా మార్గం చూపి, మాకీ పిశాచ జన్మ తప్పేలా చేయండి. మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేం.

శిష్యుడిని ఆవహించి ఉన్న పిశాచి అన్న మాటలు విన్న నారాయణ భట్టు, ఓయీ పిశాచమా! మీరు ఎవరు? మీకు ఈ పిశాచి రూపం ఎలా కలిగిందో ముందు చెప్పండి, ఆపైన మీకు ఈ రూపం తప్పిస్తాను అన్నాడు.

అప్పుడు శిష్యుడిని ఆవహించిన పిశాచం తమ కథను వివరించ సాగింది.

మేం ఒక సంపన్నుడి కుమార్తెలం. మా తండ్రిగారు మాకు వివాహాలు కాక ముందే మరణించారు. దాంతో మాకు అపారమైన సంపద చేతికి వచ్చింది. దాంతో మేము చంద్రగిరి అనే గ్రామాన్ని కొనుక్కుని, ఆ గ్రామంలో మా ఇష్టమొచ్చిన అరాచకాలు చేసేవాళ్ళం.

కంటికి నచ్చిన అందమైన పురుషుల్ని బంధించి తెచ్చి, మేం అక్కాచెల్లెళ్ళం ఇద్దరం మా పశుకామవాంఛలు తీర్చుకొని, ఆ పురుషుల్ని



బానిసలుగా మార్చేవాళ్ళం. మా అరాచకాలకి ఎదురే లేకుండా పోయింది. మేం తాగటం, అపరిమితంగా మాంసాహారం తీసుకోవటం చేసేవాళ్ళం.

చివరికి చంద్రగిరి గ్రామ శివాలయ పూజారిని కూడా మేం బానిసగా మార్చాం. దాంతో మా దుర్మార్గాలకి హడలిపోయిన చంద్రగిరి గ్రామ ప్రజలు ఊరు వదిలి, వేరే ప్రాంతానికి వలస పోయారు. ఆ తర్వాత ఒక రోజు నేను, మా అక్క వేటకి వెళ్ళాం.



అక్కడ నగ్నంగా తపస్సు చేసుకుంటున్న ఒక యువఋషిని చూసిన మాకు కామోద్రేకం కలిగి ఆ యువఋషి తపస్సు భంగం చేసి, మా కోర్కె తీర్చుకున్నాం. అప్పుడా ఋషి, కోపించి, కామంతో పిశాచాల లాగా ప్రవర్తించినందుకు శిక్షగా మమ్మల్ని పిశాచాలుగా మారిపొమ్మని శపించాడు. అప్పటికి గానీ మాకు తెలిసి రాలేదు.. మేము ఎంత పాపం చేసామో.

ఆ విధంగా ఋషి శాపం వలన పిశాచ రూపాలు పొందిన మాకు మీరు ఏదో విధంగా రక్షణ కల్పించాలి.

అక్కా చెల్లెళ్ళ కథ విన్న నారాయణ భట్టు, సరే మీకు ఈ పిశాచ రూపాలు తొలగిస్తాను అని చెప్పి, తన ఆశ్రమానికి వెళ్ళి ఒక మహాయాగం ఏడు దినాలు చేసాడు.

ఆ యాగఫలం వల్ల పిశాచ రూపాలు తొలగి అక్కా, చెల్లెళ్ళు దివ్య రూపాలు పొందారు. వారు నారాయణ భట్టుకి నమస్కరించి, ఆకాశ మార్గంలో పైలోకాలకు వెళ్ళిపోయారు.

ఆ తర్వాత, గురువుగారి నల్గురు తుంటరి శిష్యులు బుద్ధిగా చదువుకుని మంచిపేరు సంపాదించుకొని గురువుకి తగ్గ శిష్యులు అనిపించుకొన్నారు. పిశాచాల బాధ తొలగిపోవటంతో, చంద్రగిరి గ్రామంలో మళ్ళీ జనాలు పూర్వం లాగా హాయిగా నివశించసాగారు.

## సత్యరాజు

పూర్వం భువనగిరి రాజ్యాన్ని పాలిస్తున్న మహారాజు అసమర్థుడు. నిత్యం మద్యం సేవిస్తూ, వేశ్యలతో క్రీడిస్తూ కాలక్షేపం చేసేవాడు. అతని పెద్దభార్య తమ్ముడు దుష్టబుద్ధి, మహారాజు ఏ విషయమూ పట్టించుకోక పోవటం వల్ల, మెల్లిగా, రాజ్యవ్యవహారాలలో జోక్యం చేసుకోవటం మొదలుపెట్టాడు.

క్రమంగా తన అక్క అయిన మహారాణి పలుకుబడిని ఉపయోగించి, తనకు ఎదురు తిరిగే మంత్రుల్ని, సేనానాయకుల్ని ఉద్యోగాల నుండి తొలగించి, తనకు విధేయులుగా ఉండే వాళ్ళని, ఆయా పదవులలో నియమించాడు.

కాలం గడుస్తున్నది. దుష్టబుద్ధి భువనగిరి రాజ్యంలో ఒక ప్రబల శక్తిగా ఎదిగాడు. ఇప్పుడు అతన్ని చూస్తే మహారాజుకి కూడా భయమే. రాజ్యానికి పేరుకు మహారాజు ఉన్నా, నిజమైన అధికారం అంతా దుష్టబుద్ధిదే అయింది. దుష్టబుద్ధికి అపరిమితమైన ధనకాంక్ష, స్త్రీ వ్యామోహం ఉన్నాయి. అతడు ఎందరో కన్యలను చెరపట్టి, తన అంతఃపురంలో బంధించి, వినోదిస్తూ ఉండేవాడు.

ఎవరి మీద ఐనా ఇష్టం తగ్గితే, ఆ స్త్రీల తల నరికి కోటగోడల దగ్గరున్న కందకాలలోకి విసిరేవాడు. దుష్టబుద్ధి క్రూరత్వానికి అంతేలేదు. దుష్టబుద్ధి కొందరు సైనికులకి ముసుగులు ధరింపచేసి, గ్రామాలపై పడి, జనాల దగ్గరున్న బంగారం, వెండి, ద్రవ్యం, ఆఖరుకి కోళ్ళు, మేకలను కూడా దోచుకొని రమ్మని పంపేవాడు.

అలా దోచుకున్న ధనాన్ని ఒక నేల మాళిగలో భద్రపరిచి, దానికి రెండు పిశాచాలను కాపలాగా ఉంచాడు. ఇలా దుష్టబుద్ధి ఒక ప్రబలమైన శక్తిగా భువనగిరి రాజ్యాన్ని పీడించసాగాడు.

దుష్టబుద్ధిచే నియమించబడ్డ ముసుగుదొంగలు గ్రామాల మీద పడి బీభత్సాలు సృష్టించసాగారు. ప్రజల ధన, ప్రాణ, మానాలకు రక్షణ లేకుండాపోయింది. ప్రజల్ని రక్షించాల్సిన మహారాజే, దుష్టబుద్ధి అదుపాజ్ఞలలో ఉండటం వల్ల, దుష్టబుద్ధి దుర్మార్గాలని ఎదిరించే నాధుడే లేకుండా పోయాడు.

ఇలా ప్రభుత్వ సైనికులు, బంధిపోట్ల వేషాలలో గ్రామాలను కొల్లగొడుతూ, ఒకసారి 'వాకాడ' అనే గ్రామంపై దాడి చేసారు. ఆ బందిపోట్లు ముందుగా ఆ వూరి సంపన్నుడు ఐన వీరభద్రశాస్త్రి ఇంటిపై దాడి చేసారు. వీరభద్రశాస్త్రికి సుమారుగా 60 సంవత్సరాల వయస్సు ఉంటుంది.

ఆయనకి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. అందులో పెద్దకొడుక్కి రెండు సంవత్సరాల అబ్బాయి ఉన్నాడు. ఆ అబ్బాయి పేరు సత్యరాజు. ఆ గ్రామంలో మోతుబరి రైతు, సంపన్నుడు అయిన వీరభద్రశర్మ ఇంటిని కొల్లగొడితే, డబ్బు, బంగారం అపరిమితంగా లభిస్తాయని గ్రహించిన దుష్టబుద్ధి తన అనుచరుల్ని శాస్త్రి గ్రామానికి పంపాడు.



బందిపోట్లు వీరభద్ర శర్మను ఒక స్తంభానికి కట్టేసారు. అప్పుడు శర్మ గంభీరంగా ఇలా అన్నాడు, రేయ్ దొంగల్లారా, నా కట్లు విప్పండిరా, మీ అంతు చూస్తా.



శర్మ మాటలు విన్న బందిపోట్ల నాయకుడు, ఒరేయ్, నీ పేరు వీరభద్రశర్మ అయినంత మాత్రాన, పెద్ద వీరుడిలా మాట్లాడకు నీ కుటుంబాన్ని నీ కళ్ళ ముందే సర్వనాశనం చేయిస్తాను... నీకు సత్తా ఉంటే చూపించు అని వికటంగా నవ్వాడు.

బందిపోట్ల నాయకుడు, కనుసైగ చేయగానే, శర్మ పెద్ద కోడల్ని లాక్కొచ్చి, బందిపోటు నాయకుడి ముందు ఉంచారు, అతని అనుచరులు. అందంగా, బలంగా ఉన్న ఆమెను చూసి, ఆహా! ఈమెను మా దుష్టబుద్ధికి అందిస్తే, ఆయన చాలా రోజులు సుఖపడతాడు అనుకొని, తన అనుచరుల్ని పిలిచి, రేయ్ ఈ పిట్టని కాళ్ళు చేతులు కట్టేసి, మన నాయకుడు దుష్టబుద్ధి గారి పడక గదికి చేర్చండి అన్నాడు.

ఆమె అరిచి కేకలు పెడుతున్నా పట్టించుకోకుండా, ఆమెని తీసుకెళ్ళి బస్తాలా గుర్రంపై వేశారు. ఇంతలో నలుగురు దొంగలు వీరభద్ర శర్మ చిన్న కోడల్ని, ప్రక్క గదిలోకి తీసుకెళ్ళి తలుపులు వేసుకున్నారు. గదిలోంచి ఆమె ఆక్రందనలు, వెర్రికేకలు వినిపించి వీరభద్ర శర్మ ఆగ్రహంతో ఊగిపోయాడు.

ఈలోగా శర్మగారి ఇద్దరి కొడుకుల్ని స్తంభాలకి కట్టేసి, రాక్షసంగా కొరడాలతో చావగొట్టారు ఆ క్రూరులైన బందిపోట్లు. గదిలోకి శర్మ చిన్నకోడల్ని తీసుకెళ్ళిన నల్గురు బందిపోట్లూ, బయటికి వచ్చారు. ఆ తర్వాత శర్మని చితకగొట్టి, ఎక్కడ డబ్బు, బంగారం దాచుకున్నాడో ఆ ప్రదేశాల్ని తెలుసుకొని, ఆ సొత్తుని పోగేసి మూటలు కట్టి గుర్రాలపై వేసుకున్నారు.

వీరభద్ర శర్మ రెండు చేతులూ భుజాలదాకా నరికిపారేశాడు బందిపోటు దొంగలనాయకుడు. వారంతా నానాబీభత్సం చేసి, అర్థరాత్రి దాటిన తర్వాత అక్కడి నుండి వెళ్ళిపోయారు. తెల్లారినాక, గ్రామస్థులు వీరభద్ర శర్మ ఇంటికి వచ్చి చూసేసరికి చచ్చి స్తంభాలకి వేళ్ళాడుతున్న ఆయన ఇద్దరు కుమారులు, చేతులు ఖండించబడి, నేలపై కూలబడ్డ వీరభద్ర శర్మ కనిపించారు.

అయ్యో, దేముడి లాంటి శర్మ గారి కుటుంబం ఇలా నాశనం అయిందే అని ప్రజలు బాధపడ్డారు. అయితే ఆ గృహంలో జరిగిన దారుణాన్ని, ప్రత్యక్షంగా చూసిన శర్మగారి మనవడు సత్యరాజు, ఆ చిన్నవయస్సులోనే బందిపోట్లపై పగబట్టాడు. బందిపోట్లు ఆ ఇంట్లో జనాల్ని హింసిస్తున్నప్పుడు ఆ బాలుడు ఆ ఇంటి అటకపై దాక్కుని ఉన్నాడు.

కాలం ఎలాంటి గాయాల్ని అయినా మాన్పుతుంది. జరిగిన అరాచకం వలన శర్మ కుటుంబం ఒక్క రాత్రిలో అదృశ్యం అయింది. ఇక ఆయనకి మిగిలిన ఏకైక ఆశ, ఆయన మనవడు సత్యరాజు మాత్రమే. దాంతో ఒక పనివాడిని పెట్టి మనవడి ఆలనాపాలనా చూడసాగాడు.

తాను చేతులు పోగొట్టుకోవటం వల్ల తన తిండే, ఇంకొకరు తనకి తినిపించాల్సిన దుస్థితి ఆయనకి కల్గింది. ఏ సైతాన్ దృష్టి పడిందో తన ఇల్లు స్మశానంగా మారిందే అని రోజూ కుళ్ళి, కుళ్ళి ఏడ్చేవారు శర్మగారు.

సత్యరాజు పెరిగి పెద్దవాడు అవుతున్నాడు. అతను చిన్న వయస్సు లోనే గంభీరంగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. నిత్యం కఠోర వ్యాయామాలు చేస్తూ, ఖడ్గయుద్ధం, గుర్రపు స్వారీ నేర్చుకోసాగాడు. గ్రామంలో ఉన్న గురువుగారి వద్ద అన్ని రకాల రాజకీయ తంత్రాలు నేర్చుకోసాగాడు. ఏం చేస్తున్నా సత్యరాజు మదిలో, బందిపోట్లపై పగ మాత్రం నిలిచి ఉండేది.

కాలచక్రంలో 16 సంవత్సరాలు గడిచాయి. సత్యరాజుకి 18 సంవత్సరాలు నిండి 19వ సంవత్సరం వచ్చింది. అప్పటికి అతడు ఆరడుగుల ఎత్తుతో మహాబలిష్టంగా తయారయ్యాడు. ఈ వయసు కుర్రాళ్ళలో ఉండే చలాకీతనం, చిలిపిదనం సత్యరాజులో కనిపించేవి కాదు. అతని ఏకైక లక్ష్యం ప్రతీకారం.



ఒక వైకుంఠ ఏకాదశినాడు శర్మగారు ఆకస్మికంగా జబ్బు పడ్డారు. శర్మగారికి అర్థం అయింది, తాను ఇంకా ఎక్కువ సేపు బ్రతకనని. దాంతో మనవడిని పిలిచి, అతడు రాగానే, అతనికి గతంలో జరిగిన బందిపోట్ల దుర్మార్గానికి ప్రతీకారం తీర్చుకోమని, ఆ దుర్మార్గాల వెనకాల ఉన్నది దుష్టబుద్ధి అనే రాజ ప్రతినిధి అని చెప్పి కన్ను మూసి వైకుంఠం చేరుకున్నారు వీరభద్రశర్మగారు.

తనకున్న ఆఖరి దిక్కు కూడా పోవటంతో, సత్యరాజు ఇంక ఆ వూళ్ళో ఉండటానికి ఇష్టపడక, తన ఇంటిని, ఆస్తుల్ని, గ్రామపెద్దలకి అప్పగించి, ఒక మంచి అశ్వాన్ని ఎక్కి రాజధానికి బయలుదేరాడు.



మూడు రోజులు ఏకధాటిగా ప్రయాణం చేసి, భువనగిరి రాజ్య రాజధాని రత్నగిరి పట్టణాన్ని చేరి, ఒక సత్రంలో గది అద్దెకు తీసుకొని ఆ రాజ్యానికి చీడ పురుగులా పట్టిన, దుష్టబుద్ధిని, అంతం చేయాలన్న వ్యూహంతో నివశించసాగాడు.

ఒకరోజు రాత్రి మారువేషం ధరించి, ఆ గ్రామంలోని రచ్చబండ దగ్గరికి వెళ్ళి, అక్కడ సమావేవం అయిన వ్యక్తుల మధ్య కూర్చున్నాడు సత్యరాజు. అది ఒక రహస్య సమావేశం. అందువల్ల ఆ సమావేశం బుడ్డి దీపం వెలుతురులో జరుగుతున్నది.

ఆ జనాలలోంచి ఒక యువకుడు లేచి, ముందుకు వచ్చి, సోదరులారా! నేడు మన భువనగిరి రాజ్యం, దుష్టబుద్ధి అనే నరరూప రాక్షసుడి పాలనలో నరకయాతనలు పడుతున్నది. ఆ దుర్మార్గుడు మన రాజ్య ప్రజల్ని కాలి క్రింద వేసి తొక్కి పారేస్తున్నాడు.

ఇక ఆ ప్రజాకంటకుడిని నిర్మూలించాల్సిన సమయం ఆసన్నం అయింది. అందువల్ల మనమంతా, ఆయుధాలు ధరించి మన ఊళ్ళపై పడే బందిపోట్లను మనమే ఎదుర్కుందాం, వాళ్ళ ఆట కట్టిద్దాం అన్నాడు. అక్కడున్న ప్రజలందరూ, హర్షాతిరేకాలతో చప్పట్లు కొట్టారు.

అప్పుడొక వృద్ధుడు లేచి, నాయనలారా! ఆ దుష్టబుద్ధిని మీరు సంహరిస్తే ఆనందించే వాళ్ళలో, నేను మొదటి వాడిని అవుతాను. కానీ ఆ దుర్మార్గుడు జిత్తులమారి, పైగా మంత్రాలు, మాయలు తెల్సిన మాంత్రికులని దగ్గర పెట్టుకున్న మహామాయావి.

కనుక అలాంటి బలం గల దుర్మార్గుడిని చంపాలంటే, మనం బుద్ధిబలాన్ని ఉపయోగించాలి, ఆ తర్వాతే బలప్రయోగానికి దిగాలి. కనుక మీ కండబలానికి, మీ బుద్ధి బలాన్ని జత చేసి, మీ యుద్ధాన్ని ప్రారంభించండి. మీరు ఖచ్చితంగా ఆ దుష్టబుద్ధిని గద్దె దింపగలరు అన్నాడు. ఆ వృద్ధుడి మాటలకి అక్కడున్న వారంతా చప్పట్లు కొట్టారు.

వృద్ధుడి మాటలు సత్యరాజుపై చాలా ప్రభావాన్ని చూపాయి. బలవంతుడిని, పది మంది బలహీనులు ఒక్కటైతేనే చంపగలరు. కనుక దుష్టబుద్ధికి వ్యతిరేకంగా ప్రజల్ని ఏకం చేయాలి. ఆ ప్రజల ఐక్యత ముందు, ఏ ప్రభుత్వాలు నిలబడలేవు. ఆ తర్వాత సత్యరాజు ఒక జ్యోతిష్య పండితుడి లాగా వేషం వేసుకున్నాడు.

ఇప్పుడు అతడు, ఒక అరవై ఏళ్ళ వాడిలా నెరిసిన జట్టు, బారెడు గడ్డాలతో నుదుట వైష్ణవ నామం ధరించి ఉన్నాడు. దుష్టబుద్ధి నివాసానికి నేరుగా వెళ్ళాడు. ఈ దుష్టబుద్ధికి జ్యోతిష్యం అంటే వెర్రి నమ్మకం ఉన్నది. దాంతో వృద్ధ జ్యోతిష్య పండితుడి వేషంలో ఉన్న సత్యరాజుని సగౌరవంగా ఆహ్వానించి, తగిన గౌరవ, మర్యాదలు చూపి సముచిత ఆసనంలో కూర్చుండబెట్టి, ఏమిటి విషయం అని సత్యరాజుని ఆసక్తిగా అడిగాడు.

అప్పుడు సత్యరాజు గడ్డం నిమురుకొని ఇలా అన్నాడు. ఓయీ దుష్టబుద్ధి రాజా! నీ గురించి ఆ మహావిష్ణువు కొన్ని విషయాలు చెప్పి, అవి నీకు తెలియచేయమన్నారు. అందుకే ఇలా వచ్చాను సుమా!. సత్యరాజు మాటలు విన్న దుష్టబుద్ధి, ఆనందాశ్చర్యాలు ఒక్కసారిగా పొంది, సత్యరాజుతో ఓహో పండితుడా! నీవు సాక్షాత్తు ఆ విష్ణువు పంపితే వచ్చిన వాడవా... సరే చెప్పు, అయన నాకు ఏం చెప్పమన్నారో అన్నాడు.

అప్పుడు సత్యరాజు ఇలా అన్నాడు. ఓయీ దుష్టబుద్ధి రాజా! నీవు ఈ సమస్త భారతదేశాన్ని ఏలగల జాతక బలాన్ని కలిగి ఉన్నావు. కనుక నీవు నీ పొరుగు రాజ్యాలపై దాడులు చేసి, ఆ పై ఆ రాజ్యాలను, నీ



రాజ్యంలో విలీనం చేసుకో, కొన్నాళ్ళకి ఇలా అనేక రాజ్యాలు జయించి, చివరికి ఈ సమస్త భారతావనినీ నీవే ఏకచ్ఛత్రాధి పత్యంతో పాలించవచ్చు. పైగా ఇతర రాజ్యాలలో ఉన్న సంపదలు, అందకత్తెలు నీ సొంతం అవుతారు కదా!

సత్యరాజు మాటలు విన్న దుష్టబుద్ధికి బుర్ర పాదరసంలా పనిచేసింది. నిజమే ఎంతకాలం, ఈ భువనగిరి రాజ్యాన్నే దోచుకోగలడు. ఈ 16 ఏళ్ళుగా తాను చేస్తున్న దోపిడీకి, ఈ రాజ్య ప్రజలకి భిక్షాపాత్రలు చేతికి వచ్చాయి. పైగా నవయవ్వనులైన సందరీమణులు అందరూ, తన భయం వల్ల ఇతర రాజ్యాలకు వలస వెళ్ళిపోయారు. ఇక ఈ రాజ్యంలో మిగిలింది చెత్త రకం యువతులే.

కనుక ఈ పండితుడు చెప్పినట్టు, ఇతర రాజ్యాలపై కానీ దాడి చేసానంటే కావాల్సినంత సంపద, అందాలు నా సొంతం అవుతాయి అనుకున్నాడు. వెంటనే దుష్టబుద్ధి ఇలా అడిగాడు సత్యరాజుని, ఓ పండితోత్తమా! మీరు చెప్పినది వింటే నాకు, ఇప్పుడే ఇతర రాజ్యాలపై దాడి చెయ్యాలని ఉన్నది. కనుక మీరు తగిన ముహూర్తం నిర్ణయిస్తే, ఆ సమయానికి నేను నా సేనలతో ఇతర రాజ్యాలపై దండయాత్రలు ప్రారంభిస్తాను.

తాను ప్రయోగించిన పాచిక పారినందుకు సత్యరాజు చాలా సంతోషించాడు. ఆపై దుష్టబుద్ధికి ఇలా చెప్పాడు. ఓయీ దుష్టబుద్ధి రాజా! నీవు మొదట నీ సైనిక బలం, ఆయుధబలం గురించి వివరించు. ఆపై నేను దివ్యమైన ముహూర్తం పెడతాను అన్నాడు.

అప్పుడు దుష్టబుద్ధి, ఒక గ్రంథం తెచ్చి, సత్యరాజుకి ఇచ్చి, స్వామీ! ఈ గ్రంథంలో సైనిక, ఆయుధ సంపత్తి వివరాలున్నాయి. దయచేసి చదవండి. అన్నీ మీకే అర్థం అవుతాయి అన్నాడు మహా వినయంగా.

సత్యరాజు ఆ గ్రంథాన్ని పరిశీలించాడు. ఆ గ్రంథంలోని పేజీలు ఎండబెట్టిన లేడి చర్మంతో చేయబడి ఉన్నాయి. ఆ పుస్తకంలో ఉన్న వివరాలు.... ఓరుగల్లు ప్రాంతంలో నాల్గువేల సైన్యం, నాలుగు మణుగుల బంగారం నిల్వచేసాము. 2. నల్గొండ ఖిల్లాలో ఆరువేల సైన్యం, ఆరు మణుగుల బంగారం నిల్వ ఉన్నది. ఇంకా కొన్ని వేల ఖడ్గాలు, బల్లాలు,

నాటు తుపాకులు, ఫిరంగులు భువనగిరి, ఓరుగల్లు, నల్గొండ ప్రాంతాలలో భద్రపరచబడి ఉన్నాయి.

ఆ వివరాలను మనస్సులో నమోదు చేసుకుని, ఆ పుస్తకాన్ని తిరిగి దుష్టబుద్ధికి ఇచ్చేసాడు. ఆపై సత్యరాజు, దుష్టబుద్ధితో ఇలా అన్నాడు. ఓ దుష్టబుద్ధి సార్వభౌమా! నీ సైన్యం, సంపద చాలా ఘనంగా ఉన్నాయి. నీకు తప్పక విజయం లభిస్తుంది. అయితే నీకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు ఇవ్వటానికి నేను నీ అంతఃపురంలో ఉంటే, నీకేమన్నా అభ్యంతరమా.

సత్యరాజు మాటలు విన్న దుష్టబుద్ధి, ఓ పండితోత్తమా! ఎంత మాట అన్నారు. మీరు నా పాలిట దైవం. మీరు అంతఃపురంలో ఉంటే నాకే అభ్యంతరాలు ఉండవు. పైగా మీరు వృద్ధులు. మీ సేవల కోసం నా కుమార్తె మంజరిని నియమిస్తాను. ఆమె మీకు కావల్సినవన్నీ చేస్తుంది అన్నాడు.

వెంటనే ఆ ఏర్పాట్లు చూడు అన్నాడు దుష్టబుద్ధి, ప్రక్కనే నుంచుని ఉన్న ఒక దాసీతో.... వెంటనే సత్యరాజు వద్దకు, దుష్టబుద్ధి కుమార్తె రప్పించబడింది. మంజరి కేసి పరిశీలనగా చూసాడు సత్యరాజు. ఆమె చాలా సౌందర్యవతి, కానీ తండ్రి దుష్టబుద్ధి లాగా కాక, అమాయకంగా కనిపిస్తున్నది.



దుష్టబుద్ధి, తన కుమార్తెను దగ్గరగా పిలిచి, చూడు అమ్మాయి! నీకు ఒక బాధ్యత అప్పగిస్తున్నాను. అదేమంటే, నీవు ఈ పండితుల వారిని ఎల్లవేళలా సేవిస్తూ ఉండాలి. నేను ఇక్కడ ఉన్నా, వేరే ప్రాంతానికి వెళ్ళినా, నీవు మాత్రం ఇక్కడే ఉండి, ఈ పండిత శ్రేష్టుడిని పూజించు, నీకు మంచి జరుగుతుంది అన్నాడు.

దుష్టబుద్ధి చెప్పింది విని, మంజరి అంగీకారంగా తల ఊపింది. సరే అనుకున్న ప్రకారమే, సత్యరాజుకి ఒక ప్రత్యేక మందిరం ఏర్పాటు



చేయబడింది. అతడికి కావాల్సిన ఆహారం, పానీయాలు స్వయంగా మంజరే ఏర్పాటు చేస్తున్నది.

తండ్రి చెప్పిన మాటల్ని, తూ.చ తప్పక పాటించటం ఆమె లక్షణం. రెండు రోజులు గడిచాయి. ఒకరోజు సత్యరాజు, దుష్టబుద్ధికి కబురు చేసి తన దగ్గరికి పిలిపించుకున్నాడు. ఆపై దుష్టబుద్ధితో ఇలా చెప్పాడు. ఓయీ దుష్టబుద్ధి రాజా! నీవు నీ రాజముద్రికను నాకు ఒకసారి ఇచ్చావంటే దాన్ని పూజలో పెట్టి మరల ఇచ్చేస్తాను. ఆపై నీకు ఎదురు ఉండదు.

సత్యరాజు చెప్పిన మాటలు విన్న దుష్టబుద్ధి వేరే ఆలోచన లేకుండా, తన వ్రేలికున్న రాజముద్రిక (ఉంగరం) తీసి, సత్యరాజు చేతికి ఇచ్చాడు. ఆ తర్వాత సత్యరాజు దుష్టబుద్ధిని వెళ్ళి సాయంత్రం రమ్మన్నాడు. ఈలోగా మంజరి, సత్యరాజుకి వేడిపాలు, కాసిని ఫలహారాలు తెచ్చి ఇచ్చింది.

సత్యరాజు వాటిని స్వీకరించి, ఆపై మంజరితో, అమ్మాయీ! నీవు ప్రస్తుతం ఈ మందిరం నుండి బయటికి వెళ్ళు, నేను మీ తండ్రిగారి రాజముద్రికను పూజలో ఉంచి, ప్రత్యేక పూజలు చేస్తాను అన్నాడు చాలా నిదానంగా. మంజరి సరే అని ఆ మందిరం బయటికి వెళ్ళి నించున్నది.

ఇక్కడ సత్యరాజు ఒక నూతన పథకానికి ఆరంభం చేసాడు. అదేమంటే రెండు సందేశపత్రాలు తయారు చేసి, వాటిపై రాజముద్రని ముద్రించాడు. అంటే ఇప్పుడు ఆ సందేశపత్రాలు, స్వయంగా దుష్టబుద్ధే వ్రాసినట్టు.

ఒకసారి తాను వ్రాసిన సందేశ పత్రాల్ని చదివాడు, ఆ సందేశ పత్రంలో ఇలా ఉన్నది. ‘ఈ పత్రాల్ని తెచ్చిన వ్యక్తికి మీ సైనికులు విధేయులై ప్రవర్తించాలి. ఆయన ఆజ్ఞాపిస్తే, చివరికి నన్నైనా సరే బంధించాలి. మీ ఆధీనంలో ఉన్న సమస్త ఆయుధాలు, సంపదను ఈ ఉత్తరం తెచ్చిన వ్యక్తికి అప్పగించాలి!

ఇట్లు<br>
రాజప్రతినిధి<br>
దుష్టబుద్ధిరాజా

ఒకసారి పరిశీలనగా ఆ ఉత్తరాలు చూసాడు. అప్రయత్నంగా సత్యరాజు పెదవులపై చిరుమందహాసం ప్రత్యక్షం అయింది. ఈ ఉత్తరాలతో,

ఈ దుష్టబుద్ధి జీవితానికి తెరపడుతుంది. వాడి వేలితో వాడి కన్ను పొడిచే ఈ నా తంత్రానికి ఎదురే లేదు అని అనుకున్నాడు.

ఆ తర్వాత మంజరిని రమ్మని పిలిచాడు. ఆమె ఆ క్షణమే మందిరంలోకి ప్రవేశించి, సత్యరాజు వద్దకు వచ్చి, భక్తిగా నిల్చున్నది. ఆ తర్వాత సత్యరాజు, దుష్టబుద్ధిని పిలిచి, ఇలా అన్నాడు.

ఓయీ దుష్టబుద్ధి రాజా! నేటికి సరిగ్గా 8వ రోజున రాత్రి ఏడుగంటలకి, చంద్రగ్రహణం ప్రారంభం అయిన సమయంలో నీవు బయలుదేరి వెళ్ళి నీ దండయాత్రలు ప్రారంభించు. అయితే నీకు ప్రస్తుతం కోటలో ఉన్న సైన్యాన్ని ఇక్కడే ఉంచి, ఒక పదిమందితో మాత్రమే బయలుదేరి, ముందుగా ఓరుగల్లు ప్రాంతంలో ఉన్న నీ నాలుగువేల సైన్యాలను తీసుకొని, నల్గొండ ప్రాంతానికి వెళ్ళు. అక్కడున్న సైన్యాన్ని తీసుకొని, ఒక పెద్ద దళంగా చెయ్యి. ఈ ఉమ్మడి సైన్యంతో, వేంగీ రాజ్యంపై దండెత్తు.

సత్యరాజు మాటలు విన్న దుష్టబుద్ధి బాగా ఆనందించి, ఇలా అన్నాడు. ఓయీ పండిత శ్రేష్టుడా! నేనిప్పుడే ఓరుగల్లు, నల్గొండ స్థావరాలలో ఉన్న సైన్యానికి కబురు చేస్తాను, యుద్ధానికి సిద్ధంగా ఉండమని. దుష్టబుద్ధి చెప్పినది విన్న, సత్యరాజు నెమ్మదిగా ఇలా అన్నాడు.

కంగారుపడకు రాజా, నీవు నీ కోటని వదిలి, ఓరుగల్లు వెళ్ళే ముందు రోజున మాత్రమే నీకు ఓరుగల్లులో ఉన్న సైనికులకి కుబురు చెయ్యి, అలా అయితేనే, నా ముహూర్తం ఫలించి, నీకు జయం కలుగుతుంది.

సత్యరాజుపై గుడ్డినమ్మకం ఏర్పడ్డ దుష్టబుద్ధి, సరే అన్నాడు. రాత్రి కాగానే సత్యరాజు తన పూజా మందిరంలోకి వెళుతూ మంజరిని పిలిచి, తను పూజ నిర్విఘ్నంగా తెల్లారే దాకా జరుపుకోవాలనీ, అందాక ఎవరూ తనని కలువరాదనీ చెప్పాడు.

అప్పుడు ఆమె సరే స్వామీ, నేను మీ పూజా మందిరం వైపుకు కూడా ఎవ్వరూ రాకుండా కాపలా కాస్తాను అన్నది. సరే అలాగే కానీ, అని చెప్పి సత్యరాజు పూజా మందిరంలోకి వెళ్ళి తలుపు గడియ వేసుకున్నాడు.

పూజా మందిరంలోని ఒక రహస్యమార్గం ద్వారా కోట బయటికి వచ్చాడు సత్యరాజు. ఆ పూజా మందిరం నుంచి, బయటికి సొరంగ


మార్గం ఉన్న విషయం దుష్టబుద్ధికి తెలీదు. ఆ సొరంగమార్గాన్ని నిర్మించిన వ్యక్తి మనవడి ద్వారా సత్యరాజు సొరంగం విషయాన్ని తెలుసుకున్నాడు.

సత్యరాజు మారువేషంలో కోటలో ఉన్నంత కాలమూ, ఈ సొరంగ మార్గం ద్వారానే, బయట ఉన్న విప్లవకారుల్ని కలిసి, ఎప్పటికప్పుడు ఏం చేయాలో, చెప్పి వస్తున్నాడు. ఈసారి నేరుగా, కోటకి దూరంగా ఉన్న ఒక మామిడితోటలో విప్లవకారుల సమావేశం ఏర్పాటు చేసి, అక్కడ తర్వాత చేయాల్సిన కార్యక్రమాల గురించి, వారికి ఇలా చెప్పాడు.

ఆ మామిడితోటలో చెట్లపైన వెలుగుతున్న కాగడాలు కట్టబడి వున్నాయి. అక్కడ జరుగుతున్న సమావేశ లక్ష్యం, ఈ భువనగిరి రాజ్యాన్ని రెండు దశాబ్దాలుగా పీడిస్తున్న దుష్టబుద్ధిని, వాడి దుర్మార్గ పాలననూ అంతం చేయటం.

ముందుగా సత్యరాజు, ముగ్గురు సమర్థులైన యువకులని పిలిచి ఇలా చెప్పాడు. “సోదరులారా... మీరు నేను ఇస్తున్న లేఖలను తీసుకుని, నల్గొండ, ఓరుగల్లులలో ఉన్న సైనిక స్థావరాలకు వెళ్ళి, అక్కడ ఉండే సేనాధిపతికి ఈ ఉత్తరాలను ఇవ్వండి. ఆపై ఆ సేనాధిపతి మీరు ఏది చెబితే అది చేస్తాడు. అప్పుడు మీరు, అక్కడున్న సైన్యాల్ని, సంపదని, ఆయుధ సామాగ్రిని తీసుకొని, సరిగ్గా చంద్రగహణం ప్రారంభం అయిన రాత్రిలో, కోటనుండి బయటికి వస్తున్న దుష్టబుద్ధిని వాడి కొద్దిపాటి సైన్యాన్ని బంధించండి.

దుష్టబుద్ధే స్వయంగా, ఈ ఉత్తరం తెచ్చిన వాడు ఏది చెపితే అది చేసి తీరాలని ఉత్తరం వ్రాసి, రాజముద్ర వేసాడని భావించి నల్గొండ, ఓరుగల్లు స్థావరాల నుండి ఇక్కడికి వచ్చిన సైనికులు, మీరు చెప్పినట్టుగానే ఆ దుష్టబుద్ధిని బంధిస్తారు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

అలా చెప్పిన సత్యరాజు, తన దుస్తులలో ఉన్న ఉత్తరాలు తీసి, అందులో రెండు, ఆ యువకులకి ఇచ్చి, తక్షణమే బయలుదేరమని చెప్పాడు. సత్యరాజు సాహసానికి, యుక్తికి ఆ విప్లవకారులు ఎంతో సంతోషించారు. ఒక్క చుక్క నెత్తురు చిందకుండా ఆ నర పిశాచి దుష్టబుద్ధిని వంచించిన సత్యరాజుని అందరూ అభినందించారు.

ముందుగా నిర్ణయించిన ప్రకారం, దుష్టబుద్ధి, పదిమంది సైనికులతో కోట ప్రధాన ద్వారం దాటి ఇలా కాలు బయటపెట్టాడో లేదో, అతనికి కన్పించారు వేలాది ఆయుధధారులైన సైనికులు.

ఎక్కడో ఉండాల్సిన తన సైనికులు, ఇక్కడికి రావటం ఎలా జరిగిందో, దుష్టబుద్ధికి అర్థం అయ్యేలోగా, విప్లవకారులు నేతృత్వంలో పనిచేస్తున్న సైనికులు, దుష్టబుద్ధిని, అతని వెంట ఉన్న పదిమంది సైనికుల్ని బంధించివేసారు. ఈ పరిణామానికి దుష్టబుద్ధికి మాట రాలేదు.

ఆ మరుసటి రోజు ఉదయం జరిగిన ప్రజా దర్బారులో దుష్టబుద్ధి, అతని అనుచరులు చేసిన దారుణాలు విచారించబడ్డాయి. దుష్టబుద్ధికి అతని విధేయులకి సజీవ సమాధి శిక్షను విధించాడు, ఆ ప్రజా నాయకుడు అయిన సత్యరాజు.

దుష్టబుద్ధిని ఒక గోతిలోకి నిలువుగా దింపి, మెడ వరకు మట్టిని కప్పించి, ఆపై దుష్టబుద్ధిని చూసి, సత్యరాజు ఇలా అన్నాడు, ఓరీ దుష్టబుద్ధీ! చూసావా నీవు తీసుకున్న గోతిలో నీవే పడ్డావు. నీవల్ల నా కుటుంబం సర్వనాశనం అయింది. నా తండ్రి, బాబాయి నీ అనుచరుల చేతుల్లో దారుణంగా హింసలు అనుభవించి మరణించారు.

నా తల్లిని నీ కామాగ్నికి బలి చేసావు. నీకు సజీవ సమాధే తగిన శిక్ష అని, ఆపై సైనికులవైపు తిరిగి, ఊ ఈ దుష్టుడి తలను కూడా మట్టితో పూడ్చండి, ఆపై దానిపై ఒక నల్ల బండను నిలబెట్టండి. ప్రజాకంటకులు ఎంత బలవంతులైనా, ఇలాగే కుక్కచావు ఛస్తారని, రాబోయే తరాలకి తెలియాలి అని గర్జించాడు సత్యరాజు. ఆ తర్వాత సత్యరాజు మంజరిని వివాహం చేసుకొని, భువనగిరి రాజ్యాన్ని చిరకాలం పాలించాడు.

## శాపవిమోచనం

పూర్వం కళింగరాజ్యాన్ని ప్రజాపతి అనే మహారాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన దుష్టశిక్షణ, శిష్టరక్షణా అనే వ్రతాన్ని నిరంతం పాటిస్తూ, ధర్మ రక్షకుడు అనే పేరు తెచ్చుకున్నాడు. ఆయన భార్య పేరు స్వయంప్రభ. వివాహమై ఏళ్ళు గడిచినా ఆ రాజదంపతులకు సంతానం కలుగలేదు.



దాంతో తన తర్వాత ఈ రాజ్యానికి వారసుడు లేకుండా పోతాడే అని ప్రజాపతి బాధపడుతూ ఉండేవాడు. తనకి మరణానంతరం పితృకార్యాలు చేసే కుమారుడు లభించకుంటే, పున్నామ నరకం నుండి ఎలా తప్పించుకోవాలి అని విచారిస్తూ ఉండేవాడు.

ఒకరోజు ఆ రాజ్యానికి ఒక యోగి వచ్చాడు. దాంతో రాజ్యంలో సమస్త ప్రజలు ఆ యోగిని సందర్శించి, తమ సమస్యలకి పరిష్కారం పొందుతున్నారు. ఆ నోట, ఈ నోట యోగి గురించి మహారాజుకి తెల్సింది.

దాంతో ఆయన తన మంత్రిని యోగి దగ్గరకు పంపి, ఆ యోగిని రాజభవనానికి రమ్మని వర్తమానం పంపాడు. సరే, ఆ యోగి రాజుగారి అంతఃపురానికి వచ్చాడు.

ప్రజాపతి, మహారాణి, ఆ యోగి పాదాలు, బంగారు పళ్ళెంలో కడిగి, ఆ నీళ్ళు నెత్తిపై చల్లుకున్నారు. ఆపై మహారాజు, ఆ యోగితో, ఓ యోగి పుంగవా! నీకు సంతాన భాగ్యం లేదు. మీరు నా యందు దయ ఉంచి, నాకు సంతానం కలిగే ఏదైనా మార్గాన్ని అనుగ్రహించండి అన్నాడు.



అప్పుడా యోగి ఇలా అన్నాడు. ఓ రాజా! నీకు సంతానం కలగపోవటానికి కారణం వివరిస్తాను విను. నీ భార్య ఐన స్వయంప్రభ గత జన్మలో ఒక గుడి పూజారి కుమార్తె. ఆమె గత జన్మలో అపరిమితమైన దైవభక్తి కలిగి, నిరంతం దైవపూజలు చేస్తూ ఉండేది.

ఆమెకి వివాహం జరిగింది. అయితే ఆమె గత జన్మలో కూడా నీవే భర్తగా ఉన్నావు. మీకు లేక, లేక ఒక అబ్బాయి జన్మించాడు. చాలా ఆలస్యంగా కల్గిన ఆ మగబిడ్డని స్వయంప్రభ విపరీతంగా గారాబం చేసేది.

క్రమంగా మీ బిడ్డ యుక్తవయస్సుకి వచ్చాడు. దాంతో అతనికి మీరు ఘనంగా కళ్యాణం కావించారు.

అయితే అతిగారాబం వల్ల ఆ అబ్బాయి దుర్వ్యసనాలకి అలవాటు పడ్డాడు. పెళ్ళి అయినా అతని బుద్ధి మారలేదు. స్వయంప్రభ తన కుమారుడిని మంచి మాటలతో మార్చాలని ఎంతగానో ప్రయత్నించింది.

కానీ ఫలితం శూన్యం. భర్త దుర్వ్యసనాలు చూసి భరించలేక, అతని భార్య, భర్తను వదిలి పుట్టింటికి వెళ్ళిపోయింది. దాంతో స్వయంప్రభ కుమారుడిని తీవ్రంగా మందలించి, వెంటనే కోడల్ని ఇంటికి తీసుకురమ్మని చెప్పింది. అదే సమయంలో నీవు ఇంటికి వచ్చి, నీ భార్య ద్వారా కుమారుడి ఆకృత్యాలు తెలుసుకొని ఆగ్రహించి, నీ కుమారుడిని కొట్టబోయావు.

అప్పుడు నీ భార్యను, నిన్ను, మీ ఏకైక కుమారుడు ఒక కత్తితో పొడిచి చంపేసాడు. నీవు నీ మరణ సమయంలో, వచ్చే జన్మలో ఒక మహారాజుగా పుట్టాలని కోరుకున్నావు. దాంతో నీవు కళింగ రాజవంశంలో జన్మించావు. ఇక నీ భార్య స్వయంప్రభ, కుమారుడి దుర్మార్గానికి, మనస్సు ముక్కలై, ఇక వచ్చే జన్మలో తనకి సంతానం కలుగరాదని కోరుకున్నది.

దాంతో మీకు ఈ జన్మలో సంతానం లేకుండాపోయింది. గతజన్మలో భార్యాభర్తలుగా ఉన్న మీరు, ఈ జన్మలోనూ భార్యాభర్తలుగా జన్మించారు. మరణ సమయంలో, నాడు మీరు కోరిన కోరికలు ఈ విధంగా ఫలించాయి అన్నాడు.

అప్పుడు మహారాజు ఇలా అన్నాడు. ఓ యోగిపుంగవా, నా గతజన్మ కోరిక ప్రకారం నేను ఈ జన్మలో మహారాజుగా పుట్టాను. కానీ నాకు ఈ జన్మలో సంతానం కలుగకున్న, నా తర్వాత, ఈ రాజ్యానికి వారసుడు ఉండడు. కనుక మాకు సంతానం కల్గే మార్గం చెప్పండి.

మహారాజు మాటలు విన్న యోగి, ఒక్క క్షణం కన్నులు మూసుకుని, ఆపై కళ్ళు తెరిచి, రాజుతో ఇలా అన్నాడు. ఓ రాజా! వేంగీ రాజుకి వైష్ణవి అనే సౌందర్యవంతురాలు అయిన ఒక కుమార్తె ఉన్నది. ఆమెను నీవు వివాహం చేసుకుంటే, నీకు మహర్జాతకుడు ఐన ఒక కుమారుడు జన్మిస్తాడు.

స్వయంప్రభగా గత జన్మలో సంతానం వద్దు అని కోరుకున్న మహారాణి, ఈ జన్మలో సంతానం లేక బాధపడుతున్నది. అయినా యోగి




చెప్పిన ప్రకారం మహారాజుకి ద్వితీయ వివాహం జరిగితే, కనీసం ఆ రెండో భార్య ద్వారా అయినా, తనకి పున్నామ నరకం తప్పుతుంది అని భావించి మహారాజుని రెండో పెళ్ళిచేసుకొమ్మని బ్రతిమిలాడింది.

ఇక తప్పక ప్రజాపతి, రెండో వివాహానికి సమ్మతించాడు. వేంగీరాజ కుమార్తె అయిన వైష్ణవి, ప్రజాపతికి రెండవ భార్యగా వచ్చింది. రెండవ భార్య వచ్చింది కదా అని, మహారాజు పెద్దరాణిని అలక్ష్యం చేయలేదు. పట్టపురాణి హోదా పెద్ద భార్యకే ఉంచేశాడు శాశ్వతంగా. మహారాజు, రెండవ భార్య వైష్ణవిల దాంపత్య ఫలితంగా వైష్ణవి గర్భవతి అయింది. ఆమెకు ఒక మగబిడ్డ కలిగాడు.

రెండో భార్యకి సంతానం కల్గినా, ప్రజాపతి, పట్టపురాణిని నిర్లక్ష్యం చేయలేదు. ఇద్దరు రాణులు కలిసి, ఆ మగబిడ్డను అపురూపంగా పెంచారు. ఆ మగబిడ్డకి రంగవర్మ అనే పేరు పెట్టారు. కాలం గడిచింది. నెలలు, సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. రంగవర్మ యుక్తవయస్కుడు అయ్యాడు.

రాజుగా నిలబడటానికి కావాల్సిన సమస్త విద్యలూ నేర్చుకున్నాడు. రంగవర్మకి, నేపాల దేశ రాజకుమార్తె హైందవితో వివాహం జరిపించాడు ప్రజాపతి. కొన్నాళ్ళకి రంగవర్మ భార్య గర్భవతి అయింది. ఆమెకు ఒక మగబిడ్డ కలిగాడు.

దాంతో ప్రజాపతి మహారాజు తాత కూడా అయ్యాడు. ఆయన, ఇద్దరు రాణులు తమ మనవడి ముద్దు మురిపాలు చూసి మురిసిపోసాగారు. ఆ బిడ్డకి 5వ ఏడు వచ్చింది. అతడికి భానువర్మ అని పేరు పెట్టారు.



ఒకరోజు ప్రజాపతి మహారాజు వేటకు వెళ్ళాడు. అక్కడ అతనికి గాలిలో తేలుతూ, ఎవ్వరి ప్రమేయం లేకుండా మ్రోగుతున్న పిల్లనగ్రోవి కనిపించింది. ఆ వింత చూసిన ప్రజాపతి, అక్కడ తపస్సు చేసుకుంటున్న ఒక మహర్షిని అడిగాడు. అప్పుడా మహర్షి ఇలా అన్నాడు.

ఓ రాజా! ఈ పిల్లన గ్రోవి, ఒక శాపగ్రస్తుడైన యక్షుడు. ఒకసారి ఆ యక్షుడు, మద్యం సేవించి

ఒళ్ళూపై తెలియకుండా, ఈ అడవిలో సంచరిస్తూ, ఒక ఋషిని కర్రతో కొట్టాడు. దాంతో ఆగ్రహించిన ఆ ఋషి, యక్షుడ్ని పిల్లన గ్రోవిగా మారి ఈ అడవిలో సంచరించమని శపించాడు.

అప్పుడు ఆ యక్షుడు, తనను శపించిన మహర్షి కాళ్ళపై పడి, తన తప్పు క్షమించమని, శాపాన్ని ఉపసంహరించమని ప్రార్థించాడు. శాపగ్రస్థుడయిన యక్షుడు దీనాతిదీనంగా ప్రార్థించటం వలన మహర్షి శాంతించి, శాపం తొలగిపోయే విధానం ఇలా చెప్పాడు.

ఓయీ యక్షుడా! నీవు పిల్లన గ్రోవిగా మారి, ఈ అడవిలో సంచరించుచూ, నీ గానాన్ని వినిపించు. ఒకరాజ వంశానికి చెందిన బిడ్డ యొక్క రక్తపు చుక్కలు, నీపై పడిన నాడు నీకు ఈ పిల్లన గ్రోవి రూపము పోయి, నిజరూపము వస్తుంది.

ఈ విధంగా పిల్లన గ్రోవిగా మారిన యక్షుడి కథను మహర్షి ద్వారా తెలుసుకున్న ప్రజాపతి, వెంటనే అంతఃపురానికి వెళ్ళి, మనవడిని తీసుకొని అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ గాలిలో తేలియాడుతున్న పిల్లనగ్రోవిని చేతితో అందుకుని, నేలపై ఉంచి దానిపై తన మనవడికి చిన్న సూదితో, చిన్న చిల్లు వ్రేలిపై చేసి, రెండు చుక్కలు రక్తం, ఆ పిల్లన గ్రోవిపై పడేలా చేసాడు.

అంతే పిల్లనగ్రోవి అదృశ్యమై, ఆ స్థానంలో దివ్యవస్త్ర, ఆభరణ ధారియైన ఒక యక్షుడు ప్రత్యక్షమైనాడు. ప్రజాపతి ఆ యక్షుడికి నమస్కరించాడు.

అప్పుడా యక్షుడు, ప్రజాపతిని ఆశీర్వదించాడు. ప్రజాపతి మనవడిని ఎత్తుకొని ముద్దాడి, ఆశీర్వదించి, వరాలిచ్చి, ఆ బిడ్డడిని మరల ప్రజాపతి చేతికిచ్చి అదృశ్యం అయినాడు.

ఆ తర్వాత ప్రజాపతి మనవడిని తీసుకుని రాజ్యానికి వెళ్ళిపోయాడు. కొన్ని సంవత్సరాల తర్వాత ప్రజాపతి మహారాజు తన కుమారుడ్ని మహారాజుగా, మనవడిని యువరాజుగా నియమించి, తాను రాజ్య వ్యవహారాల నుండి పూర్తిగా తప్పుకొని, తన ఇద్దరు భార్యలతో సహా దైవ నామస్మరణతో కాలం గడపసాగాడు.



# అత్తకు తగ్గ కోడలు పిల్ల

పూర్వం సీతానగరం అనే గ్రామంలో జగ్గయ్యశాస్త్రి అనే వేదపండితుడు ఉండేవాడు. ఆయన ప్రతిరోజు సాయంకాలం కృష్ణానది ఒడ్డున ఉన్న ధర్మ సత్రంలో పురాణాలు చెబుతూ ఉండేవాడు. ఆయన భార్య ఇందిర.

సహజంగానే ఇందిర గయ్యాళిగంప. ఆమెకి నోరు అధికం. దాంతో భర్తని, పిల్లల్ని ఏమాత్రం తేడా వచ్చినా, ఉతికి ఆరేసేది. ఊళ్ళో అందరికీ ఆమె నోరు సంగతి తెలుసు. జగ్గయ్యశాస్త్రికి గోపాల్, రాముడు అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు.

గోపాల్ చక్కగా అందంగా ఉంటే, రాముడు నల్లగా, నల్ల చింతపండులా ఉండేవాడు. చిన్నకొడుకు రాముడిది తల్లి పోలికే, ప్రతిదానికి పేచీ పెట్టేవాడు. అన్నయ్యని నానారకాలుగా తిప్పలు పెట్టేవాడు.

సహజంగా సాత్విక స్వభావం గల పెద్దకొడుకు గోపాల్ తమ్ముడు ఏం చేసినా, నోర్మూసుకొని అన్నీ భరించేవాడు. ఇలా కాలం గడుస్తున్నది. గోపాల్ తండ్రి వెంట వెళుతూ మంత్రాలు, పురాణాలు నేర్చుకొని, స్వయంగా పూజలు చేయిస్తూ బాగానే సంపాదిస్తున్నాడు. ఇక చిన్నకొడుకు రాముడు దొడ్లో కూరగాయలు పండించి, అవి బజారులో అమ్మి కాస్త డబ్బు సంపాదిస్తూ ఉండేవాడు.

ఓ రోజు, కంకిపాడు గ్రామాన్నుంచి ఒక సంబంధం వచ్చింది గోపాల్‌కి. రామకృష్ణశాస్త్రిగారి కుమార్తె అయిన రాధమ్మను మీ కోడలిగా చేసుకొమ్మని పెళ్ళిళ్ళ పేరయ్య జగ్గయ్యశాస్త్రికి చెప్పాడు.

రాధమ్మ పెద్ద అందగత్తె కాకపోయినా మంచి పనిమంతురాలు, శుచి శుభ్రం బాగా తెల్సిన పిల్ల కావటాన జగ్గయ్య శాస్త్రి వెంటనే అంగీకరించాడు. గోపాల్ పెళ్ళి రాధమ్మతో కంకిపాడు గ్రామంలో జరిగింది. కానీ మొదటినుంచీ ఇందిరకు ఈ పెళ్ళి ఇష్టం లేదు.

అందుకు ప్రధాన కారణం రాధమ్మ పేదింటి ఆడబడుచు కావటమే. దాంతో కాపురానికి వచ్చిన రోజు నుండి రాధమ్మని వీలయినన్ని విధాలుగా హింసిస్తూ ఉండేది ఇందిర. రాధమ్మ మెతకతనం చూసి, అత్తగారికి నోరు

మరీ అధికం అయింది. దానికి తోడు గోపాల్ తల్లి మాటకు ఎదురుచెప్పలేని మొహమాటస్తుడు కావటంతో ఇందిరకు ఎదురే లేకుండా పోయింది.

ఇలా కోడలిని నానారకాలుగా పీడిస్తున్న ఇందిర ఒకరోజు అర్ధరాత్రి నిద్రలేచి, జుట్టుని విరబోసుకుని, దొడ్లో బావి దగ్గర నుంచుని, పెద్దగా



అరవసాగింది. ఆమె అరుపులకి మెలుకువ వచ్చిన జగ్గయ్యశాస్త్రి గారు, ఆయన కుమారులు, కోడలు రాధమ్మ, పెరటిలోకి పరిగెత్తారు.

అక్కడ బావి దగ్గర నుంచున్న ఇందిర కనిపించింది వాళ్ళకి. దాంతో వాళ్ళు తెగ కంగారుపడి, ఇందిరని పట్టుకొని ఇంట్లోకి తెచ్చారు. అప్పటికే ఆమెను, కిష్టిగాడు అనే దయ్యం పట్టింది. దాంతో గిన్నెల కొద్దీ పులుసు త్రాగటం, కేజీల కొద్దీ అన్నం తినటం ప్రారంభించింది.

భార్యకి పట్టిన ఈ దయ్యాన్ని ఎలా వదిలించాలో జగ్గయ్యశాస్త్రికి అర్థంకాలేదు. చివరికి కేశవుడు అనే మంత్రవాది ఏదో హోమం చేసి, ఆపై ఒక పేము బెత్తంతో ఇందిరను నాలుగైదు దెబ్బలు వేసాడు. ఆ దెబ్బలు ఇందిరకి తగలలేదు, ఆమెని ఆవహించిన, కిష్టిగాడు అనే దయ్యానికి తగిలాయి. చివరికి ఆ మంత్రవాది కిష్టయ్య దెయ్యాన్ని ఇలా అడిగాడు.

ఒరే కిష్టిగా.. నువ్వు, ఈ ఇందిరను ఎందుకు పట్టుకున్నావు. కారణం చెప్పు బాబూ.... కేశవుడి మాటలు విన్న ఇందరలోని కిష్టిగాడి భూతం ఇలా చెప్పసాగింది. ఈ ఇందిర గతజన్మలో సీతమ్మ అనే వడ్డీవ్యాపారి. నాకు అధిక వడ్డీకి ఋణం ఇచ్చి, నా దగ్గరున్న డబ్బంతా లాగేసింది. చివరికి నేనున్న ఇల్లుని కూడా అమ్మించి, ఆ డబ్బు తీసుకుని తన అప్పు క్రింద జమ వేసుకున్నది.



ఈ దుర్మార్గురాలి వల్ల నా అప్పులు ఎన్నాళ్ళకీ తీరక, వడ్డీలు, చక్రవడ్డీలు కట్టలేక ఒకరోజు పెరటిలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాను. కిట్టిగాడి దయ్యం మాటలు విన్న మంత్రవాది ఇలా అన్నాడు. ఓ స్త్రీ దయ్యమా? ఏం చేస్తే నీకు శాంతి కలుగుతుంది?. అప్పుడు కిష్టిగాడి దయ్యం, తనకున్న కోరికలు అన్నీ తీరిస్తే, ఇందిరను వదిలిపోతానని చెప్పింది.

అప్పుడు రాధమ్మ ఇందిరకు ఎదురుగా నిలబడి, ఆమెని ఆవహించి ఉన్న కిష్టిగాడి దయ్యాన్ని ఇలా ప్రార్థించింది. ఓ దయ్యమా! నీవు మా అత్తగారిని పీడించకు. ఆమె గతజన్మలో నీకు ద్రోహం చేసి ఉండవచ్చు, అందుకు పగపట్టి, ఆమెను ఇలా పీడించటం నీకు ధర్మం కాదు. నీకేం కావాలో చెప్పు, అన్నీ చేస్తాను, చివరికి నా ప్రాణం కావాలన్నా ఇస్తాను.

రాధమ్మ మాటలు విన్న కిష్టిగాడి దయ్యం ఇలా అన్నది : ఒసేయ్ రాధమ్మా! నాకు వెయ్యి పూర్ణాలు వండి పెట్టు అన్నీ తినేస్తా... ఆపై ఒక గంగాళం చక్రపొంగలి చేసిపెట్టు ఆకలి తీరా మెక్కుతా. కిష్టిగాడి దయ్యం చెప్పినవి, రాధమ్మ అత్యంత శ్రద్ధగా చేసింది.

దాంతో ఇందిరని పట్టిన దయ్యం వదిలిపోయింది. ఆ రోజు నుండి రాధమ్మ, ఇందిరలు అత్తాకోడళ్ళులాగా కాకుండా, తల్లీ కూతుళ్ళలాగా మెలగసాగారు. దాంతో జగ్గయ్య శాస్త్రిగారు, గోపాల్ ఆనందంగా నిట్టూర్చారు. తర్వాత రాధమ్మకి ఏనాడూ అత్తగారి వలన ఎలాంటి బాధ కలగలేదు.

## సోమరిపోతు

పూర్వం ప్రత్తిపాడు అనే గ్రామంలో సత్తెయ్య అనే రైతు ఉండేవాడు. అతడు చాలా కష్టజీవి. తనకున్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండేవాడు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులూ ఉండేవారు.

ఒకసారి ఏదో అనారోగ్యం వచ్చి సత్తెయ్య భార్య మరణించింది. దాంతో సత్తయ్య పిల్లలు తల్లిలేని అనాధలు అయ్యారు. భార్య పోయిన

దుఃఖాన్ని మ్రింగుకొని సత్తయ్య, తన పిల్లల్ని చాలా జాగ్రత్తగా పెంచసాగాడు. కాల చక్రంలో పదిహేను సంవత్సరాలు గడిచిపోయాయి.

ఇప్పుడు సత్తెయ్య కొడుకులు పెద్దవాళ్ళు అయ్యారు. పెద్దకొడుకు సుబ్బయ్య తండ్రిలాగే కష్టజీవి. చిన్నప్పటి నుండి తండ్రి వెంట పొలానికి వెళతూ పొలం పనులు బాగా నేర్చుకున్నాడు. చిన్నకొడుకు గోపయ్య మహా సోమరిపోతు. ఎంత సోమరిపోతు అంటే రోజూ స్నానం చెయ్యాలన్నా, దంతధావనం చెయ్యాలన్నా వాడికి చిరాకే.



కొంతకాలానికి తండ్రి చనిపోయాడు. కానీ తండ్రి బ్రతికి ఉన్నంతకాలం గోపయ్య పని బాగానే ఉండేది. తల్లి లేని బిడ్డ అని చిన్నకొడుకుని ఏమీ అనేవాడు కాదు. దాంతో గోపయ్య, ఆ గ్రామంలోని అలగా జనాలతో తిరగటం మొదలుపెట్టాడు. అలాంటి వాళ్ళ స్నేహం వల్ల గోపయ్య కల్లు, సారాయి లాంటి వ్యసనాలకి బానిస అయ్యాడు.

తండ్రిపోయాక తన చెడు ఖర్చులకి డబ్బులు లేక గోపయ్య విచారించసాగాడు. దాంతో ఒకరోజు పొలానికి బయలుదేరుతున్న అన్నయ్యను పిలిచి, ఒరే అన్నాయ్! నాన్న పోయాడు. మనం విడిపోదాము. ఎవరి వాటా, వాళ్లు తీసుకొందాం అన్నాడు. తమ్ముడి మాటలు విని బాధపడ్డ సుబ్బయ్య ఇలా అన్నాడు.

తమ్ముడూ! నీకు గుర్తుందా మన నాన్నగారు చనిపోయే ముందు కష్టించిన వాడికే ఫలితం దక్కుతుంది. శ్రమజీవికి ఈ లోకం లక్ష్మీనివాసం అని చెప్పారు. అన్న మాటలు విన్న గోపయ్య మొహం చిట్లించి, ఆ ముసలాడు ఒక దద్దమ్మ, లేకుంటే ఒక అర్థ ఎకరం పొలాన్ని 20 ఏళ్ళు సాగుచేసి కూడా, కనీసం ఒక్క ఎకరం కూడా అదనంగా సంపాదించ లేకపోయాడు.



పైగా కష్టపడితేనే లాభం ఉంటుందా, కష్టపడితే చెమట కారిపోతుంది కానీ బంగారం కారిపోదు అన్నాడు. తమ్ముడు మాటలు విన్న అన్న సుబ్బయ్య, ఒరే తమ్ముడూ ! సరే నీ వాటా నీకు ఇచ్చాననుకో, ఏం చేస్తావు అన్నాడు. అప్పుడు గోపయ్య, హాయిగా సారాకొట్టు పెట్టుకుంటా, నాకు కావాల్సినంత తాగి మిగతాది జనాలకి అమ్ముతా.

దాంతో నాకు కావాల్సినంత లాభం అన్నాడు. తమ్ముడు ఏం చెప్పినా వినడని అర్థం చేసుకున్న అన్నయ్య, వాటాలు వేయసాగాడు. చివరగా బండి, ఎడ్లు వచ్చాయి. వాటిని ఎలా పంచుకుంటాం అన్నాడు సుబ్బయ్య. దాంతో గోపయ్య మొండిగా, ఆహా! నాకు కుదర్దు. బండి, ఎడ్లు కూడా పంచాల్సిందే అన్నాడు.

చివరికి సుబ్బయ్య, బండి, ఎడ్లు తీసుకొని, తమ్ముడికి ఇల్లు, పొలం ఇచ్చి, కట్టుబట్టలతో ఇల్లు వదిలాడు. అన్నయ్య అలా వెళ్ళగానే, గోపయ్య సారాకొట్టు ఇంట్లోనే పెట్టే ప్రయత్నాలలో పడ్డాడు.

సారాకొట్టు పెట్టటానికి కావాల్సిన డబ్బుకోసం, తండ్రి ఇచ్చిన పొలాన్ని అమ్మాడు. ఇక ఇంట్లో సారాకొట్టు ప్రారంభించి తాను తాగుతూ, ఇతరులకి తాగిస్తూ, మైకంలో తేలిపోసాగాడు సోమరిపోతు తమ్ముడు గోపయ్య.

ఇక కేవలం బండి, ఎండ్లు తీసుకున్న అన్నయ్య, ఆ బండిని కిరాయికి తిప్పుకుంటూ, ఖాళీ సమయాలలో తన గుడిసె ముందున్న కూరగాయల మడిని సరిదిద్దుకుంటూ కాలక్షేపం చేయసాగాడు. కాలం గడుస్తున్నది.

సుబ్బయ్య కూరలు పండించి, బస్తీలోకి తీసుకెళ్ళి అమ్మి బాగా లాభాలు గడించి, రెండు ఎకరాల పొలం కొని, దాంట్లో పెద్ద ఎత్తున పళ్ళు, కూరలు పండిస్తూ, ఆర్థికంగా స్థిరపడి ఒక మధ్య తరగతి అమ్మాయిని పెళ్ళి చేసుకుని, ఒక ఇల్లు కూడా కట్టుకుని సుఖంగా జీవిస్తున్నాడు.

సారాకొట్టు పెట్టిన తమ్ముడు, కొన్నాళ్ళు బాగానే వ్యాపారం చేసాడు. ఆపై సారాయి తాగిన వాళ్ళు డబ్బులు ఎగ్గొట్టి పోవటంతో వ్యాపారం దివాలా దీసింది. దాంతో ఉన్న ఇల్లు అమ్ముకుని, ఆ సారా కొట్టుపై అయిన అప్పులు తీర్చి బయటపడ్డాడు.

ఆపై ఏం చేయాలో తెలీక ఊరు వెంట పిచ్చాడిలా తిరగసాగాడు. ఇంతలో కొత్త సంవత్సరం అంటే ఉగాది పండుగ వచ్చింది. ఊళ్ళో అందరూ హాయిగా పండగ చేసుకుంటూ, ఆనందంగా ఉంటే గోపయ్య మాత్రం బికారి అవతారంలో ఊర్లో అందరి ఇళ్లకు తిరిగి ఏమన్నా ఉంటే తింటానికి పెట్టమని ప్రాధేయపడసాగాడు.

కానీ సోమరి గోపయ్య అంటే అందరికీ అసహ్యమే. దాంతో అందరూ ఛీ, కొట్టారు గోపయ్యని. చివరగా అన్న సుబ్బయ్య ఇంటి ముందు నిలబడి, తింటానికి ఏమైనా పెట్టమని అరిచాడు. కానీ నిజానికి గోపయ్యకి తెలీదు, తాను అన్నీ లాక్కుని వెళ్ళ గొట్టిన అన్నయ్య కష్టపడి సంపాదించుకున్న ఇంటి ముందే నిలబడి ఉన్నానని.

సరిగ్గా అప్పుడే పట్టుపంచ, లాల్చీ ధరించిన అన్న సుబ్బయ్య వాకిట్లోకి వచ్చి, పరమ దీనస్థితిలో ఉన్న తమ్ముడిని గుర్తించాడు. ఖరీదైన కొత్త బట్టల్లో మెరిసిపోతున్న అన్న గోపయ్యని గుర్తుపట్టి సిగ్గుతో తల వంచుకున్నాడు.

అప్పుడు సుబ్బయ్య గోపయ్యను ఆదరంగా లోనికి పిలిచి, పనివాడిని రప్పించి గోపయ్యకి చక్కగా క్షౌరం చేయించి, ఆపై వేడి, వేడి నీళ్ళతో తలంటు స్నానం చేయించి, కట్టుకోవటానికి కొత్త బట్టలు ఇచ్చాడు.

ఆపై గోపయ్యకి ఉగాది పచ్చడి పెట్టి , తర్వాత కమ్మని భోజనాన్ని పెట్టించాడు. గోపయ్యకి అంతా కలలాగా ఉన్నది. అన్నీ తనకే ఇచ్చి, ఒక బండి, 2 ఎద్దులతో, బయటికి వెళ్ళిన అన్న, ఈ రోజు ఇంతగా వృద్ధి చెందటానికి గల కారణం ఏమిటా అని ఆలోచించసాగాడు.

తమ్ముడి ఆలోచన గ్రహించిన సుబ్బయ్య, ఒరే తమ్ముడూ ! నేను ఈ స్థితికి రావటానికి కారణం... నేను శ్రమను నమ్ముకున్నాను. నాకు అదృష్టం మీద నమ్మకం లేదు. నా మేథస్సుపైనే నమ్మకం ఉన్నది. మనం నిజాయితీగా శ్రమపడి చేస్తే, ఏ పని అయినా బంగారం ఇస్తుంది అన్నాడు.

అన్న మాటలు అర్థం చేసుకున్న గోపయ్య తనని క్షమించమని అన్న కాళ్ళపై పడ్డాడు. దాంతో కరిగిపోయిన సుబ్బయ్య, తమ్ముడిని పైకి లేపి, ఆదరంగా ఆలింగనం చేసుకున్నాడు.

ఆ తర్వాత గోపయ్య, అన్నగారి వ్యాపారంలో పాలు పంచుకొని మంచి తెలివితేటలు చూపి, వ్యాపారాన్ని బాగా వృద్ధి చేసి శ్రమయే దైవం అని నమ్మే సుబ్బయ్యకు తగ్గ తమ్ముడు అనిపించుకొన్నాడు. కొన్ని నెలల తర్వాత, గోపయ్యకి ఒక ధనికుడి కుమార్తెతో వివాహం జరిపించాడు అన్నయ్య సుబ్బయ్య.



## మాంత్రికుడు - యువరాజు

పాండ్యరాజ్యాన్ని చోళరాజు పరిపాలిస్తున్న కాలంలో ఒకసారి అనావృష్టి ఏర్పడి వర్షాలు లేక నేల బీటలు వారింది. కనీసం తాగే నీటికి కూడా కరువు వచ్చింది. దాంతో రాజుగారు తన ఆస్థాన పురోహితుడిని పిలిచి, వర్షాలు కురిసి, రాజ్యం సస్యశ్యామలం కావాలంటే ఏం చెయ్యాలి అని అడిగాడు.

అప్పుడు ఆ పురోహితుడు, మన రాజ్యం చివర ఉన్న అడవిలో ధూమకేతుడు అనే మాంత్రికుడు ఉన్నాడు. అతడిని కానీ పిలిపించి, పూజలు, పరిహారాలు చేసినట్టయితే, మంచి వర్షాలు పడతాయని చెప్పాడు. దాంతో చోళరాజు, ధూమకేతుడికి రమ్మని కబురు చేసాడు.

ధూమకేతుడు మహా మాంత్రికుడు. అతడు తన మాంత్రిక విద్యల ద్వారా కొండల్ని గాలిలో ఎగిరేలా చెయ్యగలడు. సముద్రాల్ని ఇంకేలా చెయ్యగలడు.

అలాంటి మహత్తర శక్తులున్న ఆ ధూమకేతుడు చోళరాజు దర్బారుకి వచ్చి, ఆ రాజ్యంలో ఉన్న అనావృష్టి గురించి తెలుసుకొని, రాజా! నేను భైరవుడ్ని పూజించి, రోజుకో గుర్రాన్ని చొప్పున తొమ్మిది రోజులు బలి ఇస్తాను. దాంతో ఆ భైరవుడి కటాక్షం కలిగి మీ రాజ్యానికి అనావృష్టి తొలగిపోతుంది అన్నాడు.

రాజుగారు 'ధూమకేతు' కోరినవి ఏర్పాటు చేసాడు. ఒక విశాలమైన ప్రాంగణంలో భైరవుడి విగ్రహాన్ని ఉంచి, దాన్ని పూజించి, ఒక గుర్రాన్ని బలి ఇచ్చాడు ధూమకేతుడు. ఆ తతంగం అంతా చూడటానికి, చాలా మంది పుర ప్రముఖులు వచ్చారు.

చోళరాజు కూతురు మీనాక్షి కూడా వచ్చి తండ్రిగారి ప్రక్కనే కూర్చుని భైరవపూజ చూస్తున్నది. భైరవుడికి పూజలు చేస్తున్న ధూమకేతుడి దృష్టి

హఠాత్తుగా యువరాణి మీనాక్షిపై పడింది. అప్పటిదాకా అలాంటి సుందరిని చూడని ధూమకేతుడు యువరాణిపై వ్యామోహాన్ని పెంచుకొన్నాడు.

ఆ తర్వాత ధూమకేతుడు రాజుని కలసి, రాజా! మొదటిరోజు పూజ అయిపోయింది. ఇంకా 29 రోజులు పూజ జరిపిస్తే, భైరవుడు ప్రత్యక్షమై, నీ రాజ్యానికి అనావృష్టి తొలగిస్తాడు అన్నాడు. అప్పుడు చోళరాజు, మహామాంత్రికుడితో అలా జరగాలే కానీ, నీవు ఏది కోరితే అది ఇస్తాను అన్నాడు.

రాజు ఇచ్చిన మాటను ఆధారంగా తీసుకొని రాజా! నాకు ధనం, ఆస్తులు, సైనికులు వద్దు అన్నాడు. మరేమి కావాలి అన్నాడు చోళరాజు. అప్పుడు మాంత్రికుడు తన మనసులోని ఆలోచనని బయటపెట్టాడు. తనకి రాజకుమార్తె మీనాక్షితో వివాహం జరిపించమన్నాడు.



మాంత్రికుడు కోరిన కోర్కె విని, చోళరాజు నిర్ఘాంతపోయాడు. ఓరి మాంత్రికుడా! కోరుకోమన్నాను గదా అని అలా న్యాయరహితంగా కోరవచ్చునా, వందేళ్ళ వయస్సు ఉన్న నీకు, 18 ఏళ్ళ వయసున్న నా కుమార్తె మీనాక్షి భార్యగా కావాలా? ఇది నీకు ధర్మంగా ఉన్నదా అన్నాడు చోళరాజు.

రాజు మాటలు విన్న ధూమకేతుడు, ఓరి రాజాధమా! వయస్సు మీరిపోవటం కేవలం సాధారణ మనుష్యులకి జరుగుతుంది. నాలాంటి మంత్రవేత్తలకు ఎంత వయస్సు వచ్చినా, నవయవ్వనం ఉంటుంది. కనుక



నీవు, అధిక ప్రసంగం చేయక, నాకు, నీ కుమార్తెతో వివాహం చెయ్యి లేదా నీ రాజ్యాన్ని క్షణాల్లో బూడిదగా చేసి పారేస్తాను అని గర్జించాడు.

ధూమకేతుడు అన్నంత పనీ చేయగల శక్తి గలవాడేనని గ్రహించి, అప్పటికి అంగీకరించినట్టు నటించి, ధూమకేతుడ్ని పంపించి వేసాడు. ఒక్క నెల ఆగితే ఆ రాజకుమార్తె నా స్వంతం అవుతుందని ఆనందపడుతూ, భైరవుడు పూజలు జరిపించటానికి వెళ్ళిపోయాడు.

చోళరాజుకి ఏం చెయ్యాలో అర్థంకావటం లేదు. తన కుమార్తెను ఇచ్చి వివాహం చేయకుంటే, ధూమకేతుడు ఖచ్చితంగా తన రాజ్యాన్ని సర్వనాశనం చేస్తాడు. పోనీ ఆ వివాహం జరిపిద్దామా అంటే పరమ దుర్మార్గుడు, ఆపై వృద్ధుడు అయిన మాంత్రికుడికి, తన కూతుర్ని ఇచ్చిన ఆమె నూరేళ్ళ జీవితాన్ని తానే నాశనం చేసినట్టు అవుతుంది.

రాజుగారు ఇలా మధనపడుతుండగా, బొబ్బిలి రాజ్యానికి చెందిన రామరాజు, చోళరాజుని కలవటానికి వచ్చాడు. మొదటి నుండీ, బొబ్బిలి రాజ్యానికి, చోళరాజ్యానికి స్నేహ సంబంధాలు బాగానే ఉన్నాయి. చోళరాజుని కలిసాడు బొబ్బిలి యువరాజు రామరాజు.

బొబ్బిలి యువరాజు అందగాడే కాక, సాహస, పరాక్రమాలు కల్గినవాడని చోళరాజుకి తెలుసు. అందుకే దాపరికం లేకుండా, బొబ్బిలి యువరాజుకి, తనకు వచ్చిన సమస్య గురించి చెప్పాడు.

చోళరాజు చెప్పినది విన్న రామరాజు, చిన్నగా నవ్వుతూ, చోళరాజా! నేను ఆ ధూమకేతుడ్ని సంహరించి, మీ అమ్మాయికి, మీ రాజ్యానికి ఏర్పడ్డ గండాల్ని తొలగిస్తాను మీరు నిశ్చింతగా ఉండండి అన్నాడు. రామరాజు వదనంలో కనిపిస్తున్న తేజస్సుకి, చోళరాజుకి ఆనందం కలిగింది.

రామరాజు వెంటనే బయలుదేరి చోళరాజు యొక్క గురువును కలిసాడు. చోళరాజ వంశానికి మూడు తరాలుగా, రాజ గురువుగా ఉంటున్న రంగమన్నార్, రామరాజుకి ఇలా చెప్పారు.

రాకుమారా! నీవు ఈ చోళరాజ్యానికి పట్టిన పీడను వదిలించటానికి సిద్ధపడినందుకు, నాకు చాలా సంతోషంగా ఉంది. కానీ అతడ్ని జయించటం చాలా కష్టం. రాజగురువు మాటలు విన్న రామరాజు, గురుదేవా! మనసుంటే

మార్గం ఉంటుంది. ఆ ధూమకేతుడ్ని ఎలా జయించాలో, మీ వంటి జ్ఞానులకి తెలిసే ఉంటుంది. కనుక అలాంటి మార్గం ఏదన్నా ఉంటే దయచేసి నాకు చెప్పిండి... అది ఎంత కష్టమయినా సాధిస్తాను అన్నాడు.

రామరాజు ధైర్యానికి, వినయానికి సంతోషించిన రాజగురువు, నాయనా రామరాజూ! నీ సాహసానికి నా అభినందనలు. నీవు తప్పక ఆ ధూమకేతుడ్ని సంహరించగలవు. నీవు ఆ మాంత్రికుడిని జయించాలంటే, పరశురాముని గండ్రగొడ్డలిని సాధించాల్సి ఉంటుంది అన్నాడు.

రామరాజు ఆశ్చర్యపడి గురుదేవా, ఎప్పుడో వేల సంవత్సరాల క్రితం, దుర్మార్గులైన రాజుల్ని సంహరించిన ఆ పరశురాముని గండ్రగొడ్డలి ఇప్పుడు ఎలా లభిస్తుంది అన్నాడు. రాజగురువు చిరునవ్వు నవ్వి, నాయనా ఈ చోళరాజ్యానికి చివరగా కన్యాకుమారి ఆలయం ఉన్నది. నీవు ఆలయానికి వెళ్ళి, ఆ దేవతను ప్రార్థిస్తే, నీకు ఆమె పరశురాముడు తన వద్ద భద్రపరిచిన గండ్ర గొడ్డల్ని ఇస్తుంది. నీవు ఆ గండ్రగొడ్డలితో ధూమకేతుడ్ని అవలీలగా జయించగలవు అన్నాడు.

రామరాజు, రాజగురువు చెప్పింది విని, గురుదేవా! మీరిచ్చిన ఈ సలహాకు నాకృతజ్ఞతలు, నేను వెంటనే కన్యాకుమారీ ఆలయం చేరతాను అని రాజగురువు వృద్ధ సెలవు తీసుకొని, కన్యాకుమారీకి పయనం అయ్యాడు. సరిగ్గా నాలుగు రోజుల తర్వాత రామరాజు కన్యాకుమారి ఆలయానికి చేరాడు.

నిర్మానుష్యంగా ఉన్న ఆ ఆలయంలో రామరాజు మూడు రోజులు తపస్సు చేసాడు. నాల్గవరోజు కన్యాకుమారి మాత ప్రత్యక్షం అయి రామరాజుని ఆశీర్వదించి, పరశురాముని గండ్రగొడ్డలిని బహూకరించింది. ఆ తర్వాత రామరాజు, మూడురోజులు ప్రయాణించి మళ్ళీ చోళరాజుని కలిసాడు.

తనకి కన్యాకుమారీ మాత గండ్రగొడ్డలిని ప్రసాదించింది అని, ఇక ఆ ధూమకేతుడ్ని హతమార్చటం చాలా సులువు అనీ రామరాజు చెప్పాడు. రోజులు గడుస్తున్నాయి. 30వ రోజు వచ్చింది, ఆ రోజు ఆఖరి గుర్రాన్ని బలి ఇచ్చాడు, మాంత్రికుడు. గుర్రాన్ని బలి ఇచ్చిన మరుక్షణమే ఆకాశం మేఘావృతమై, చోళరాజ్యమంతటా కుంభవృష్టి కురిసింది.


31వ రోజున ధూమకేతుడు, చోళరాజు దగ్గరికి వెళ్ళి, రాజా! నా మాట నిలబెట్టుకున్నాను. భైరవుడి దయవల్ల నీ రాజ్యంలో నీటి కరువు తీరిపోయింది.

ఇంకా ఐదు సంవత్సరాలు వర్షాలు పడకున్నా, నీ రాజ్యానికి అనావృష్టి రానంతగా భారీవర్షాలు పడ్డాయి. ఇక నీ మాట నిలబెట్టుకో, రాజకుమారిని నాకిచ్చి, ఈ క్షణమే వివాహం చెయ్యి అన్నాడు.

అప్పుడు చోళరాజు, మాంత్రికుడితో ఇలా అన్నాడు, ఓయీ మాంత్రికుడా! నీ సామర్థ్యం, మంత్రశక్తి నిజంగా చాలా గొప్పవి. అయితే మా వంశాచారం ప్రకారం నీవు మా దేశానికి చెందిన ఒక వీరుడిని యుద్ధంలో ఓడించాలి. ఆ తర్వాత నా కుమార్తెతో, నీ వివాహం జరిపిస్తాను అన్నాడు.

అప్పుడు మాంత్రికుడు, ఓయీ రాజా! నా ముందు నిలబడటమే ఈ నరాధములకి వీలు కాదు. అలాంటిది నాతో పోరాడే మగాడు ఈ రాజ్యంలో ఉన్నాడా అని వికటంగా నవ్వాడు.

అప్పుడు చోళరాజు, నిజమే కావచ్చు, కానీ నామ మాత్రంగా, పోరాడక తప్పదు అన్నాడు. సరే ఈ క్షణమే నాతో పోరాడే వాడిని నా ముందు నిలబెట్టు అని గర్జించాడు ఆగ్రహంగా.

తర్వాత రామరాజుకి, మాంత్రికుడికి జరిగిన ఘోరయుద్ధంలో రామరాజు, ధూమకేతుడ్ని చంపేసాడు. ఆ తర్వాత రామరాజు రాజకుమార్తెను వివాహం చేసుకుని, భార్యతో సహా తన రాజ్యానికి బయలుదేరాడు.

# సవతి తల్లి - తుంటరి భూతం

పూర్వం తాడిపల్లి అనే గ్రామంలో జగ్గయ్య అనే ధనికుడు ఐన రైతు ఉండేవాడు. ఆయనకి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉండేవాళ్ళు. ఆ అమ్మాయిల పేర్లు శైలజ, పద్మజ.

జగ్గయ్య దానధర్మాలు చేస్తూ అందర్నీ ఆదుకుంటూ మంచి పేరు సంపాదించాడు. ఆయన భార్య కూడా భర్తకి తగ్గదే. పూజలు, పునస్కారాలు

చేస్తూ, బంధువులలో మంచి కీర్తి పొందింది. అలా ఆనందంగా కుటుంబంతో కాలక్షేపం చేస్తున్న జగ్గయ్యకి భార్య అకాలమరణం ఆశనిపాతంలా తాకింది.

దాంతో ఆయన ఏ విషయాలు పట్టించుకోకుండా ఒక సన్యాసిలాగా జీవించసాగాడు. అయితే చిన్నపిల్లలు అయిన కూతుళ్ళ గురించి కొంత దిగులు జగ్గయ్యలో ఉండేది. చివరికి బంధువుల వత్తిడి మీద, సూరమ్మని రెండో భార్యగా తెచ్చుకున్నాడు.

ఈ సూరమ్మ చూట్టానికి అమాయకంగా కనిపిస్తుంది కానీ, పరమ గయ్యాళి గంప. కాపురానికి వచ్చిన రెండోరోజే, భార్య నోటి దురుసు, చేతిదురుసు గ్రహించాడు జగ్గయ్య. అయినా ఇప్పుడు చేయగల్గింది ఏముంది. దాంతో ఇద్దరు కూతుళ్ళని, సూరమ్మ దయా,దాక్షిణ్యాలకు వదిలివేసి, చేతులు ముడుచుకుని కూర్చున్నాడు.

భర్త అసమర్ధతను ఆధారంగా చేసుకొని, సూరమ్మ తన సవిత కూతుళ్ళని చాలా బాధలు పెట్టేది. పిండి వంటలు చేసి, జిడ్డు బాణాలి, పాత్రలు తోమాలని సవితి కూతుళ్ళని పీడించేది. వాళ్ళకి కడుపు నిండా తిండి అయినా పెట్టక ఏడ్పించేది. కాలం గడుస్తున్నది. జగ్గయ్య కూతుళ్ళు శైలజ, పద్మజ యుక్తవయస్సుకి వచ్చారు.

వాళ్ళు ఇప్పుడు దేవకన్యల్లాగా అందంగా ఉన్నారు. సవతి తల్లి ఎన్ని బాధలు పెట్టినా ఆ అమ్మాయిలు తండ్రికి చెప్పే వాళ్ళు కాదు. సూరమ్మకి కూడా ఒక కూతురు పుట్టింది. ఆ అమ్మాయి పేరు జలజ. ఈ జలజ కూడా సవతి అక్కల మీద ద్వేషం పెంచుకున్నది.

కారణం జలజ అనాకారిలా ఉంటుంది, దాంతో అందంగా ఉన్న అక్కల్ని చూసి మనసులో కుళ్ళిపోతూ ఉండేది. కాలం గడుస్తున్నది. ఒకరోజు సూరమ్మ ఆమె కూతురు జలజ, జగ్గయ్య ఇంట్లో లేని సమయం చూసి, శైలజ, పద్మజల్ని చావగొట్టి, ఇంట్లో నుండి తరిమేశారు.

దాంతో ఎటుపోవాలో తెలీని ఆ అక్కచెల్లెళ్ళు, ఒక పాడుబడ్డ బావి దగ్గరికి వెళ్ళి నించున్నారు. సరిగ్గా అప్పుడే ఆ బావిలో నుండి ఒక తుంటరి భూతం బయటికి వచ్చి, శైలజ, పద్మజల ముందు నిలబడింది. ఆ భూతాన్ని చూడగానే అక్కచెల్లెళ్ళు కెవ్వుమని భయంతో అరిచారు.



కానీ ఎటూ పరిగెత్తలేదు. అప్పుడా భూతం వాళ్ళతో ఇలా అన్నది. ఒసే అమ్మాయిలూ! మీకు ఏం కష్టం వచ్చింది. ఇంత చిన్న వయస్సులోనే ఆత్మహత్య చేసుకోవాలని చూస్తున్నారు. భూతం మాట విన్న అక్కాచెల్లెళ్ళు, ఓసీ భూతమా! నీకు మా సవతి తల్లి సంగతి తెలీదులా ఉన్నది. ఆవిడ పెట్టే బాధలకి నీవైనా సరే పరిగెత్తి పారిపోతావు తెలుసా అన్నారు.



అప్పుడా భూతం ఆహా! అలాగా, అయితే మీ సవతి తల్లిని చూడాల్సిందే, రండి మీ ఇంటికి వెళ్దాం అన్నది. ఇల్లు అన్న మాట వినగానే ఆ అక్కాచెల్లెళ్ళు భయంతో వణికిపోయి, "ఆహ, మేం ఇంటికి తిరిగి రాము, కావాలంటే నువ్వే వెళ్ళి మా సవతి తల్లిని చూసిరా" అన్నారు.

అప్పుడా తుంటరి భూతం ఇలా అన్నది. మీ భయం పాడుగానూ. నేను మీ వెంట ఉండగా, మీ పిన్ని, మిమ్మల్ని ఏం చేయలేదు. ధైర్యంగా నా వెంట రండి, ఆవిడికి తగిన బుద్ధి చెప్తాను. భూతం మాటలు విన్నాక ఆ అక్కాచెల్లెళ్ళకి బాగా ధైర్యం వచ్చి, సరే పద, అని ఆ భూతాన్ని వెంట పెట్టుకొని, ఇంటికి బయలుదేరారు.

భూతం అదృశ్య రూపంలో ఉండి, శైలజ, పద్మజల వెనకాలే ఇంట్లోకి వచ్చింది. సవతి కూతుళ్ళని చూడగానే సూరమ్మ, గయ్యిమని అరిచి ఏమే, దొంగపీనుగుల్లారా, మళ్ళీ కొంపకి ఎందుకు వచ్చారే, ఎక్కడైనా పడిచావక అని తిట్లు లంకించుకుంది.

దాంతో శైలజ, పద్మజలు హడలిపోయి, ఇంట్లోంచి బయటికి పరిగెత్తాలని చూడగా, వాళ్ళ వెనకాల అదృశ్యంగా ఉన్న భూతం, అమ్మాయిలూ, కంగారుపడకండి మీ పిన్ని అంతు చూస్తాను అన్నది.

దాంతో ధైర్యం వచ్చిన ఆ అక్కాచెల్లెళ్ళు అక్కడే నించున్నారు. దాంతో సూరమ్మ కోపంగా వాళ్ళ వైపు రాసాగింది. సరిగ్గా అప్పుడే, మూల ఉన్న ఒక బెత్తం గాలిలోకి లేచి, సూరమ్మని చావబాదసాగింది.

ఆ బెత్తం దెబ్బలకి తట్టుకోలేక సూరమ్మ ఇల్లంతా, అటు, ఇటు పరిగెత్తసాగింది. ఈ విచిత్రం చూసిన సూరమ్మ కూతురు జలజ దడుసుకొని ఒక గదిలో దూరి తలుపులు గడియ వేసుకొని కూర్చున్నది.

తుంటరి భూతం కొట్టే దెబ్బలికి తట్టుకోలేక సూరమ్మ ఇంట్లోంచి పారిపోయి, బైట నించుంది. తుంటరి భూతం అప్పటికి గానీ, బెత్తంతో సూరమ్మని చావగొట్టే కార్యక్రమం ఆపలేదు. వీధిలో ఒక చెట్టుక్రింద చూర్చుని, తన వంటిపై ఉన్న వాతల్ని చూసుకొని, సూరమ్మ వెక్కి, వెక్కి ఏడవసాగింది.

సరిగ్గా అప్పుడే వేరే ఊరి నుండి తిరిగి వస్తున్న జగ్గయ్యకు వీధిలో నుంచుని ఏడుస్తున్న భార్య కనిపించి, ఆందోళనగా ఆమె దగ్గరికి వెళ్ళి, ఏమిటే, ఇలా వీధిలో నుంచుని ఏడుస్తున్నావు? నువ్వే అందర్నీ ఏడిపించటం తప్ప, నీవు ఎప్పుడూ ఏడిచినట్టు లేదు. ఏమిటి సంగతి అన్నాడు.

భర్త మాటలు విన్న సూరమ్మ, ఇంకోసారి భోరుమని ఏడిచి, ఇలా అన్నది, నీ కూతుళ్ళు నా మీద చేతబడి చేసారు, ఒక బెత్తం దానంతట అదే గాలిలోకి లేచి, నన్ను చావబాదింది. భార్య మాటలు విన్న జగ్గయ్య, సరే చూద్దాం ఏమిటో ఆ వింత అని ఇంట్లోకి వెళ్ళాడు.

అక్కడ కూర్చుని మాట్లాడుకుంటున్న ఇద్దరు కూతుళ్ళు కనిపించారు తప్ప, సూరమ్మని ఇప్పటి దాకా చావబాదిన తుంటరి భూతం కనిపించలేదు. దాంతో కూతుళ్ళని అడిగాడు. ఏమిటి ఇందులోని రహస్యం అని. అప్పుడు శైలజ తండ్రితో నాన్నా! ఇన్నేళ్ళుగా పిన్ని మమ్మల్ని నానారకాలుగా హింసిస్తున్నా నీకు చెప్పలేదు. ఇప్పుడు మమ్మల్ని ఇంట్లోంచే తరిమివేసింది అని జరిగినదంతా చెప్పారు.

ఒక భూతం వచ్చి తన భార్యకి బుద్ధి చెప్పింది అని తెలుసుకున్న జగ్గయ్య, వీధిలోకి వెళ్ళి భార్యతో, ఏమే, చూశావా నీ వెధవ చేష్టల వల్ల, మన ఇంట్లోకి ఒక భూతం వచ్చి, నిన్ను శిక్షించింది. ఇక మీదట అయినా, నీ సవితి కూతుళ్ళతో సరిగ్గా ప్రవర్తించు.



నీకు ఆ భూతం బాధ తప్పుతుంది అన్నాడు. తన తప్పు తెలుసుకున్న సూరమ్మ, భూతం దగ్గరికి వెళ్లి, లెంపలు వేసుకొని, ఇకపై నా కూతుళ్ళని బాగా చూసుకుంటాను అన్నది.

దాంతో ఆ తుంటరి భూతం, పెద్దగా నవ్వి, ఆ ఇంట్లోంచి బయటికి ఎగిరిపోయింది.

## యువరాజు - బంగారు చేప

వేంగీ రాజ్యాన్ని పాలించే వీరవర్మ భార్య చనిపోయింది. ఆయనకు ఒక్కగానొక్క కొడుకు ఉన్నాడు. అతడి పేరు వసంతుడు. తల్లిలేని వసంతుడిని గారాబంగా పెంచినా, క్రమశిక్షణకు లోపం లేకుండా చూసాడు వీరవర్మ.

కాలచక్రంలో ఏళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు వసంతుడికి పాతిక ఏళ్ళు వచ్చాయి. వసంతుడిని యువరాజుగా ప్రకటించాడు వీరవర్మ. అంటే వీరవర్మ మరణానంతరం వసంతుడు వేంగీ రాజ్యానికి రాజు అవుతాడన్న మాట.

ఒకరోజు, కొందరు కోయవాళ్ళు, వీరవర్మ దర్బారుకి వచ్చి, ఒక పులి అడవిలో విచ్చలవిడిగా తిరుగుతూ కంటికి కనిపించిన వాళ్ళని చంపి తినేస్తున్నదని, ఆ పులిని చంపి, తమను రక్షించమని మొరపెట్టుకున్నారు.

దాంతో యువరాజు వసంతుడు, తాను వెళ్ళి మానవ భక్షకి అయిన పులిని చంపివేస్తానని చెప్పాడు. వసంతుడి పరాక్రమంపైన మంచి విశ్వాసం ఉన్న వీరవర్మ, కొందరు సైనికులని తోడిచ్చి వసంతుడిని వేటకి పంపించాడు.

సరిగ్గా మిట్టమధ్యాహ్నానికి అడవి మధ్య భాగానికి చేరుకున్నారు వసంతుడు, అతని సైనికులు.

పులి సంచరిస్తున్న ప్రాంతంలో ఉన్న ఒక పెద్ద రావిచెట్టు మొదట్లో ఒక బలిసిన మేకను కట్టి, ఆ చెట్టుపై నక్కి, పులిరాక కోసమై వేచి ఉన్నారు యువరాజు, అతని సైనికులు.

అర్థరాత్రి అయింది. పులి తన ఆహారాన్ని వెతుక్కుంటూ వస్తున్నది. పులి గర్జించింది. పులి గర్జన విన్న మేక భయంతో మే, మే అని అరవసాగింది. మేక ఎక్కడుందో కనిపెట్టిన పులి చెట్టుక్రింద ఉన్న మేకపై దాడి చేసింది.

సరిగ్గా అదే సమయంలో యువరాజు గురి చూసి బాణం వదిలాడు. ఆ బాణం సరిగ్గా పులి గొంతులో బలంగా దిగింది. దాంతో పులి మేక విషయం వదిలేసి, అడవిలోకి అడ్డంగా పరిగెత్తింది. దెబ్బతిన్న పులిని బెబ్బులి అంటారు.

అలా దెబ్బతిని పారిపోయిన పులి మాటు వేసి, తనను గాయపరిచిన వాళ్ళని క్రూరంగా వేటాడుతుంది. ఆ సంగతి యువరాజుకి తెలుసు, కనుక యువరాజు వెంటనే చెట్టు దిగి, ఖడ్గం చేతిలో పట్టుకుని పులి కోసం అన్వేషణ ప్రారంభించాడు. అతన్ని అనుసరించారు సైనికులు.

అలా నడుస్తూ, నడుస్తూ అడవిలో వెళ్తున్న వసంతుడికి ఎక్కడో పులి అరుపు వినిపించి అటుగా పరుగెత్తాడు. కాస్త అజాగ్రత్తగా ఉన్న సైనికులు యువరాజు ఎటువెళ్ళాడో గమనించలేదు. పరిగెడుతున్న యువరాజుకి అలసట వచ్చింది, తన వెనుక వస్తున్న సైనికులకేసి చూసాడు.

కానీ అతని వెనకాల ఎవరూ లేరు. యువరాజుకి అర్థం అయింది. తను తప్పిపోయాడని. చేసేది ఏమీ లేక ముందుకు అడుగులు వేసిన యువరాజుకి, ఒక మంచినీటి సరస్సు కనిపించింది. ఆ సరస్సులో ముఖం కడుక్కుని, కాసిని నీళ్ళు దోసిట్లోకి తీసుకొని త్రాగాడు.

ఆ తర్వాత దగ్గరలో ఉన్న ఒక చెట్టు క్రింద విశ్రమించాడు. యధాలాపంగా తన చేతుల కేసి చూసుకున్న యువరాజుకి, తన కుడిచేతి చూపుడు వ్రేలుకి ఉన్న ఉంగరం కనిపించలేదు. నీరు త్రాగినప్పుడు ఉంగరం నీళ్ళలో జారిపోయిందని అర్థమైనది.

దాంతో వెంటనే ఆ సరస్సు దగ్గరికి వెళ్ళి నించుని, సరస్సులో పడ్డ తన ఉంగరాన్ని ఎలా బయటికి తీయాలి అన్న విషయం గురించి తీవ్రంగా ఆలోచించసాగాడు.


యువరాజుకి చాలా విచారం కలిగింది. ఆ సరస్సు వైపు చూస్తూ పెద్దగా ఇలా అన్నాడు. ఓ చేపలారా! మీరు ఈ సరస్సులో తిరుగుతారు. మీకు నా ఉంగరం గానీ కనిపిస్తే, నాకు తెచ్చి ఇవ్వండి, ఆ ఉంగరం మా తండ్రిగారు ఎంతో అభిమానంతో బహూకరించారు.

నా ఉంగరాన్ని తిరిగి ఇస్తే మీకు మంచి బహుమతి ఇస్తా. యువరాజు మాటలు విన్న ఒక చేప, బుడుంగుమని సరస్సు అడుగుకి వెళ్ళి, అక్కడున్న



ఉంగరాన్ని నోటితో పట్టుకుని, ఒడ్డుకి వచ్చింది. యువరాజుకి చేప నోట్లో తన ఉంగరం కన్పించింది.

వెంటనే యువరాజు సరస్సులో దిగి, నీళ్ళపై తేలుతున్న, ఆ చేప నోటిలోని ఉంగరాన్ని తీసుకుని తన వ్రేలుకి ధరించాడు. అప్పుడు ఉంగరాన్ని తెచ్చిన చేప మానవభాషలో ఇలా అన్నది.



“ఓయీ యువరాజా! నీ కోరిక ప్రకారం ఉంగరాన్ని తెచ్చి ఇచ్చాను. మరి నీ మాట నిలబెట్టుకో. నేను కోరే కోరిక తీర్చు”. చేపను అడిగాడు యువరాజు, ఏంకావాలో కోరుకో అని. అప్పుడా చేప, తనని తీసుకెళ్ళి అంతఃపురంలోని ఉద్యానవనంలో ఉన్న కొలనులో ఉంచి, తనతో స్నేహంగా ఉండమని యువరాజుని కోరింది.

సరే అని యువరాజు ఆ చేపను, తీసుకుని తన రాజ్యానికి బయలుదేరాడు. మధ్యమార్గంలో అతనికి సైనికులు కనిపించారు. వాళ్ళని కూడా వెంట బెట్టుకుని యువరాజు, తన రాజ్యానికి చేరాడు. ఆపై, ఆ చేపను తన తోటలో ఉన్న చిన్న కొలనులో వేసి, రోజూ దానికి మంచి ఆహారం ఇవ్వసాగాడు.

రోజూ సాయంకాలంలో యువరాజు సరస్సు దగ్గరికి వచ్చి, చేపతో సరదా కబుర్లు చెప్తూ ఉండేవాడు. ఆ చేప కూడా యువరాజుతో మాట్లాడుతూ ఉండేది. ఇలా నెలలు గడిచాయి. ఒక పౌర్ణమి రాత్రి, యువరాజు తన ఉద్యానవనంలో విహరిస్తూ చేప ఉన్న కొలను దగ్గరికి వచ్చాడు.

ఆ సమయంలో చేప కూడా కొలను ఒడ్డుకు వచ్చింది. యువరాజు చేపను చూసి పలకరించాడు. కానీ చేప మౌనంగా ఉన్నది. దాంతో

యువరాజు, చేపకి ఏదో సమస్య వచ్చి ఉంటుందని అందుకే అది మాట్లాడటం లేదనీ గ్రహించి, కొలనులో ఉన్న చేపను చేత్తో తీసి పట్టుకొని, ఆ చేపను ఇలా అడిగాడు –

ఓసీ చేపా! ఈ రోజు ఏమైంది నీకు, నాతో మాట్లాడటం లేదు అన్నాడు. అప్పుడు చేప విచారంగా ఇలా అన్నది. ఓ యువరాజా! ఈ రోజు నా పుట్టిన రోజు, నేను మా సరస్సును, మా వాళ్ళని వదిలేసి, నీ వెంట వచ్చాను, ఇక నా పుట్టిన రోజు విషయం ఎవరికి పట్టింది?

చేపమాటలు విన్న యువరాజు, ఓర్నీ, ఈ రోజు నీ పుట్టిన రోజన్న మాట. సరే నీకేం కావాలో కోరుకో అన్నాడు ఉషారుగా, అప్పుడా చేప, నాకేమీ వద్దు, నన్ను ఒక్కసారి ముద్దాడు అది చాలు నాకు అన్నది.

ఓస్! ఇంతేనా సరే ఇప్పుడే నిన్ను ముద్దాడుతాను సరేనా అని, ఆ చేపను దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు యువరాజు. సరిగ్గా అదే క్షణంలో ఒక అద్భుతం జరిగింది. యువరాజు చేతిలో ఉన్న చేప ఒక అందాల రాజకుమార్తెగా మారిపోయింది.

ఆ వింత చూసి యువరాజు, ఆశ్చర్యపడి, నోటమాటరాక, ఆ కొత్త రాజకుమారి కేసి ఆశ్చర్యంగా చూడసాగాడు. అప్పుడా రాజకుమార్తె, యువరాజుతో ఇలా అన్నది.

ఓయీ యువరాజా! నేను ప్లవంగా దేశ రాజకుమారిని. నేను ఒకసారి ఒక సరస్సు ఒడ్డున చెలికత్తెలతో ఆటలు ఆడుకుంటుండగా, ఆ సరస్సు పై భాగాన ఈదుతున్న ఒక చేప కన్పించింది.

నేను వెంటనే ఆ చేపను తీసుకుని, దానితో ఆడసాగాను. అలా, ఆడి, ఆడి, ఆ చేపను ఎటో విసిరేసాను. నేను విసిరిన ఆ చేప, అక్కడ ఒక పొదలో తపస్సు చేసుకుంటున్న ఒక యోగికి తగిలింది. దాంతో ఆయన తపస్సుకి విఘ్నం కలిగి నన్ను పిలిచి ఇలా శపించాడు.

"ఓసీ మూర్ఖురాలా! ఒళ్ళు తెలీకుండా ఒక చేపని నాపై విసిరి, నా తపస్సును భగ్నం చేసావు కనుక, నీవు వెంటనే, చేపగా మారి ఇదే సరస్సులో చిరకాలం జీవించు". దాంతో నేను ఆ యోగి కాళ్ళపై పడి శాపాన్ని ఉపసంహరించమని కోరాను.



అప్పుడా యోగి ఎవరైనా రాజకుమారుడు నిన్ను ముద్దాడితే, నీకు శాప విమోచనం కలిగి మళ్ళీ మనిషిగా మారుతావు అన్నాడు. ఆనాటి నుండి నేను ఆ సరస్సులో చేపగా ఉన్నాను. ఇన్నాళ్ళకి నీ దయ వల్ల మామూలు రూపం పొందగలిగాను.

ఆ తర్వాత యువరాజు, ఆ రాజకుమార్తెను వివాహం చేసుకున్నాడు. వేంగీ రాజు వీరవర్మ మరణానంతరం వసంతుడు రాజు అయ్యాడు. ఆ చేప రాజకుమారి, మహారాణి అయింది. వాళ్ళు చాలా కాలం సుఖంగా జీవించారు.

## వదలని శాపం

పూర్వం గంగవరం జమీందారు భూపతికి, గోపీ అనే కుమారుడు ఉండేవాడు. ఆ అబ్బాయికి 18 ఏళ్ళు నిండాయి. దాంతో జమీందారు, కొడుక్కి పెళ్ళి చేయాలని సంకల్పించాడు.

భూపతికి ముగ్గురు తమ్ముళ్ళున్నారు. వాళ్ళకీ ఇంకా పెళ్ళి కాలేదు. కారణం వాళ్ళు భూపతికి తమ్ముళ్ళే అయినా, వాళ్ళు ముగ్గురూ పాతికేళ్ళ లోపువాళ్ళే.

ఒకసారి భూపతి, ఆయన సోదరులు గుర్రపు బండిలో ఏదో పనిమీద దగ్గరలో ఉన్న పట్నం వెళ్ళివస్తూ, ఆ వూరి చివర ఉన్న చెరువు కట్ట మీదున్న రావిచెట్టు క్రింద కూర్చుని ముచ్చట్లాడుకుంటున్న ఒక యువజంటను చూసారు.

వాళ్ళలో యువకుడు ఇంకెవరో కాదు, జమిందారు భూపతి కుమారుడు గోపీనే. భూపతి అతని తమ్ముళ్ళు, గోపీని ఎవరో అమ్మాయితో చూసినా, వాళ్ళు పైకి ఏమీ అనకుండా, గోపీ వెంట తిరుగుతున్న అమ్మాయి గురించి రహస్యంగా వాకబు చేయించారు.

ఆ అమ్మాయి ఒక పేదరైతు కూతురు అని తెలిసింది. తర్వాత భూపతి, గోపీని పిలిచి ఆ అమ్మాయిని మర్చిపోమని, త్వరలో ఇంకో జమిందారు కూతుర్ని పెళ్ళాడాలని చెప్పాడు. అయితే గోపీ రహస్యంగా ఆమెను పెళ్లాడాడు. త్వరలోనే ఆమె గర్భవతి అయింది.

ఈ వ్యవహారాన్ని గోపీ ఎంత గోప్యంగా ఉంచాలనుకున్నా, బయట పడింది. దాంతో భూపతి, కొడుకు పెళ్ళాడిన అమ్మాయిని బ్రతికి ఉండగానే, తన భవనం పరిసరాల్లో ఉన్న మామిడి తోటలో పాతి పెట్టించాడు.



ఇది జరిగిన వారం రోజుల్లో భూపతి భార్య వంట చేస్తుండగా, చీరెకొంగు అంటుకుని మరణించింది. ఆ తర్వాత ఒక పౌర్ణమి రాత్రి సజీవ సమాధి చేయబడిన అమ్మాయి దయ్యమై, జమిందారు భవంతి పరిసరాల్లో కన్పించింది. ఆ పౌర్ణమి రాత్రే భూపతి రక్తం కక్కుకుని చనిపోయాడు.

దాంతో భూపతి తమ్ముళ్ళకి అర్థమయింది తాము బలవంతంగా చంపిన అమ్మాయి, ప్రేతాత్మగా మారి భూపతి కుటుంబంపై పగపట్టింది అని. గోపీకి ఈ విషయాలు తెలిసి పిచ్చి ఎక్కింది. అతని ఆరోగ్యం పూర్తిగా పాడయిపోయింది. ఇక భూపతి తమ్ముళ్ళు, దయ్యం బాధ తట్టుకోలేక, ఒక మంత్రవాదిని పిలిపించారు.

ఆ మాంత్రికుడు హోమాలు చేసి, దయ్యాన్ని, ఒక రాగి చెంబులో బంధించి, భూమిలో పాతిపెట్టాడు. అయితే మాంత్రికుడు ఒక హెచ్చరిక చేసాడు భూపతి తమ్ముళ్ళకి, అదేమంటే ఆ ఇంట్లోని మగపిల్లలు కనుక పెళ్ళిళ్ళు చేసుకుంటే, వాళ్ళ భార్యలు ఆత్మహత్యలు చేసుకొని చనిపోతారు.

దాంతో భూపతి తమ్ముళ్ళు ఏం చెయ్యాలా అని ఆలోచించసాగారు. సరిగ్గా అలాంటప్పుడే, భూపతి పెద్ద తమ్ముడికి వివాహం అయింది. అతని భార్య కాపురానికి వచ్చింది. కాపురానికి వచ్చిన మూడవ నెలలో ఆమె ఆత్మహత్య చేసుకొని మరణించింది.



ఇక భూపతి కుటుంబంలో పెళ్ళి అనే మాట వినబడదని అందరూ భావిస్తున్న సమయంలో, ఆ వూరికి ఒక జ్యోతిష్యుడు వచ్చాడు. ఆ ఊర్లోని ప్రజలందరూ, ఆ జ్యోతిష్యుడు చెప్పినవి యథాతథంగా జరుగుతున్నాయి అనుకొంటుండగా విన్న భూపతి తమ్ముళ్ళు, ఆ జ్యోతిష్యుడిని పిలిపించారు.

ఆ జ్యోతిష్యుడు, ఏవో లెక్కలు వేసి, ఆ ఇంటికి పిశాచ పీడ ఉన్నదని, దానికి పరిహారం జరిగితే కానీ, ఆ ఇంట్లో కోడళ్ళు క్షేమంగా ఉండరని చెప్పాడు. సరే, ఏం చెయ్యాలో అది చెయ్యండి, మాకు ఆ దయ్యం పీడ వదిలితే చాలు అన్నారు భూపతి తమ్ముళ్ళు.

జ్యోతిష్యుడు కాశీపూజలు జరిపి, ఆ అమ్మాయిని ఎక్కడ పాతిపెట్టారో, అక్కడ ఒక ఆంజనేయస్వామి ఆలయం నిర్మింపచేసాడు. ఆ తర్వాత ప్రతిరోజు, ఆ గుడి దగ్గర అన్నదానాలు జరిగేలా చేసాడు. ఎందరో పేదలు ఆకలి తీర్చుకునే ఆ ప్రాంతంలో ఆనాటి నుండి దయ్యం పీడా వదిలిపోయింది.

ఇక భూపతి ఇంట్లో పెళ్ళిళ్ళు జరగటానికి ఏ పీడా అడ్డు లేకుండా పోయింది. అలా భూపతి దురహంకారంతో చేసిన దారుణం వలన భూపతి దుర్మరణం చెందాడు. అతని కుటుంబం నానా బాధలు పడాల్సివచ్చింది. వీడని శాపంగా మారిన దయ్యం పీడా వదిలింది.

## అతిథి

సముద్ర తీరం వెంట అనేక గ్రామాలున్నాయి. అలాంటి గ్రామాలలో ఒక గ్రామం పేరు అగ్రహారం. ఆ ఊళ్ళో పేరిశాస్త్రి అనే పురోహితుడు ఉండేవాడు.

ఆయనకి కాస్త పొలం ఉన్నది. దాన్ని సాగుచేసుకుంటూ ఆ ఊర్లోని గృహస్థుల ఇళ్ళలో పూజలు, పెళ్ళిళ్ళు చేయిస్తూ, హాయిగా కాలక్షేపం చేస్తూ ఉండేవాడు.

ఆయనకి భార్య, ఇద్దరు ఆడపిల్లలూ ఉన్నారు. కొంతకాలానికి పెద్దకూతురికి పెళ్ళీడు వచ్చింది. దాంతో పేరిశాస్త్రి, మగపెళ్ళి వాళ్ళని

వచ్చి, అమ్మాయిని చూసి వెళ్ళమని ఉత్తరం వ్రాసాడు. ఒక మంచి రోజు చూసుకొని, మగ పెళ్ళి వాళ్ళు పేరిశాస్త్రి ఇంటికి పెళ్లి చూపులకి వచ్చారు.

ఆయన పెద్దకూతురు వాళ్ళకి బాగా నచ్చింది. సరే, దగ్గరలోనే ఒక మంచి ముహూర్తం నిర్ణయించుకొని ఉత్తరం వ్రాస్తామని చెప్పి మగపెళ్ళి వారు వెళ్ళిపోయారు. పెద్దకూతురికి మంచి ఆస్తిపరుడు భర్తగా లభించటంతో పేరిశాస్త్రి దంపతులు ఆనందంలో తేలిఆడారు. అయితే అంతా బాగానే ఉంది.

కానీ పెళ్ళివాళ్ళు ఓ పదివేలు కట్నం కావాలని అడిగారు. పదివేలు అంటే మాటలా... దాంతో పెళ్ళి ఎలా జరుగుతుందో అన్న దిగులు పేరిశాస్త్రి దంపతులకి కల్గింది. ఆ కట్నం డబ్బు ఎలా సంపాదించాలి, అమ్మాయి పెళ్ళి ఎలా చేయాలి అన్న దిగులుతో పేరిశాస్త్రి ఆందోళన పడసాగాడు.

ఒకరోజు పేరిశాస్త్రి భార్య, భర్తతో, ఏమండీ పట్నంలో మీ చిన్ననాటి స్నేహితుడు ఒకడున్నాడని, అతడు పెద్ద వ్యాపారాలు చేసి బాగా గడించాడని ఒకసారి చెప్పారు గుర్తుందా? అని అడిగింది. భార్య మాటలు విన్న, పేరి శాస్త్రికి గుర్తుకు వచ్చింది పట్నంలో తన చిన్ననాటి స్నేహితుడు సుబ్బయ్య సంగతి. నిజమే.... అతని వద్ద డబ్బు తీసుకొని వచ్చే ఏడు మన చేలో వచ్చే పంటతో, ఆ అప్పు తీర్చేయచ్చు అన్నాడు భార్యతో.

మర్నాడు ఉదయమే, స్నేహితుడి దగ్గరికి బయలుదేరాడు పేరిశాస్త్రి. అతని భార్య పెరుగన్నం మూటకట్టి ప్రయాణంలో తినటానికి ఇచ్చింది. సరే, ఇక బయలుదేరుతా అని పట్నం వైపు నడక ప్రారంభించాడు.

పేరిశాస్త్రి ఉన్న గ్రామం తర్వాత వరుసగా ఉన్న ఆరుగ్రామాలు దాటిన తర్వాత, అతని స్నేహితుడుండే పట్నం వస్తుంది. తొందరగా పట్నం చేరుకుంటే మరలా రాత్రికల్లా ఇల్లు చేరచ్చు అని వేగంగా నడవసాగాడు పేరిశాస్త్రి.

అలా నడిచి, నడిచి, అలసటగా అనిపించి, ఒక చింత చెట్టు క్రింద కాసేపు కూర్చుని, వెంట తీసుకువచ్చిన పెరుగన్నం తిని, కాసిని మంచి నీళ్ళు త్రాగాడు. కాస్త హాయిగా అనిపించింది. మళ్ళీ నడక ప్రారంభించాడు. మధ్యాహ్నం మూడు గంటలకి పట్నం చేరి స్నేహితుడు ఇంటికి వెళ్ళాడు.



పేరిశాస్త్రి స్నేహితుడు సుబ్బయ్య చాలా ధనికుడే కాక మంచిమనిషి. పేరిశాస్త్రి తాను వచ్చిన పని, సుబ్బయ్యకు చెప్పాడు. పేరిశాస్త్రి చెప్పింది విని ఓస్! ఇంతేనా దీని కోసం నువ్వు రావాలా, కాకితో కబురు చేయిస్తే, డబ్బు నీ ఇంటికే పనివాడి చేత పంపేవాడిని కదా అన్నాడు సుబ్బయ్య.

అప్పుడు పేరిశాస్త్రి, ఫర్వాలేదులే సుబ్బయ్యా, మళ్ళీ నీకెందుకు శ్రమ అని నేనే వచ్చేసా అన్నాడు. సరే నీ ఇష్టం అని, స్నేహితుడికి అతిథి మార్యదలు చేసి, ఓ పదివేలు రొక్కం, కాసిని అరటిపళ్ళు పేరిశాస్త్రి చేతిలో పెట్టాడు సుబ్బయ్య.

అప్పుడు పేరిశాస్త్రి మిత్రుడి ఔదార్యానికి చాలా సంతోషించి, ఇక నేను బయలుదేరుతా అంటూ లేచి నిలబడ్డాడు. శుభం, వెళ్ళిరా పెళ్ళికి మాక్కూడా శుభలేఖ పంపించు, మీ అమ్మాయి పెళ్ళికి వస్తాం అన్నాడు సుబ్బయ్య, ఆప్యాయంగా పేరిశాస్త్రి భుజం తడుతూ. మిత్రుడి దగ్గర వీడ్కోలు తీసుకొని తన గ్రామానికి బయలుదేరాడు పేరిశాస్త్రి.

చీకటి పడేలోగా తన గ్రామానికి చేరాలని, వేగంగా నడుస్తున్నాడు పేరిశాస్త్రి. ఎంత వేగంగా నడిచినా, చీకటి పడిపోయింది. తన గ్రామం చేరాలంటే ఇంకా రెండు గ్రామాలు దాటాలి. ఇంకా నడుస్తున్నాడు.

అప్పటికి రాత్రి తొమ్మిది గంటలు అయింది. చీకటి, కీచురాళ్ళ అరుపులు, అప్పుడప్పుడు వినిపిస్తున్న కప్పల బెక, బెకలు. పేరిశాస్త్రి డబ్బులున్న సంచీని జాగ్రత్తగా పట్టుకొని వేగంగా నడుస్తున్నాడు. ఆకాశం కారుమబ్బులతో నిండిపోయింది. ఉండుండి మెరుపులు, ఈదురు గాలులు ప్రారంభం అయ్యాయి. ఆ ప్రాంతం మొత్తం సముద్రానికి చాలా దగ్గరగా ఉండటం వల్ల, అక్కడ వర్షాలు భారీగా కురుస్తాయి మరి.

పేరిశాస్త్రి నడక వేగం తగ్గింది. బలంగా వీస్తున్న గాలి వల్ల అతడికి నడకసాగటం లేదు. ఇంతలో కుండపోతగా వాన మొదలయింది. ఏం చెయ్యాలో పేరిశాస్త్రికి అర్థం కాలేదు.

వర్షంలో తడిసిపోతున్న పేరిశాస్త్రికి దూరంగా ఏదో వెలుగు కనిపించింది. తాను వెళ్తున్న మార్గానికి, ప్రక్కనే ఉన్న చిన్న కాలిబాట ద్వారా, ఆ వెలుగు వస్తున్న వైపు, బురదలో జుర్రు, బుర్రున జారుతూ నడిచాడు.

కాస్సేపు నడిచాక అతనికి కన్పించారు హడావుడిగా అటు, ఇటు తిరుగుతున్న జనాలు. అది ఒక పెళ్ళి జరుగుతున్న ఇల్లు. దీపాలతో ఇల్లంతా పట్టపగలులా కనిపిస్తుంది. తడిబట్టలతో ఇంటి పంచలో నిలబడ్డ పేరిశాస్త్రిని చూసి, ఒక వృద్ధుడు ఇంట్లోకి రమ్మని పిలిచాడు.

ఇంట్లోకి మొహమాటంగా వెళ్ళాడు పేరిశాస్త్రి, వెంటనే ఆ వృద్ధుడు, పేరిశాస్త్రికి తుండుగుడ్డ ఇచ్చి తల, ఒళ్ళు తుడుచుకోమని చెప్పాడు. ఇంతలో ఒక చిన్న అమ్మాయి ఒక వెండి గ్లాసులో పొగలు కక్కుతున్న వేడి పాలు తెచ్చి, పేరిశాస్త్రికి ఇచ్చి, వెళ్ళిపోయింది.

అసలే చలిగా ఉందేమో పేరిశాస్త్రి ఆ వేడిపాలను చిటికెలో త్రాగేసాడు. కాస్త ప్రాణం కుదుట పడింది. ఇంతలో ఓ వృద్ధురాలు వచ్చి, పేరిశాస్త్రిని భోజనానికి రమ్మని ఆహ్వానించింది. మంచి ఆకలి మీదున్నాడేమో, ఏం మాట్లాడకుండా వెళ్ళి పంక్తి భోజనం చేసాడు.



'ఆహా! ఇంత రుచికరమైన ఆహారం నా జీవితంలో ఎన్నడూ తినలేదు' అని ఆశ్చర్యపడ్డాడు. ఇంతలో ఒక యువతి పేరిశాస్త్రికి ఆకులు, వక్కలు ఇచ్చి తాంబూలం వేసుకోమని చెప్పి వెళ్ళిపోయింది. హాయిగా తాంబూలం వేసుకున్నాడు పేరిశాస్త్రి. ఇంకా వర్షం ఆగలేదు. సమయం అర్ధరాత్రి అయివుంటుంది అనుకున్నాడు పేరిశాస్త్రి.

ఇంతలో ఒక యువతి వచ్చి, 'అయ్యా! మీరు ప్రక్కగదిలో నిద్రపోండి, మడత మంచం వేసాను' అన్నది. ఆహా! హాయిగా నిద్రపోయే భాగ్యం కల్గింది అనుకుని, ప్రక్క గదిలోకి వెళ్ళి, మడత మంచంపై పడుకుని, ఒక దుప్పటి తలపైకి కప్పుకుని నిద్రకు ఉపక్రమించాడు.



సూర్యకిరణాలు ముఖాన్ని చుర్రుమనిపించేసరికి గభాల్న మెలుకువ వచ్చి, కళ్ళు తెరిచి చూసాడు పేరిశాస్త్రి, నిన్న రాత్రి కురిసిన భారీవర్షానికి గుర్తుగా ఆ ప్రాంతమంతా నీళ్ళు నిలిచి ఉన్నాయి. ఆశ్చర్యం! నిన్న రాత్రి మడత మంచంపై పడుకున్న పేరిశాస్త్రి ఇప్పుడు ఒక సమాధిపై పడుకుని ఉన్నాడు.

అతని వంటిపై దుప్పటి బదులు, ఒక శిధిలం అయిన కంబళి ఉన్నది. ఒక్క క్షణం అర్థంకాలేదు పేరిశాస్త్రికి తాను ఎక్కడ ఉన్నాడో? ఆ తర్వాత ఆ సమాధిపైనుండి లేచి చూసాడు. అతని చుట్టూ, అనేక సమాధులు, దగ్గర దగ్గరగా ఉన్నాయి.

అరే ఇది స్మశానంలా ఉన్నదే అనుకున్నాడు. నిన్న రాత్రి వేసుకున్న తాంబూలం కోసం ఇచ్చిన ఆకులు, వక్కల కోసం వెదికాడు. జిల్లేడు ఆకులు, మేక పెంటికలు కన్పించాయి. పేరిశాస్త్రిలో భయం పెరిగిపోయింది. మిత్రుడిచ్చిన డబ్బు సరిగా ఉందో, లేదో అని చూసుకున్నాడు.

ఆ డబ్బు భద్రంగా ఉన్నది. ఆ ప్రాంతం నుండి, తన గ్రామానికి వెళ్ళే మార్గం కోసం అటు, ఇటు పిచ్చిగా నడవసాగాడు. ఇంతలో ఒక ఎడ్లబండి అటువైపు వస్తూ కనిపించింది. పేరిశాస్త్రికి ప్రాణం లేచి వచ్చింది. కాస్సేపటికి ఆ బండి పేరిశాస్త్రి దగ్గరికి చేరింది.

ఆ బండిలో ఒక వృద్ధుడు కూర్చుని ఉన్నాడు. పేరిశాస్త్రిని చూసి, బండి తోలేవాడిని, బండి ఆపమని చప్పాడు. పేరిశాస్త్రి బండి దగ్గరికి వచ్చి, తన గ్రామంలో దించమని అడిగాడు. సరేనన్న ఆ వృద్ధుడు పేరిశాస్త్రి బండిలోకి ఎక్కగానే, బండివాడిని, బయలుదేరమన్నాడు.

బండి నడుస్తున్నది. ఆ వృద్ధుడు, పేరిశాస్త్రికేసి చూసి, మీరు పేరిశాస్త్రిగారు కదూ అన్నాడు ఆసక్తిగా. ఔను! నేను పేరిశాస్త్రినే – దగ్గరలో ఉన్న గ్రామం మాది అన్నాడు. అయ్యా! మీరు ఎక్కడి నుండి వస్తున్నారు ఇంత ఎండలో అడిగాడు వృద్ధుడు.

అప్పుడు పేరిశాస్త్రి తాను పట్నం వెళ్ళిన విషయం, రాత్రి తిరిగి వస్తుండగా ఒక పెళ్ళివారింటికి వెళ్ళిన విషయం చెప్పి, ఆ పెళ్లి వారింట్లో పడుకున్న నేను తెల్లారేసరికి స్మశానంలో ఎలా ఉన్నానో నాకేమాత్రం అర్థం కావటంలేదు అన్నాడు.

పేరిశాస్త్రి మాటలు విన్న ఆ వృద్ధుడు చిన్నగా నవ్వి, అయ్యా శాస్త్రి గారు.... మీరు రాత్రి భోజనం చేసింది ఒక దయ్యాల కొంపలో అని తెలిస్తే తట్టుకునే గుండె ధైర్యం ఉంటే, అసలు విషయం నేను చెపుతా అన్నాడు.

దాంతో పేరిశాస్త్రి హడలిపోయి, ఏమండీ! ఏమిటి మీరు అంటున్నది.. అది దయ్యాల కొంపా అన్నాడు ఆశ్చర్యంగా మరియు ఒకింత భయంగా. అప్పుడా వృద్ధుడు, ఔను అది ఖచ్చితంగా దయ్యాల కొంపే, నాల్గు సంవత్సరాల క్రితం నేను కూడా, సరిగ్గా మీలాగే, ఒక వర్షపురాత్రి దారి తెలీక ఆ ఇంట్లోకి వెళ్ళా. సరిగ్గా మీలాగే అక్కడ పెళ్ళి భోజనం చేసి రాత్రికి అక్కడే నిద్రపోయా, తెల్లారి చూస్తే, ఆ ఇల్లున్న చోట ఒక స్మశానం ఉన్నది. నేను ఒక సమాధి మీదపడి ఉన్నాను అన్నాడు.

దాంతో పేరిశాస్త్రికి ఆసక్తి కలిగి, వృద్ధునితో అయ్యా! ఆ పెళ్ళి వాళ్ళిల్లు దయ్యాల కొంపగా ఎలా మారిందీ... అన్న విషయం మీకు తెలిస్తే, దయచేసి చెప్పండి అన్నాడు.

ఆ వృద్ధుడు చెప్పటం మొదలుపెట్టాడు. ఒక డెబ్భై సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో పెద్ద ఉప్పెన వచ్చింది. ఈ వూరిని సముద్రం ముంచేసింది. సరిగ్గా సముద్రం, ఆ వూరి పైకి వచ్చేసరికి, ఆ గ్రామంలోని పెద్దకామందుగారి కూతురి పెళ్ళి జరుగుతున్నది.

ఆ రోజు ఉదయం నుండే తుఫాను మొదలయింది. లంకంత ఇల్లు తుఫాన్ వస్తే మాత్రం ఏం అని, అలాగే పెళ్ళి పనులు కానిస్తున్నారు. తెల్లవారుఝామున పెళ్ళి, ఇంతలో ప్రమాదం విరుచుకుపడింది. సరిగ్గా అర్ధరాత్రికి సముద్రంలో భయంకరమైన ఉప్పెన వచ్చి, ఈ వూరిని ముంచేసింది.

దాంతో ఈ గ్రామంలో ఒక పురుగు కూడా మిగలలేదు. ఆ తర్వాత వర్షపు రాత్రుళ్ళలో, ఆనాడు తుఫాన్‌కి బలి అయిన పెళ్ళి ఇంటివాళ్ళు, దయ్యాలుగా మారి పెళ్ళి జరపటానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఇదిగో మనలాంటి అమాయకులు దారీ, తెన్నులు తెలియకుండా, వాళ్ళ ఇంటికి చేరితే, ఇలాగే పెళ్ళి భోజనం పెట్టి మర్యాదలు చేస్తారు.



తెల్లారితే స్మశానం ఇదీ.. అసలు కథ. వృద్ధుడు చెప్పిన కథ విన్న పేరిశాస్త్రికి చాలా బాధ కలిగింది. అలా తుఫాన్‌కి, వరదలకి, ఉప్పెనలకి బలి అయి తీరని కోర్కెలతో, దయ్యాలుగా మారిన వాళ్ళందరి ఆత్మలకు శాంతి కలగాలని, దేవుడ్ని ప్రార్థించాడు పేరిశాస్త్రి.

ఇలా వాళ్ళు మాటల్లో ఉండగానే, పేరిశాస్త్రి ఉండే గ్రామం వచ్చింది. బండి ఆపమని వృద్ధుడికి చెప్పాడు పేరిశాస్త్రి. బండి ఆగింది. పేరిశాస్త్రి బండి దిగి, ఆ వృద్ధుడితో "అయ్యా! మీరు చేసిన సాయం ఎన్నడూ మర్చిపోలేను. మళ్ళీ మీరు ఇటువైపు వచ్చేటప్పుడు, మా ఇంటికి రండి, మా అమ్మాయికి త్వరలో పెళ్ళి జరగబోతున్నది" అన్నాడు.

అప్పుడా వృద్ధుడు నేను ఒక వారంలోగా తిరిగి వస్తాను. వచ్చేటప్పుడు తప్పకుండా మీ ఇంటికి వచ్చి, మీ అమ్మాయిని ఆశీర్వదిస్తాను సరేనా అని, పేరిశాస్త్రి దగ్గర వీడ్కోలు తీసుకుని బండిని పోనిమ్మని, బండి వాడికి చెప్పాడు.

బండి కనుచూపు మేరలు దాటేదాకా అక్కడే నించున్న పేరిశ్రాస్తి, మెల్లిగా ఇంటివైపు అడుగులు వేస్తున్నాడు. అతనికి రాత్రి దయ్యాలు చేసిన మర్యాదలే కళ్ళ ముందు కనిపిస్తున్నాయి.

## మంత్రవాది కూతురు

పూర్వం కాంభోజ రాజ్యాన్ని రత్నవర్మ అనే రాజు ప్రజానురంజకముగా పాలిస్తున్నాడు. ఆయన కాళికాదేవిని గురించి మూడు సంవత్సరాలు వింధ్య పర్వతాలపై భీకరమైన తపస్సు చేసి కాళీమాత సాక్షాత్కారం పొందాడు. ఆమె వరం వల్ల రత్నవర్మ రాజ్యంలో దుష్టశక్తులు, క్షుద్రపిశాచాల బాధ లేకుండా పోయింది.

రత్నవర్మకి ఇద్దరు కుమారులు, ఇద్దరు కమార్తెలు ఉన్నారు. కుమారులిద్దరూ మహాపరాక్రమవంతులు. కుమార్తెలు ఇద్దరూ, అసమాన సౌందర్య రాసులు.

అయితే రత్నవర్మ చిన్న కుమారుడు క్రమంగా తండ్రిలాగా కాళీమాతను ఉపాశించటం ప్రారంభించాడు.

రాత్రింబగళ్ళు అమ్మవారి ధ్యానంలో నిమగ్నం అయిన రాజుగారి చిన్న కుమారుడు, ఒకనాటి రాత్రి అందరూ నిద్రపోతుండగా, రాజ్యాన్ని వదిలి అరణ్యంలోకి వెళ్ళిపోయాడు. అక్కడ ఒక కుటీరం నిర్మించుకుని కాళీమాత గురించి తపస్సు చేయటం మొదలుపెట్టాడు.

చిన్నకుమారుణ్ణి సేనాధిపతిగాను, పెద్ద కుమారుడిని మహారాజు గానూ, చెయ్యాలని కలలు కన్న రత్నవర్మ, చిన్న కుమారుడు అడవికి వెళ్ళిపోవటంతో చాలా బాధపడ్డాడు.

ఇంతలో ఆయన ఇద్దరు కుమార్తెలకీ మంచి పెళ్ళి సంబంధాలు వచ్చాయి. పెద్ద కుమార్తెను ఒక బ్రాహ్మణ పండితుడికి ఇచ్చి వివాహం చేసాడు. చిన్న కుమార్తెను వేంగీ రాజుకి ఇచ్చి ఘనంగా వివాహం జరిపించాడు.

రత్నవర్మకి వయస్సు పెరిగిపోవటంతో రాజ్యపాలన కష్టం అయింది. దాంతో ఆయన పెద్దకుమారుడు ఐన ప్రతాప్‌కి పట్టాభిషేకం చేసాడు. ఆ తర్వాత రత్నవర్మ రాజ్యాన్ని పెద్దకుమారుడు ప్రతాప్‌కి అప్పగించి, తపస్సు చేసుకుందామని హిమాలయాలకు వెళ్ళిపోయాడు.

ఇక రాజుగా పట్టాభిషిక్తుడైన ప్రతాప్, ప్రజలకి ఏ లోటూ రాకుండా పాలించసాగాడు. ఆయన తన రాజ్యంలో ఎన్నో పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టాడు.

దేశంలో అనేక చోట్ల పేదప్రజలకి ఉచితంగా ఇళ్ళు కట్టించాడు. నీటి కరువు ఉన్న ప్రాంతాలకు, మహానదుల నుండి కాలువలు త్రవ్వించి, మంచినీరు అందేలా చేసాడు.

ఇలా ప్రజల శ్రేయస్సుకై ఎన్నో సంస్కరణలు చేసిన ప్రతాప్‌ని ప్రజలందరూ ఎంతో అభిమానించే వారు. తండ్రిని మించిన పరిపాలనా దక్షుడిగా, ప్రతాప్ పేరు పొందాడు.

ఇది ఇలా ఉండగా ఒకసారి ఆ రాజ్యానికి ఉత్తరం వైపు ఉన్న అడవులలో నాలుగు తలలూ, రెండు కాళ్ళూ ఉన్న ఒక నరవానరం కనబడింది. ఆ తర్వాత కొన్ని రోజులకి అది ప్రతాప్ రాజ్యంలో ప్రవేశించి, అందమయిన యువకుల్ని చంపి తినసాగింది.



దాంతో విచిత్రాకారం గల నరవానరం పేరు వింటే, ఆ రాజ్యప్రజలు భయంతో గడ, గడ లాడేవారు. ఇక నరవానరం చేసే దుర్మార్గాన్ని సహించలేని ప్రజలు ప్రతాప్ దర్బార్‌కి వెళ్ళి, ఆయన్ని, ఆ దుర్మార్గ వానరం బారి నుండి కాపాడాలని ప్రార్థించారు.

దాంతో ప్రతాప్ ఒక ఖడ్గాన్ని తీసుకొని తన పంచకళ్యాణీ అశ్వంపై బయలుదేరాడు నరమాంసభక్షకుడిగా మారిన ఆ నాల్గుతలల నరవానరాన్ని సంహరించటానికి. అడవికి చేరి ఒక గుడారం నిర్మించారు ప్రతాప్ వెంట వచ్చిన సైనికులు.

అప్పుడు మధ్యాహ్నం కావొస్తున్నది. ఇద్దరు వంటవాళ్ళు సైనికులకి, రాజుగారికి కావాల్సిన భోజనాలు తయారుచేస్తున్నారు. రాజుగారికి ఒక ప్రత్యేక గుడారం వేయబడింది. అందరూ భోజనాలు చేసారు. సరిగ్గా రాత్రి అయ్యేసరికి ఏవో జంతువుల అరుపులు కర్ణకఠోరంగా వినబడసాగాయి.

వెంటనే ప్రతాప్ ధనస్సు, బాణాలు తీసుకుని గుడారం బయటికి వచ్చాడు. సరిగ్గా అదే సమయానికి, ఇంతకాలం జనాల్ని పీడిస్తున్న నాల్గు తలల నరవానరం, సైనికులున్న గుడారంపై దాడి చేసింది. విశ్రాంతిగా కూర్చున్న సైనికులపై దాడి చేసింది.

దాని ఆకారాన్ని చూసిన సైనికులు భయాందోళనలతో కేకలు వేసారు. సైనికుల అరుపుల విన్న ప్రతాప్, సైనికుల గుడారం వైపు పరిగెత్తాడు. అవి వెన్నెల రాత్రుళ్ళు కావటం వల్ల, ఆ ప్రాంతం అంతా స్పష్టంగా కనిపిస్తున్నది.

ఇద్దరు సైనికుల రెండు చేతుల్ని పట్టుకుని వారిని లాక్కుంటూ పారిపోతున్న నరవానరాన్ని గమనించిన ప్రతాప్, ధనస్సు సంధించి, ఒక బాణాన్ని ఆ నరవానరం కేసి ప్రయోగించాడు. దాంతో ఆ విచిత్ర నరవానరం, తన చేతిలో ఉన్న సైనికుల్ని నేలపైకి విసిరేసి ప్రతాప్ వైపు ఉగ్రంగా అరుస్తూ రాసాగింది.

దాన్ని గమనించిన ప్రతాప్, మంత్రం పఠించి, ఒక మహాస్త్రాన్ని, ధనస్సుకు సంధించి, ఆ నరవానరంపై ప్రయోగించాడు. అంతే ఆ బాణం

నరవానరం గుండెల్లో బలంగా దిగింది. ఆపై ఆ మహాస్త్ర ప్రభావం వలన ఆ నరవానరం క్షణాల్లో బూడిదగా మారిపోయింది.

ఆపై ప్రతాప్, సైనికులు తమ, తమ గుడారాలలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకున్నారు. మర్నాడు ఉదయం తెల్లవారిన తర్వాత, అందరూ నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని, స్నానాదులు కానిచ్చి, ఫలహారాలు సేవించారు. ఈలోగా నరవానరాన్ని ప్రతాప్ మహారాజు సంహరించారన్న వార్త ప్రజలందరికీ చేరింది.

ప్రజలంతా ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఇక ప్రతాప్ కాసేపు అడవిలోని విశేషాలను చూద్దామని, ఒంటరిగా ఒక్క ఖడ్గాన్ని మాత్రమే ధరించి, అడవిలోకి వెళ్ళాడు. అక్కడ, అతనికి ఒక పురాతనమైన ఊడల మర్రి కనిపించింది.

దాంతో ఆ చెట్టుని దగ్గరగా చూద్దామని, ప్రతాప్, ఆ చెట్టు క్రిందికి వెళ్ళాడు. సరిగ్గా అప్పుడే ఆ చెట్టుపై నుండి ఒక బ్రహ్మరాక్షసుడు క్రిందికి దూకి ప్రతాప్‌తో, ఓరీ రాజా! నీ తండ్రి కాళీమాత తపస్సు చేసి ఆమె ఇచ్చిన వరప్రభావం వల్ల మా రాక్షసుల్ని నీ రాజ్యంలోకి రాకుండా చేసాడు. ఇప్పుడు నీవే, స్వయంగా మా నివాసానికి వచ్చావు. నేను నిన్ను ఆవహించి, నీతో బాటుగా నీ రాజ్యంలోకి ప్రవేశిస్తా. నీ రాజ్యంలోని ప్రజల్ని మ్రింగుతా, నీ రాజ్యంలో భగవంతుడికి పూజలు, పునస్కారాలు లేకుండా చేస్తా. మొత్తంగా నీ రాజ్యాన్ని సర్వనాశనం చేస్తా అన్నాడు.

ప్రతాప్ ఏదో చెప్పే లోపులే, ఆ బ్రహ్మరాక్షసుడు పొగగా మారి, ప్రతాప్ దేహంలో చేరిపోయాడు. ఇప్పుడు ప్రతాప్ శరీరంలో బ్రహ్మ రాక్షసుడు ఉన్నాడు. కానీ ప్రతాప్ బాహ్య ఆకారం కానీ, మాటతీరు కానీ ఏ మాత్రం మారలేదు. ప్రతాప్ నడుచుకుంటూ తన రాజ్యం వైపు వెళ్ళసాగాడు.

రాజభవనానికి చేరిన ప్రతాప్ ఆపై వింత, వింత చర్యలు చేయటం ప్రారంభించాడు. తన రాజ్యంలోని దేవాలయాలనన్నింటినీ మూసి వేయించాడు. తద్దినాలు, పెళ్ళిళ్ళూ తన రాజ్యంలో జరగరాదని శాసించాడు. ధర్మ సత్రాలను సారాయి దుకాణాలుగా మార్పించాడు. మద్య, మాంసాదుల ధరలు బాగా తగ్గించి, వాటిని అన్ని వర్గాల ప్రజలూ సేవించాలని శాసించాడు.



దాంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. దైవభక్తి పరాయణుడిగా ఉన్న ప్రతాప్ హఠాత్తుగా ఇలా దయ్యం పట్టిన వాడిలా చేయటం గమనించిన ప్రజలు ఆ రాజ్య ప్రధానమంత్రిని కలిసి, మహారాజుగారి బుద్ధిని మార్చమని వేడుకున్నారు.

ప్రధానమంత్రికి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. కంచే చేను మేసిన విధంగా, రాజుగారే, అక్రమాలకి, అధర్మానికి పాల్పడితే అడ్డగించే వాళ్ళెవరు? చివరికి ఇతర మంత్రుల సూచన మీద, ప్రధానమంత్రి, ప్రక్క దేశంలోని 'రుద్రయ్య' అనే మహామాంత్రికుడిని కలిసి, మహారాజు ప్రతాప్ విచిత్ర ప్రవర్తన గురించి చెప్పి, ఏదైనా పరిహారం సూచించమని ప్రార్థించాడు.

అప్పుడు మంత్రవాది రుద్రయ్య, అంజనం వేసి రాజుగారికి వచ్చిన సమస్యకు గల కారణం కనుక్కొన్నాడు. రుద్రయ్య ఇలా చెప్పాడు ప్రధానమంత్రికి – "అయ్యా! మీ మహారాజుగారిని ఒక బ్రహ్మరాక్షసుడు ఆవహించి, ఇలాంటి అధర్మచర్యలు రాజుగారిచే చేయిస్తున్నాడు. ఆ బ్రహ్మరాక్షసుడిని నేను వదిలించగలను. కానీ అందుకు నా కుమార్తె జీవితాన్ని ఫణంగా పెట్టాలి".

అప్పుడు ప్రధానమంత్రి, "ఓయీ మాంత్రికుడా! నీవు ఏం చేసి అయినా మహారాజుకి పట్టిన పీడ వదిలించు. నీవు కోరింది ఇస్తా" అన్నాడు. అప్పుడు మాంత్రికుడు, ప్రధానమంత్రితో ఇలా అన్నాడు. "ఓ మంత్రి శేఖరా! మీరు సత్యసంధులు అని తెలిసి, ఒక కోరిక కోరుతున్నాను. మీరు నా కోరికను నెరవేరుస్తానని వాగ్దానం చేస్తే, నేను, నా కుమార్తెను ఉపయోగించి, మీ రాజుగారిని పట్టిన బ్రహ్మరాక్షసుడ్ని వదిలిస్తాను".

మంత్రవాది మాటలు విన్న ప్రధానమంత్రి, "ఓయీ మంత్రవాదీ! నీకు ఎలాంటి సందేహం వద్దు. మా రాజుగారికి నయం చెయ్యి నీ కోరికలు తీరుస్తారు" అన్నాడు. అప్పుడా మంత్రవాది ఇలా అన్నాడు.

"అయ్యా! నా కుమార్తెను మహారాణిని చెయ్యాలి, ఆమెకి, రాజుగారి వల్ల పుట్టబోయే బిడ్డని, ఈ రాజ్య సింహాసనానికి వారసుడుగా ప్రకటించాలి. ఈ రాజుగారి తదనంతరం, నా కుమార్తెకు పుట్టినవాడే మహారాజు కావాలి" మంత్రవాది షరతును అంగీకరించి మంత్రవాదిని పని ప్రారంభించమని కోరాడు ప్రధానమంత్రి.



మంత్రవాది కుమార్తె చందన మహా సౌందర్యవతి, చాలా శాస్త్రాలు పఠించిన మేధావి. ఆమె దగ్గరకు వెళ్ళిన మంత్రవాది, ఆమేం చేయాలో వివరించాడు. రాజ్యక్షేమం కోసం తన శీలాన్ని ఫణంగా పెట్టటానికి చందన అంగీకరించింది.

వెంటనే మంత్రవాది, ఆయన కుమార్తె ఒక రథంపై బయలుదేరి రాజధానికి వెళ్ళారు. మంత్రవాది కూతురితో సహా ప్రధానమంత్రి గృహానికి వెళ్ళి తన కుమార్తె చందనని, ఆయనకి పరిచయం చేసి, ఆ తర్వాత ఏమి చెయ్యాలో ఆయనకు చెప్పాడు.

మంత్రవాది, బ్రహ్మరాక్షసుడి పీడా వదిలించుకోటానికి చెప్పిన మార్గం ఏమిటో తెలుసుకున్న ప్రధానమంత్రి, మంత్రవాదిని అభినందించాడు.

ఇంతకీ మంత్రవాది, బ్రహ్మరాక్షసుడిని లొంగదీసుకునేందుకు చెప్పిన పథకం ఏమంటే, ఆ బ్రహ్మరాక్షసుడు అర్థరాత్రి 12 గంటల నుండి 12.30 గంటల దాకా రాజుగారి శరీరం వదిలి బయటకు వెళ్తాడు.

ఆ సమయంలో, రాజుగారు ఎవరైనా స్త్రీతో గడిపితే, ఇక రాజుగారి శరీరంలో తెల్లవారేదాకా, మళ్ళీ ప్రవేశించలేడు. అలా బ్రహ్మరాక్షసుడు, రాజుగారి శరీరాన్ని వదిలి ఇవతలకు వచ్చినపుడు, మంత్రాలు చదివి, ఆ రాక్షసుడిని ఒక జాడీలో బంధించాలి.

సరే పథకం ప్రకారం మంత్రవాది కుమార్తె చాలా అందంగా అలంకరించుకుని, అర్థరాత్రి 12 గంటల సమయంలో, అంటే బ్రహ్మరాక్షసుడు ఆహారం కోసం, రాజుగారి శరీరాన్ని వదలి, ఇవతలకి వచ్చే సమయానికి రాజుగారి పడక గదికి చేరింది. సరిగ్గా అర్థరాత్రి 12 గంటలు కాగానే, బ్రహ్మరాక్షసుడు, ఆకలి, ఆకలి అంటూ నరమాంసం కోసం, రాజుగారి శరీరాన్ని వదిలి, ఇవతలికి వచ్చి నగరంలోకి ఎగిరిపోయాడు గాలిలో.

రాక్షసుడు వెళ్ళటం గమనించిన మంత్రవాది కుమార్తె, తక్షణం రాజుగారి పడక గదిని చేరి, మత్తులో ఉన్నట్టుగా పడిఉన్న రాజుగారిని



ఆలింగనం చేసుకొని, అప్పటిదాకా బ్రహ్మచారిగా ఉన్న రాజుగారిని శృంగార క్రీడలకు పురికొల్పింది.

దాంతో రాజుగారు, మంత్రవాది కుమార్తెతో శృంగారకేళి సలిపి, ఆపై నిద్రకు ఉపక్రమించాడు. అర్థరాత్రి 12.30 దాటిన తర్వాత, నరమాంసం భక్షించి తృప్తి చెందిన బ్రహ్మరాక్షసుడు, మరల రాజుగారిని ఆవహించాలని, చూడగా, రాజుగారు, మంత్రవాది కుమార్తె గాఢాలింగనంలో ఉండి నిద్రిస్తున్నారు.

బ్రహ్మరాక్షసుడు తెల్లవారేదాకా, రాజుగారి పడక గది బయట వేచి ఉండాలని నిర్ణయించుకొని, అట్లు చేసినాడు. సరిగ్గా అదే సమయానికి, రాజుగారి పడక గది బయట, కావాల్సిన సరంజామాతో సిద్ధంగా ఉన్న మంత్రవాది, ఎర్రటి నిప్పులలో గుగ్గిలం వేసి, ఘూ, స్వా, క్లీం స్వాహా... ఇలా పెద్ద గొంతుతో మంత్రాలు పఠించసాగాడు.

దాంతో బ్రహ్మరాక్షసుడు గజ,గజ వణికి, పొగగా మారి, మంత్రవాది పక్కగా ఉన్న గాజు జాడీలో చేరాడు.

మంత్రవాది వెంటనే, ఆ జాడీకి బిరడా బిగించాడు. అప్పుడు సీసాలోని బ్రహ్మరాక్షసుడు, మంత్రవాదిని ప్రాధేయపడసాగాడు, తనని ఆ జాడీ నుండి విడుదల చేయమని.

అప్పుడా మంత్రవాది ఇలా అన్నాడు. “ఓరీ రాక్షసుడా! నిన్ను ఈ జాడీలోంచి విడుదల చేయాలంటే నీవు కొన్ని కోర్కెలు తీర్చాలి”.

మంత్రవాది మాటలు విన్న సీసాలోని బ్రహ్మరాక్షసుడు, అయ్యా మంత్రవాదిగారూ! మీ కోరిక ఏదైనా సరే తీరుస్తా, మా దైవం భేతాళుడిపైన ఆన అన్నాడు.

అప్పుడు మంత్రవాది ఇలా అన్నాడు, బ్రహ్మరాక్షసునితో, “నీవు ఇకపై ఈ నగరంలో సంచరించరాదు, ఈ దేశ సరిహద్దులలో మాత్రమే ఉంటూ, సరిహద్దుదాటి దేశంలోకి ప్రవేశించే శత్రువుల్ని పసిగట్టి, హతమార్చాలి.. ఇంకా ఈ దేశంలో పంటలు బాగా పండేటట్టు చేయాలి”.

మంత్రవాది మాటల్ని శ్రద్ధగా విన్న బ్రహ్మరాక్షసుడు, సరే అలాగే అన్నాడు. ఆపై బ్రహ్మరాక్షసుడు, ఆ దేశ సరిహద్దులో స్థిరంగా ఉన్నాడు.

రాజుగారు మంత్రవాది కుమార్తెను పెళ్ళాడి తన పట్టపురాణిగా చేసుకున్నారు. ఆమెకి పుట్టిన కుమారుడు, ఆ తర్వాత కాలంలో మహారాజు అయ్యాడు.

## విధి వ్రాత తప్పదు

పూర్వం గజపతి నగరాన్ని ధనపాలుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆయనకి ఎన్నాళ్ళు గడిచినా సంతాన భాగ్యం కలుగలేదు. ఆయన భార్య దమయంతి సంతానం కోసం ఎన్నో పూజలు, వ్రతాలు చేసేది. చివరికి శ్రీకూర్మం పుణ్యక్షేత్రానికి వెళ్ళి పుత్రకామేష్టి యాగం చేసారు ధనపాలుడు, అతని భార్య.

ఆ యాగఫలంగా దమయంతి గర్భవతి అయింది. ఆమెకి, చంద్రబింబం లాగా వెలిగిపోతున్న ఒక అబ్బాయి జన్మించాడు. ధనపాలుడు, ఆ అబ్బాయికి 'చంద్రవర్మ' అనే పేరు పెట్టాడు. చాలా గారాబంగా ఆ పిల్లవాడిని పెంచసాగారు ఆ రాజదంపతలు.

కాలం వేగంగా నడుస్తున్నది. ఆ రాజ్యానికి మంత్రి వక్రకేతు. ఆ వక్రకేతుకి ఎలాగైనా గజపతి నగరాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆశగా ఉండేది. కానీ మేధావి, పరాక్రమవంతుడు ఐన ధనపాలుడి ముందు వక్రకేతు చాణుక్యం పనిచేయలేదు.

అయితే తన మంత్రి వక్రకేతు గోతికాడి నక్కలా, తనని అంతం చేసి తన రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నాడని ధనపాలుడికి ఏ మాత్రం అనుమానం రాలేదు. వక్రకేతు పట్టు వదలకుండా ఎప్పటికప్పుడు కొత్తఎత్తులు, పై ఎత్తులు వేస్తూ, రాజుగారిని నిర్మూలించాలని ప్రయత్నిస్తూనే వున్నాడు.

చంద్రవర్మకి 21వ సంవత్సరం వచ్చింది. ధనపాలుడు తన కుమారుడికి యువరాజు పట్టాభిషేకం చేసాడు. ఆ రోజు అర్థరాత్రి దాటిన తర్వాత సైనికులు ఏమరుపాటుగా ఉన్న సమయం పసిగట్టి, వక్రకేతు తన మనుషుల సహాయంతో, అంతఃపురంలో ప్రవేశించి, రాజుని, రాణిని హత్యచేసాడు.



రాజుకి నమ్మకంగా ఉండే కొందరు మంత్రుల్ని వెంటనే ఖైదు చేయించాడు. అయితే అదృష్టవశాత్తు చంద్రవర్మ, ఆ సమయంలో అంతః పురం బయట, ఒక మామిడి తోటలో ఉండటం వల్ల వక్రకేతు మనుషుల చేతిలో మరణించకుండా మిగిలాడు.

అయితే ప్రజలందరూ, యువరాజు చంద్రవర్మకి బాసటగా నిలవటం వల్ల చంద్రవర్మని బహిరంగంగా ఏమీ చెయ్యలేక, కుట్రపన్ని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు వక్రకేతు.

రాజు, రాణీల శవాల్ని అదృశ్యం చేసేసి, ఎవరో మంత్రవాది వాళ్ళని ఎత్తుకుపోయాడని యువరాజు చంద్రవర్మనీ, ఆ రాజ్యప్రజల్నీ నమ్మించాడు ఆ దుష్ట మంత్రి వక్రకేతు. చంద్రవర్మను చంపటానికి, అతను తినే ఆహారంలో విషం కలిపించాడు వక్రకేతు.

అయితే అదృష్టవశాత్తు, ఆ ఆహారాన్ని యువరాజు పెంపుడు కుక్క తిని చనిపోయింది. దాంతో చంద్రవర్మకి అనేక అనుమానాలు కలగసాగాయి. తన తల్లిదండ్రులు ఏమయ్యారు? తనపై హత్యాప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయి లాంటి సమాధానం దొరకని ప్రశ్నలు చంద్రవర్మను వేధించసాగాయి.

ఒకరోజు వక్రకేతు, చంద్రవర్మ దగ్గరికి వచ్చి, అతని చేతికి ఒక లేఖ ఇచ్చి, యువరాజా! మీరు ఈ లేఖను, మన పొరుగు రాజ్యమంత్రి అయిన రాహుశర్మకి ఇవ్వండి.

అతడు మీకు చాలా మేలు చేస్తాడు, మీరు అక్కడ నుండి రాగానే, ఈ గజపతి నగరానికి రాజుగా పట్టాభిషేకం జరిపిస్తాను. దాంతో నా బాధ్యత తీరుతుంది అన్నాడు.

చంద్రవర్మకి, వక్రకేతుపై నమ్మకం తక్కువగా ఉండటం వల్ల అతడిని అనుమానిస్తున్నా, పైకీ ఏమీ మాట్లాడకుండా వక్రకేతు చెప్పినట్టే, పొరుగు రాజ్యనికి లేఖ తీసుకొని బయలుదేరాడు.

ఇంతకీ పొరుగురాజ్య మంత్రి రాహుశర్మ స్వయానా వక్రకేతుకి తమ్ముడే. అయితే ఈ విషయం ఆ అన్నదమ్ములకి తప్ప వేరే మానవమాత్రుడు ఎవరికీ తెలీదు.

చంద్రవర్మ తన పంచకళ్యాణీ అనే శ్వేతాశ్వాన్ని అధిరోహించి, పొరుగు రాజ్యానికి బయలుదేరాడు. సరిగ్గా సూర్యాస్తమయ సమయానికి పొరుగు రాజ్యానికి చేరాడు. ఉదయం నుండి విరామం లేకుండా ప్రయాణం చేస్తుండటం వలన చంద్రవర్మ అతని గుర్రం పూర్తిగా అలిసిపోయారు. దాంతో కాసేపు ఎక్కడైనా విశ్రాంతి తీసుకుందామని తలచాడు.

అతనికి ఒక పెద్ద పూలతోట కన్పించింది. దాంతో చంద్రవర్మ గుర్రం దిగి, దాన్ని కళ్ళెం పట్టుకొని నడిపించుకుంటూ, ఆ తోటలో ఉన్న ఒక బావి దగ్గరకు వెళ్ళాడు. ఆ బావిలోంచి నీళ్ళు తోడి కాసిని తాగాడు. ఆహా! ఈ నీళ్ళు కొబ్బరి నీళ్ళకన్నా మధురంగా, మిక్కిలి చల్లగా ఉన్నాయి అనుకుంటూ మరికాసిని మంచి నీళ్ళు తాగి, గుర్రానికి చేదతో నీళ్ళు తోడి, త్రాగించాడు.

గుర్రం మహాఆత్రంగా ఆ నీటిని త్రాగింది. చంద్రవర్మకి ఆ వాతావరణం చాలా ఆహ్లాదంగా అనిపించింది. పున్నమిచంద్రుడు, ఆకాశంలో చాలా పెద్ద ప్రమాణంలో బంగారు గోళంలా మెరిసిపోతూ ఉదయిస్తున్నాడు. ఆ దృశ్యాన్ని చూస్తూ చంద్రవర్మ తనని తానే మరిచిపోయాడు.

గుర్రం అక్కడక్కడ మొలిచిన పచ్చగడ్డిని నమల సాగింది. ఆ పూల తోట మధ్యలో ఉన్న ఒక విశాలమైన రాయిపై కాసేపు నడుము వాల్చాడు. ఆ పూలతోటలో అన్ని రకాల పూలపందిళ్ళు ఉన్నాయి. గులాబీలు, మల్లెలు, సన్నజాజులు, సంపెంగి పూలపరిమళాలు ఆ తోట అంతా వ్యాపించాయి.

ఆకాశం నుండి ధారగా పడుతున్న వెన్నెల అలా, అలా వీస్తోంది. ఆ మలయమారుతం, ఒక అద్భుతమైన పుష్ప సుగంధం చంద్రవర్మని ఇంకో లోకానికి తీసుకెళ్ళింది. ఇంతలో చంద్రవర్మకి చిన్నగా కునుకు పట్టింది. ఉదయం నుండి ఏమీ తినకుండా వందమైళ్ళు ప్రయాణించటం వల్ల అతను బాగా అలిసిపోయి ఉన్నాడు. చిటికెలో అతను గాఢనిద్రలోకి జారుకున్నాడు.

సరిగ్గా అప్పుడే, ఆ దేశ మంత్రి రాహుశర్మ కుమార్తె 'విషయ' ఆ తోటలోకి చెలికత్తెలతో విహారానికి వచ్చింది. అందరూ, ఆడుతూ, పాడుతూ, ఆ తోటలో తిరుగుతూ, పూలు కోసుకుంటున్నారు. మంత్రి కుమార్తె, విషయ



తాను ఎప్పుడూ ఇష్టపడి కూర్చునే శిలావేదిక దగ్గరకు వెళ్ళింది, కాసేపు కూర్చుందామని. ఆమెకు చంద్రవర్మ అక్కడ కన్పించాడు. ఆకాశంలోని చంద్రుడు భూమిపైకి దిగి వచ్చాడా అన్న సంభ్రమం కల్గింది ఆమెకు.

చంద్రవర్మను చూసిన తొలిచూపులోనే, ఆమె చంద్రవర్మని ప్రేమించసాగింది. ఎవరు ఈ సుందరాంగుడు? ఎక్కడి వాడు? అన్న ఆలోచనలు అధికమై, అతన్ని పరిశీలనగా చూసింది. అతని నడుముకి ఉన్న ఒక చిన్న సంచీ కనిపించింది. ఆ సంచీని తీసి, తెరిచి చూడగా, ఒక ఉత్తరం కన్పించింది. కొంచెం ఆసక్తిగా అనిపించి ఆ ఉత్తరం చదివింది. ఆ ఉత్తరంలో ఇలా వ్రాసి ఉన్నది.

"ఇతడు మన శత్రువు. ఇతనికి విషము నిమ్ము"

ఇట్లు
నీ అన్న వక్రకేతు.

ఆ ఉత్తరం వ్రాసింది తన పెద్దనాన్నగారని, ఈ ఉత్తరం తెచ్చిన వ్యక్తికి విషం పెట్టి చంపమని, తన తండ్రికి వ్రాసారని, ఆమెకు అర్థం అయింది. తన మనసు దోచిన, ఆ అందగాడిని తను ఎలాగైనా రక్షించాలి, ఆపై అతడిని పెళ్ళాడాలి అని 'విషయ' నిర్ణయించుకుంది. ఆమె కూడా మంత్రిగారి కుమార్తె కావున అసమాన మేధస్సు కలిగినదియై ఉన్నది.

దాంతో ఆమె, తన చిటికెన వ్రేలి గోరుతో, తన కంటి చివర ఉన్న కాటుక తీసి, తన పెదనాన్న వక్రకేతు వ్రాసిన ఉత్తరంలో అక్షరాలను కొద్దిగా మార్పు చేసింది. అప్పుడు ఆ ఉత్తరంలో ఇలా ఉన్నది.



ఇతడు మన శత్రువు. ఇతనికి విషయనిమ్ము.
అంటే 'విషము' అనే పదాన్ని ఎలా మార్చింది....
'ము' అనే అక్షరాన్ని కాటుక అంటిన గోరుతో 'య' గా మార్చింది.

అంటే ఈ ఉత్తరం తెచ్చినవాడు మనకి శత్రువు. వీడికి నీ కూతురు 'విషయ'ను ఇచ్చి పెండ్లి చేయి. అలా చేయటం వల్ల ఈ శత్రువు మనకి మిత్రుడు అవుతాడు అని అర్థం వచ్చింది.

ఈ విధంగా ఆ తెలివైన సుందరి 'ఒక్క దెబ్బకి రెండు పిట్టలు' అన్న చందంగా, కేవలం ఒక్క అక్షరాన్ని మాత్రమే మార్చి, తన కలల రాజుని కాపాడుకున్నది. పైగా తను నోరు తెరిచి అడగకుండానే, అతడ్ని తన భర్తగా, తన పెద్దలే చేసే విధంగా చేసింది. ఆ తర్వాత ఆమె, తన చెలికత్తెలతో సహా ఆ పూల తోటని వదిలి అంతఃపురానికి వెళ్ళిపోయింది.

ఇక అర్ధరాత్రి దాటాక గానీ చంద్రవర్మకు మెలుకువ రాలేదు. అప్పుడు వెళ్ళి ఆ రాజ్యమంత్రి గారిని కలవటం బాగుండదని తలచి, తెల్లారేదాకా ఆ తోటలోనే గడిపి, ఉదయం మంత్రిగారిని కలిసి, తాను తెచ్చిన ఉత్తరం ఆయనకిచ్చాడు. ఆ ఉత్తరం చదివిన రాహుశర్మ, అన్నగారు ఉత్తరంలో వ్రాసిన విధంగా చంద్రవర్మకు, తన కుమార్తె 'విషయ' నిచ్చి, ఆ రాత్రికే పెళ్ళి జరిపించాడు.



ఆ తర్వాత, చంద్రవర్మ భార్యతో సహా ఆ మర్నాడే, తన రాజ్యానికి చేరాడు. 'శవంగా' తిరిగి వస్తాడనుకొన్న యువరాజు, భార్యతో సహా రావటం వక్రకేతుకి మింగుడు పడలేదు. ఇంక వక్రకేతు, చంద్రవర్మకి ఏ అపకారం చేయలేకపోయాడు.

కారణం ఇప్పుడు చంద్రవర్మ తమ అల్లుడు. దాంతో చంద్రవర్మకి పట్టాభిషేకం చేసి, తన తమ్ముడి కుమార్తెను మహారాణిగా చేసి ఆనందించాడు వక్రకేతు. విధి వ్రాతను ఎవరూ తప్పించలేరు. అందుకే వక్రకేతు ఆశించింది జరగలేదు.



# కథ, కథ, కథ కంగుభళా!

పూర్వం ధూళిపూడి అగ్రహారంలో తాతాచారి, తాయారమ్మ అనే శ్రీవైష్ణవ దంపతులు ఉండేవారు. వాళ్ళకి పెళ్ళి అయి ఎన్నేళ్ళు గడిచినా పిల్లలు లేరు. దాంతో వాళ్ళు అనేకమంది దేవుళ్ళకి పూజలు చేసారు. అబ్బే ఫలించలేదు. చివరికి వాళ్ళు బైరాగి ఇచ్చిన తావీజులు సైతం చేతులకు కుట్టుకున్నారు. అయినా ఫలితం రాలేదు.

దానితో తాతాచారికి అర్ధమయిపోయింది. ఇక తమకు పిల్లలు పుట్టరని. తాయారమ్మకి మాత్రం గట్టి నమ్మకం, ఏ దేవుడైనా కరుణించి ఎప్పటికైనా తనకి బిడ్డలు పుడతారని.

దాంతో ఆమె ఒక స్వామీజీ గారి ఆశ్రమానికి వెళ్దామని భర్తను పోరసాగింది. భార్య సణుగుడు భరించలేక తాతాచారి, భార్యను తీసుకొని స్వామీజీ గారి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ స్వామీజీ తాతాచారి కేసి చూసి, నాయనా! నీకు పిల్లలు కావాలంటే ఒక పూజ ఉంది. చేస్తావా? అన్నాడు.



సరే, ఏం పూజో చెప్పండి స్వామీ ఇప్పుడే చేస్తాం అన్నారు తాతాచారి దంపతులు. అప్పుడు ఆ స్వామీజీ, ఇలా అన్నాడు. "ఈ పూజ నలభై రోజులు చెయ్యాలి. ఆహారం పూర్తిగా మానివేసి, పాలు మాత్రమే తీసుకోవాలి. అలాగే ఈ నలభై రోజులు రాత్రి నిద్రపోవటానికి ముందు ఏదైనా దేవుడి కథ విని పడుకోవాలి".

స్వామీజీ చెప్పింది విన్ని తాయారమ్మ చాలా సంతోషం స్వామీ, మీరు చెప్పిన ఈ పూజ రేపటి నుండే ప్రారంభిస్తాం అన్నది సంబరంగా.

తాతాచారికి మాత్రం, నలభైరోజులు ఉండాల్సిన 'ఉపవాసం' దెయ్యంలాగా కన్పించసాగింది. మూడు పూటలా, సుష్టుగా భోజనముచేసే తాతాచారికి, నలభైరోజులు భోజనం మానేయాలంటే కష్టం కాదూ!

సరే 40 రోజుల పూజ మొదలుపెట్టారు ఆ దంపతులు. మొదటిరోజు ఆకలి ఎంత వేసినా తట్టుకొని ఉపవాసం ఉన్నారు అ దంపతులు. ఆ రాత్రికి భారతంలో గాంధారి సంతానం గురించి కథ చెప్పాడు తాతాచారి. శ్రద్ధగా విని, నిద్రపోయింది తాయరమ్మ.

సరే రెండవరోజు ఉపవాసం, తాతాచారికి నీరసంగా ఉన్నది. అతడికి సహజంగానే తిండి యావ జాస్తి. రెండో రోజు కుంతీదేవికి పంచభూతాల వల్ల కల్గిన పాండవుల కథ చెప్పాడు. కథంతా విన్న తాయారమ్మ, ఛీ, పాడు కథ, వేరే వాళ్ళ ద్వారా పిల్లల్ని కనటం ఎంత పాపం అన్నది. దాంతో తాతాచారి గతుక్కుమన్నాడు.

మూడోరోజు ఉపవాసం పూజ పూర్తి అయింది. నైవేద్యంగా ఉంచిన శేరుపాలని, చెరో అర్ధశేరు త్రాగి కడుపు నింపుకున్నారు తాయరమ్మ దంపతులు. ఆ రోజు రాత్రికి దశరథుడి పుత్రకామేష్టి యాగం, రాముడి జననం గురించి చెప్పాడు తాతాచారి, తాయారమ్మకి ఈ కథ బాగా నచ్చింది.

నాల్గోరోజు పాలు త్రాగాలంటే ఆ దంపతులకి వాంతి వచ్చినంత పని అయింది. ఛీ, వెధవ పాలు రోజూ, ఎవడు త్రాగుతాడు... నాకొద్దు అన్నాడు తాతాచారి ముఖం అసహ్యంగా పెట్టి.

అప్పుడు తాయారమ్మ, ఛీ పాడు ఏంటామాటలు, దేవుడికి నైవేద్యం పెట్టిన పాలు వద్దనకూడదు అంటూ, తాతాచారి నోరు బలవంతంగా తెరిచి, గ్లాసుడు పాలు అతడి నోట్లో గుమ్మరించింది.

ఇక గత్యంతరంలేక, గరళాన్ని మింగిన శివుడిలా, వెగటు కల్గిస్తున్న ఆ పాలని త్రాగాడు తాతాచారి. ఆ రోజు శ్రీకృష్ణుడు చెరసాలలో పుట్టిన కథ చెప్పాడు. తాయారమ్మ ఆనందంగా విని హాయిగా నిద్రపోయింది. తాతాచారి మాత్రం ఇంటి కప్పు కేసి చూస్తూ రాత్రంతా జాగారం చేసాడు.

ఐదవరోజు, పూజ పూర్తి అయింది. యథాప్రకారం తాయారమ్మ అర్థశేరు ప్రాలుత్రాగి, భర్తకి కూడా పాలు ఇచ్చింది త్రాగమని. తాతాచారి,



ఊహు! నాకొద్దు, నేను త్రాగను అన్నాడు చిరాకుగా. అబ్బే అదేం కుదరదు తాగి తీరాల్సిందే, అని తాతాచారి చేత బలవంతంగా తాగించింది తాయారమ్మ.

సరే, చచ్చినట్టు త్రాగి, ఆ రోజు రాత్రి లవకుశల కథ చెప్పాడు. ఆ కథ విన్న తాయారమ్మ, తనకి కూడా 'లవకుశులు' లాంటి అందమైన పిల్లలు పుట్టినట్టుగా కలకంటూ నిద్రపోయింది.

తెల్లారింది. ఆ దంపతులు ఇద్దరికీ ఐదురోజులుగా తిండిలేకుండా, కేవలం పాలు మాత్రమే తాగటం వల్ల, మహానీరసంగా ఉంది. తాతాచారికి ఒక ఆరు ఎకరాల పొలం ఉన్నది. దాన్ని సాగు చేసుకొని ఆ వచ్చే ఆదాయంతో వాళ్ళు కుటుంబం జీవిస్తుంది. ఈ వ్రతం ప్రారంభించిన దగ్గర నుండీ, ఒంట్లో ఓపిక లేక పొలం వెళ్ళటం మానేసి, ఇంట్లోనే కూర్చోసాగాడు తాతాచారి.

ఆ రోజు ఆరవరోజు మధ్యాహ్నం. యథాప్రకారం పాలు త్రాగి నీరసంగా, నవారు మంచంపై నడుం వాల్చాడు తాతాచారి. కళ్ళు మూసుకొని, పడుకొన్న తాతాచారికి, ఒక కల వచ్చింది. ఆ కలలో అతడు అన్ని రకాల పదార్థాలతో భోజనం చేస్తున్నట్టు కనిపించింది. ఎర్రటి ఆవకాయ, కమ్మటి నెయ్యి కలిపిన దబ్బకాయ పప్పన్నం, మహారుచిగా ఉన్న గోంగూర పచ్చడి, నోరు ఊరించే పులిహోర, కర, కరలాడే చేగోడీలు... తాతాచారి కలలో కనిపించగా, వాటిని అందుకుందామని, మంచంపై నుండి క్రిందికి దొర్లాడు. ఆ దెబ్బకు నిద్రమత్తు వదిలి, లేచి కూర్చున్నాడు.

ఆరవ రోజు రాత్రి గంగానదికి భీష్ముడు పుట్టిన కథ చెప్పాడు తాతాచారి, మౌనంగా విని నిద్రపోయింది తాయారమ్మ. తాతాచారికి మాత్రం నిద్రరావటంలేదు. అతనికి కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. ఆరు రోజులు నుండి తిండి లేకపోవటం వల్ల, పొట్ట పోయి, డొక్కలు బయట పడ్డాయి.

మధ్య మధ్యలో ప్రేగులు అరుస్తున్నాయి తిండి కోసం. వేరే మంచంపై నిద్రపోతున్న భార్య కేసి చూసాడు. ఆమె గుర్రుపెట్టి, హాయిగా నిద్రపోతున్నది. తాతాచారికి ఆశ్చర్యంగా అనిపించింది. దీని శిగదరగా,

నాకు తిండి లేక రాత్రుళ్ళు నిద్రపట్టడం లేదు, ఇది మాత్రం తిండి లేకున్నా ఎలా హాయిగా నిద్రపోతుంది చెప్మా అని ఆశ్చర్యపడ్డాడు.

మర్నాడు ఏడవరోజు పూజ పూర్తి కాగానే పాలుత్రాగి, వాకిట్లో అరుగు మీద కూర్చుని, వీధిలో వచ్చిపోయే వాళ్ళని గమనిస్తూ కాలక్షేపం చేస్తున్నారు తాతాచారి, అతని భార్య. మరి ఇంక ఏ పని చేసేది లేదు. చేసే ఓపిక కూడా లేదు వాళ్ళకి.

ఇంతలో ప్రక్క గ్రామంలో ఉన్న తాతాచారి అన్నగారు రంగాచారి, తాతాచారి ఇంటికి వచ్చాడు. అన్నను చూడగానే లోపలికి రమ్మన్నాడు తాతాచారి. రంగాచారి దొడ్లో బావి దగ్గర స్నానం చేసి, ఇంట్లోకి వచ్చి, తాయారమ్మతో ఇలా అన్నాడు....

తాయారమ్మా!.. అన్నం వడ్డించు తల్లీ, నిన్న శనివారం ఉపవాసం ఉన్నా... బాగా ఆకలిగా ఉంది. బావగారి మాట విన్న తాయారమ్మకి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

పిల్లల కోసం వ్రతం చేస్తూ వారం రోజులుగా ఉపవాసం ఉంటున్నాం అంటే ఆయన హేళనగా నవ్వుతాడేమోననిపించింది. మేమే వారం రోజులుగా భోజనం వండుకోవటం లేదు, అందుకే నీకు ఇప్పుడు భోజనం పెట్టలేకపోతున్నాం అని అన్నగారికి, ఆమె పరిస్థితిని వివరించాడు తాతాచారి. ఓహో! అదా సంగతి, వారం రోజులుగా పస్తులుంటున్నారా? అందుకేనా అలా తోటకూరకాడల్లాగా వాడిపోయి ఉన్నారు అన్నాడు రంగచారి పెద్దగా నవ్వుతూ.

సరే, కానీండి, మీరు త్రాగే పాలే నా మొహాన పోయండి అన్నాడు రంగాచారి. వెంటనే గ్లాసుడు వేడిపాలు తెచ్చి బావగారికి ఇచ్చింది తాయారమ్మ. రంగాచారి మంచి ఆకలి మీదున్నాడు కాబోలు, ఆ పెద్ద గ్లాసుడు పాలు, గట, గట త్రాగేసి, ఖాళీ గ్లాసు మరదలికి ఇచ్చాడు. ఆ తర్వాత తాతాచారితో ఇలా అన్నాడు.

రేయ్ తమ్ముడూ, ఒకసారి మన పొలం దాకా వెళ్ళి వద్దాం వస్తావా. ఒంట్లో ఓపిక లేకున్నా, అన్నగారు రమ్మన్నారు కనుక, బయలు దేరాడు. ఇద్దరూ, ఊరి చివర ఉన్న పొలం చేరారు.



మధ్యమార్గంలో రంగాచారి తమ్ముడితో ఇలా అన్నాడు. ఓరే తాతాచారి నీ అంత వెర్రిసచ్చినాడు, మన కుటుంబంలోనే లేడురా.... అన్నగారి మాటలు విన్న తాతాచారి, అందేంటి అన్నా, అలా అన్నావు అన్నాడు ఆశ్చర్యంగా. మరి ఇంకేం అనమన్నావు, నీ పెళ్ళాం మాత్రం రోజూ



పులిహోర తింటూ, ఉపవాసం ఉంటున్నానని అబద్ధాలు చెపుతూ, నీకు మాత్రం ఏం పెట్టకుండా కేవలం పాలే ఇస్తున్నది అన్న విషయం నీకు తెలుసా అన్నాడు రంగాచారి కోపంగా.

అన్నగారి మాటలు విన్న తాతాచారి తెగ ఆశ్చర్యపడి, అదేంటన్నయ్యా, అలా అంటావు, నా భార్య పిల్లలు పుట్టాలని నిష్టగా ఉపవాసం ఉంటే, ఆమె రోజూ పులిహోర తింటున్నది అంటావేంటి!? అన్నాడు.

అప్పుడు రంగాచారి ఇలా అన్నాడు. ఓరీ, పిచ్చి నాగన్నా, మీ పెరట్లో చెత్తకుప్ప మీద పులిహోర తినిపారేసిన అరటి ఆకులు ఉన్నాయి. ఇందాక స్నానం చేద్దామని పెరటిలోకి వెళితే కనిపించాయి ఆ ఆకులు. దాంతో తాతాచారికి, తాయారమ్మ మీద అనుమానం మొదలయింది. ఆమె రహస్యంగా పులిహోర చేసుకు తింటున్నది అని.

సరే సాయంత్రం కాగానే, రంగాచారి తమ్ముడు దగ్గర వీడ్కోలు తీసుకుని తన ఊరికి బయలుదేరాడు. తాతాచారి మాత్రం ఇంటికి వెళ్ళకుండా, ఆ చెట్లక్రింద, ఈ చెట్ల క్రింద కాలక్షేపం చేసి, అర్ధరాత్రి దాటాక ఇల్లుచేరి, తలుపు తట్టకుండా, వాకిటి కిటికీ లోంచి, లోపలకి తొంగి చూసాడు.

అక్కడ కనపడ్డ దృశ్యం తాతాచారికి నోట మాటలు రాకుండా చేసింది. ఏమిటా దృశ్యం... 'తాయరమ్మ, గిన్నెడు పులిహోరని పెద్ద ఆకు మీద ఆరబోసి, పెద్ద పెద్ద ముద్దలుగా చేసి, గుటుక్కు గుటుక్కుమని మింగుతున్నది'. దాంతో తాతాచారికి అర్థం అయింది భార్య తాయరమ్మ రహస్యం.